www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కల్యాణం కమనీయం

- భద్రాద్రిలో వైభవంగా సీతారాముల కల్యాణం
- ప్రభుత్వం తరఫున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతి కుమారి
- హాజరైన మంత్రులు భట్టి, కొండా సురేఖ, పొంగులేటి
- నేడు భద్రాద్రిలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహణ
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న గవర్నర్

3



గురువారం | 18-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 19

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: దశమి సా. 5.32 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 7.57 తదుపరి మఖ; వర్జ్యం: రా.9.27-11.15; దుర్ముహూర్తం: ఉ.10.09-10.59, మ.3.08-3.58; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.28

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూఏఈలో జలవిలయం

- ఏడాదిన్నరలో కురవాల్సిన వాన ఒక్కరోజులోనే.. దుబాయ్‌కి వరద పోటు
- ఎయిర్‌పోర్టులోకి మోకాలి లోతు నీరు.. వరదలో ఇళ్లు, ప్రఖ్యాత మాల్స్
- ఒమాన్, బహ్రెయిన్‌లోనూ వానలు.. వరదలో సిరిసిల్ల వాసి భాస్కర్ మృతి

2



దుబాయ్‌లోని ఓ ప్రధాన రోడ్డును వరద ముంచెత్తడంతో మునిగిన వాహనాలు







ఎడారిలో వసంతం

- సౌదీలో పచ్చగా చిగురిస్తున్న నేలలు
- మక్కా-మదీనా నడుమ పచ్చదనం
- సత్ఫలితాలనిస్తున్న 'గ్రీన్ ఇనిషియేటివ్'

2

తెలంగాణలో భానుడి ప్రతాపం

- నల్లగొండ జిల్లా నిడమనూరులో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత
- రాష్ట్రంలో మండిన ఎండలు.. పిడుగుపడి ఒకరు.. వడదెబ్బతో ముగ్గురి మృతి
- నేడు, రేపు వడగాలులు.. శని, ఆదివారాల్లో వర్షాలు

3



వట్టిపోయి నెర్రలు బారిన నల్లగొండ మండలం రామారం చెరువు

జీవన్మరణమే...!

అన్ని పార్టీలకూ పెను సవాల్‌గా మారిన లోక్‌సభ ఎన్నికలు

- మెజారిటీ స్థానాలు గెలిస్తేనే కాంగ్రెస్ సర్కార్‌కు సుస్థిరత!
- ప్రభుత్వం కూలిపోతుందంటూ ఇప్పటికే విపక్షాల ప్రచారం
- ఎక్కువ సీట్లల్లో పాగా వేస్తేనే రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు
- ప్రధాన ప్రతిపక్ష స్థానంపై కన్నేసిన కమలనాథులు
- బీఆర్‌ఎస్ ఉనికి ఉండాలంటే కనీస స్థానాల్లో గెలవాల్సిందే
- అధికారం కోల్పోయాక ఇబ్బందుల్లో గులాబీ పార్టీ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలోని అన్ని పార్టీలకు పెను సవాల్‌గా మారాయి. ఈ ఎన్నికల్లో సాధించే ఫలితాలు రాబోయే రోజుల్లో జరగబోయే రాజకీయ పరిణామాలను నిర్దేశించబోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లపాటు సుస్థిర పాలన సాగించాలన్నా, బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలన్నా, బీఆర్‌ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలన్నా.. ఈ ఎన్నికల ఫలితాలే గీటురాయిగా మారనున్నాయి. దాంతో ఈ ఎన్నికలు అన్ని పార్టీలకూ జీవన్మరణ సమస్యగా మారాయి. ఒక రకంగా చెప్పాలంటే.. రాష్ట్రంలోని రాజకీయ భవిష్యత్తు పరిణామాలకు ఈ ఎన్నికలు నాంది పలకనున్నాయి. రాష్ట్రంలో నాలుగు నెలల క్రితమే అసెంబ్లీ ఎన్నికలు ముగియడం, నాటి అధికార బీఆర్‌ఎస్ ఓటమి చెంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కాగా, కొత్త ప్రభుత్వం ఐదేళ్లపాటు కొనసాగాల్సి ఉన్నందున.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల పట్ల అటు రాజకీయ పార్టీలతోపాటు నాయకులకు, ఇటు ఓటర్లకు పెద్దగా ఆసక్తి ఉండకూడదు. కానీ, ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు మించిన ప్రాధాన్యం పార్లమెంటు ఎన్నికలు సంతరించుకున్నాయి. ఆయా పార్టీలకు కత్తిమీద సాములా మారాయి. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పుపైనే పార్టీల భవిష్యత్తు

మిగతా 13వ పేజీలో...



నేటి నుంచే నామినేషన్లు

- ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్ విడుదల
- మంచిరోజు కావడంతో రెడీ అయిన అభ్యర్థులు
- ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న పరిశీలన.. 29 వరకు ఉపసంహరణ
- నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం: సీఈవో
- 4వ దశలో తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లో

13

మెజారిటీ సీట్లే లక్ష్యంగా బీజేపీ

సీక్రెట్ ఆపరేషన్!

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- అభ్యర్థులకు అండగా షాడో టీంలు
- అమిత్ షాకు నివేదికలు!



హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ స్థానాలపై గురిపెట్టిన కమలం పార్టీ, అందుకు అనుగుణంగా సీక్రెట్ ఆపరేషన్ చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. ఈ బృందాలు అత్యంత రహస్యంగా నాలుగు విభాగాల్లో పనిచేస్తున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో, రాష్ట్ర పార్టీ కార్యాలయంలో, జాతీయ పార్టీ కార్యాలయంలో మూడు ప్రత్యేక బృందాలు పనిచేస్తుండగా, పార్టీ అభ్యర్థులకు అండగా షాడో టీంలు కొనసాగుతున్నాయి. ఈ నాలుగు బృందాలు కొన్ని కీలక నివేదికలను కేంద్ర హోం మంత్రి, పార్టీ అగ్రనేత అమిత్ షా కార్యాలయానికి నివేదిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అమిత్ షా, తెలంగాణలో ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకు అనుగుణంగా కొంత మంది అభ్యర్థులకు స్థానిక నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా సలహాలు, సూచనలు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా సొంతంగా 370 సీట్లను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ అగ్రనాయకత్వం, అందులో తెలంగాణ నుంచి కనీసం 10 గెలుచుకోవాలని రాష్ట్ర పార్టీకి నిర్దేశించింది. ఈ లక్ష్యానికి అనుగుణంగా ఒకటి, రెండు మినహా మిగతా

మిగతా 12వ పేజీలో...

బీజేపీ అభ్యర్థుల నామినేషన్లకు ఢిల్లీ నుంచి నేతలు

- కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల రాక
- నేటి నుంచి 25 వరకు నామినేషన్ల పర్వం
- నేడు నామినేషన్ వేయనున్న మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, మెదక్ అభ్యర్థులు

13

వైద్య చికిత్సకు రూ. లక్ష తీసుకోవచ్చు!

- పీఎఫ్ నిబంధనల్లో మార్పు
- విత్‌డ్రా పరిమితిని రెట్టింపు చేసిన భవిష్యనిధి సంస్థ

2

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులతో నేడు కేసీఆర్ భేటీ

- ఒక్కొక్కరికి రూ.95 లక్షల చెక్కు ఇవ్వనున్న పార్టీ అధినేత
- ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం

13

ఆ 32 కోట్లు ఎవరివి?

- అసెంబ్లీ ఎన్నికల వేళ పట్టుబడిన నగదును ఎవరూ తీసుకెళ్లని వైనం
- రూ.43 కోట్లలో తీసుకెళ్లింది 11 కోట్లే!
- సొమ్మును కోర్టుకు సమర్పించిన అధికారులు
- లెక్కలు చూపలేకే డబ్బును వదిలేశారా?
- గత నెల రోజుల్లో రూ.14.30 కోట్లు స్వాధీనం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నిక ఏదైనా.. ఓటు పడాలంటే నోటు పంచాల్సిందే! ప్రచారం నుంచి ప్రలోభం వరకూ అంతా పైసలతోనే! అభ్యర్థులు అడుగు బయటపెట్టాలంటే ఆర్థిక వనరులు దండిగా ఉండాల్సిందే! ఈ క్రమంలో ఎన్నికల సమయంలో వేర్వేరు ప్రాంతాలకు డబ్బును తరలిస్తూ తనిఖీల్లో దొరికిపోతున్నారు. ఇందులో కొందరు అవసరమైన పత్రాలు చూపించి డబ్బును తీసుకెళ్తుండగా.. మరికొందరు భారీ మొత్తాలను కూడా వదిలేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో పట్టుబడిన నగదులో అత్యధిక మొత్తం ఇప్పటికీ కోర్టు అధీనంలోనే ఉంది. ఎవరూ రాకపోవడంతో కేసులు నమోదు చేసి, కోర్టుకు సమర్పించినట్లు అధికారులు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.43.80 కోట్ల నగదు, రూ.3.77 కోట్ల విలువైన మద్యం, రూ.3.50 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్, రూ.25.05 కోట్ల విలువైన బంగారం, వెండి, ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్న/నిల్వ చేసిన రూ.17.35 కోట్ల విలువైన వస్తువులు పట్టుబడ్డాయి. వీటిలో సింహభాగం బంగారం, వెండిని తీసుకెళ్లగా.. మెజారిటీ నగదు కోసం ఎవరూ రాకపోవడం

మిగతా 10వ పేజీలో...



12

3 నెలల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెడతాం

- కేసీఆర్.. మా జోలికొస్తే తడాఖా చూపిస్తాం
- 30 మంది ఎమ్మెల్యేలు వస్తామంటున్నారు
- లోక్‌సభ ఎన్నికల్లో మీకు ఒక్క సీటూ రాదు
- కవిత జైలుకెళ్లడంతో కుటుంబానికి మెంటల్ లేచింది.. ఆమెకు రెండేళ్ల దాకా బెయిల్ రాదు
- యాదాద్రి ప్లాంట్ అవినీతిపై జగదీశ్ జైలుకే..
- ఎన్నికల కోడ్ తర్వాత రుణమాఫీ అమలు
- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గవర్నర్‌గా ఉన్నప్పుడు నా ఫోనూ ట్యాప్ చేశారు



2022లోనే చెప్పా

- నాటి సర్కారు విషయాన్ని పక్కదారి పట్టించింది
- ప్రస్తుత దర్యాప్తుతో నేను చెప్పింది నిజమని తేలింది
- మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాజకీయ కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని పేర్కొన్నారు. తన ఫోన్ ట్యాప్ అవుతుందని 2022లోనే తొలిసారి ప్రకటించానని, కానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ఆరోపణలంటూ విషయాన్ని పక్కదారి పట్టించిందని గుర్తు చేశారు. బీజేపీ తరఫున తమిళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన తమిళిసై ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తాను గతంలో చేసిన వ్యాఖ్యలు నిజాలేనని ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తుతో స్పష్టం అవుతోందని తమిళిసై పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రస్తుతం కీలక దశలో ఉంది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో...



బైకును ఢీకొట్టి.. 2 కి.మీ. ఈడ్చుకెళ్లి!

- చంపాపేటలో లారీ బీభత్సం
- బ్యానెట్ ఎక్కి ఆపమని అరుస్తున్నా పట్టించుకోకుండా వెళ్లిన డ్రైవర్
- వైరల్‌గా మారిన వీడియో
- లారీ సీజ్.. డ్రైవర్‌కు రిమాండ్

3



వారంలోగా మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక!

- రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం
- నివేదిక ఆధారంగా మరమ్మతులపై నిర్ణయం
- మేడిగడ్డ మరమ్మతులకు కాఫర్ డ్యామ్ కట్టాల్సి ఉంటుందని ఇప్పటికే చెప్పిన ఎన్‌డీఎస్‌ఏ

12



10

మావోయిస్టులను కూకటివేళ్లతో పెకిలిస్తాం

- ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వచ్చాక యాంటీ-నక్సల్స్ ఆపరేషన్స్ వేగిరం
- భద్రతా బలగాల క్యాంపులను 250కి పెంచాం
- అరెస్టులు, లొంగుబాట్లు పెరిగాయి.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా



అబ్ కీ బార్?

ఆంధ్రజ్యోతి

ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్‌పై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఉప ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్, మరేవిధంగానైనా పోల్స్ నిర్వహించడం గానీ, వాటి ఫలితాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు, రేడియోల ద్వారా వెల్లడించవద్దని ఈసీ పేర్కొంది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకూ ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది.

ఆశ.. నమ్మకం.. గ్యారెంటీలు

- 2014 నుంచి 2024 వరకూ వీటితోనే ప్రజల వద్దకు
- అస్సాం, త్రిపుర రాష్ట్రాల ఎన్నికలసభల్లో మోదీ



అయోధ్యలో బాల రాముడికి సూర్య తిలకం దృశ్యాన్ని వీక్షిస్తున్న ప్రధాని మోదీ

నల్‌బరి, అగర్తలా, ఏప్రిల్ 17: తనకు ప్రజలకు మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రధాని మోదీ వివరిస్తూ.. 2014లో ఒక ఆశతో ప్రజల వద్దకు వెళ్లానని, 2019లో నమ్మకంతో వెళ్లానని, ఇప్పుడు 2024లో గ్యారెంటీలతో వస్తున్నానని చెప్పారు. బుధవారం అస్సాంలోని నల్‌బరిలో, త్రిపుర రాజధాని అగర్తలాలో జరిగిన ఎన్నికల సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనకు తమ పాలనకు మధ్య తేడాలని వివరిస్తూ.. కాంగ్రెస్ హయాంలో ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాదం పెరిగిపోయిందని, కానీ, తాము శాంతియుత పరిస్థితులను నెలకొల్పామన్నారు. దోచుకొని దాచుకోవటానికే కాంగ్రెస్ ఈ ప్రాంతాన్ని కావాలని దశాబ్దాలపాటు నిర్లక్ష్యం చేసిందని, కానీ, తన పాలనలో అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయని చెప్పారు. అస్సాంలో ఇటీవల సెమీకండక్టర్ పరిశ్రమకు తాను శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, 15 వేల మందికిపైగా యువతకు ఉద్యోగాలు కల్పించే ఈ పరిశ్రమతో అస్సాం సెమీకండక్టర్ హబ్‌గా మారుతుందని తెలిపారు. 500 ఏళ్ల తర్వాత అయోధ్యలో రామమందిరం సాకారమైందని, ఇన్నాళ్లూ టెంటు కింద ఉన్న రాముడు ఇప్పుడు దివ్యమైన మందిరంలో ఉన్నాడని మోదీ పేర్కొన్నారు. నిరుపేదలకు మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ కొనసాగిస్తామని మోదీ పునరుద్ఘాటించారు. 70 ఏళ్లకు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల విలువైన ఉచిత వైద్యచికిత్సలను అందిస్తామన్నారు. 'మీ కుటుంబాల మీద ఆర్థికభారం పడకుండా మీ కొడుకు మోదీ ఈ వైద్యఖర్చుల భారం మోస్తాడు' అని తెలిపారు. కాగా, అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ తర్వాత జరుగుతున్న తొలి శ్రీరామ నవమి తరతరాల భారతీయుల ప్రస్థానంలో ఒక మైలురాయి అని శ్రీరామనవమి సందర్భంగా మోదీ పేర్కొన్నారు. నల్‌బరి సభ అనంతరం మోదీ.. అయోధ్యలో రాముడిపై సూర్య తిలకం పడిన ఘట్టం ప్రత్యక్షప్రసారాన్ని ట్యాబ్‌లెట్‌లో వీక్షించారు. ఆ ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, మోదీ బుధవారం ఎన్డీఏ అభ్యర్థులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. తొలిదశ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పేరుపేరున వ్యక్తిగత లేఖలు రాశారు. 'ప్రియమైన సహచర కార్యకర్త..' అంటూ వారిని సంబోధించారు.

ఎన్డీయేకు 150 సీట్లైనా రావు

- పార్టీ ఆదేశిస్తే అమేఠీ నుంచి పోటీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 150 సీట్లు మించి గెలవలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొలి విడత ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) నేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి ఆయన ఘజియాబాద్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. యూపీలో తమ మధ్య బలమైన ఐక్యత ఉన్నదని వారిరువురూ సంకేతాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. 15-20 రోజుల క్రితం బీజేపీకి 180 సీట్లు వస్తాయని అంచనా వేశామని, కానీ ప్రస్తుతం ఎన్డీయేకే 150 సీట్లు దాటవని అన్ని రాష్ట్రాల నుంచి అందుతున్న నివేదికల అధారంగా తేలిందని తెలిపారు. బీజేపీ పట్ల ప్రజావ్యతిరేకత చాప కింద నీరులాగా విస్తరిస్తోందని, రోజురోజుకూ ఇండియా కూటమి బలపడుతోందని ఆయన అన్నారు. యూపీలోని అమేఠీ నుంచి కానీ రాయబరేలీ నుంచి కానీ మీరు పోటీ చేస్తారా అని విలేకరులు అడుగగా.. ఇది బీజేపీ ప్రశ్న అని రాహుల్ చమత్కరించారు. తానెక్కడి నుంచి పోటీ చేయాలన్నది పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయిస్తుందని ఆయన చెప్పారు. పార్టీ ఏ ఆదేశాలు ఇస్తే వాటిని పాటిస్తానని తెలిపారు. దేశంలో పేదరికం ఒక్క రోజులో మటుమాయం అవుతుందని తాము అనడం లేదని చెప్పారు.

యూపీలో బీజేపీని చిత్తు చేస్తాం

కాంగ్రెస్- ఎస్పీ పొత్తు అత్యంత శక్తివంతమైనదని ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్ అన్నారు. యూపీలో బీజేపీని తమ ఇండియా కూటమి చిత్తు చేస్తుందని ఆయన చెప్పారు. ఘజియాబాద్ నుంచి ఘాజీపూర్ వరకు బీజేపీని తుడిచిపెడుతుందని పేర్కొన్నారు. మైనారిటీ, దళిత, వెనుకబడిన వర్గాలే ఎన్డీయేని ఓడిస్తాయని అఖిలేష్ అన్నారు. కాగా, యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో ఎస్పీ 62, కాంగ్రెస్ 17 చోట్ల పోటీ చేస్తుండగా, టీఎంసీకి కూడా ఎస్పీ ఓ సీటును కేటాయించింది. ఈ స్థానాలకు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

రేపే తొలిదశ

- 102 లోక్‌సభ స్థానాలకు ఓటర్ల తీర్పు
- అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు కూడా
- సర్వం సిద్ధం చేసిన ఎన్నికల సంఘం

21 రాష్ట్రాల్లో పోలింగ్.. బరిలో 8మంది కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. మొత్తం ఏడు దశల్లో నిర్వహిస్తున్న ఎన్నికల్లో తొలిదశకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. మొత్తం 102 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. తొలి దశలో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు సహా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని లోక్‌సభ సీట్లకు పోలింగ్ జరగనుంది. అదేవిధంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా తొలిదశలోనే జరగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని అసెంబ్లీ 60 స్థానాలు, సిక్కింలోని 32 స్థానాలకు ఓటర్లు తీర్పు ఇవ్వనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. బుధవారం సాయంత్రమే ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది.

బరిలో ఉద్దండులు

తొలిదశ ఎన్నికల్లో రాజకీయ ఉద్దండులు పోటీపడుతున్నారు. వీరిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు. బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి గడ్కరీ వరుసగా మూడోసారి నాగపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రెండుసార్లు గెలిచిన ఆయన మూడోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. 2014లో ఆయన ఏడు సార్లు ఎంపీగా గెలిచిన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల మెజారిటీతో ఓడించారు. 2019లో 2.16 లక్షల మెజారిటీతో మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ నానా పటోల్‌పై విజయం దక్కించుకున్నారు.

- కేంద్ర మంత్రుల్లో కిరెన్ రిజిజు అరుణాచల్ ప్రదేశ్ వెస్ట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ నబం తుకి. శర్బానంద్ సోనోవాల్ అసోంలోని డిబ్రుగఢ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. యూపీలోని ముజఫర్‌నగర్ నుంచి సంజీవ్ బలియాన్ పోటీ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీ నుంచి హరీంద్రమాలిక్, బీఎస్పీ నుంచి దారా సింగ్ ప్రజాపతి బరిలో ఉన్నారు. ఉధంపూర్ నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్న జితేంద్రసింగ్ హ్యాట్రిక్ కోసం తపిస్తున్నారు. భూపేంద్ర యాదవ్ రాజస్థాన్‌లోని అల్వార్ నుంచి పోటీలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ బాలక్‌నాథ్‌ను పక్కన పెట్టిమరీ బీజేపీ ఈయనకు అవకాశం ఇచ్చింది. రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బరిలో ఉన్నారు. ఈయనపై కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి గోవింద్‌రామ్ మేఘ్వాల్ పోటీచేస్తున్నారు.
- తమిళనాడులోని నీలగిరి నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ నేత ఎల్.మురుగన్, డీఎంకే నేత, సిట్టింగ్ ఎంపీ ఏ. రాజా పోటీ చేస్తున్నారు.
- తమిళనాడులోని శివగంగ నియోజకవర్గం మరింత ఆసక్తిగా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు, సిట్టింగ్ ఎంపీ కార్తి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు.
- తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా తొలిదశలోనే అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చెన్నై దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2019లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన తమిళిసై డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో పరాజయం పాలయ్యారు.
- మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ ఛింద్వారా నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ కమల్‌నాథ్ కుటుంబానికి 1980 నుంచి ఎదురన్నదే లేకపోవడం గమనార్హం.
- త్రిపురలో హైటెన్షన్ సీటుగా పేరున్న పశ్చిమ త్రిపుర నుంచి మాజీ సీఎం బిప్లబ్ దేబ్, కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ ఆశిష్‌కుమార్ తలపడుతున్నారు.
- రాజస్థాన్‌లోని చురు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా రెండు సార్లు ఒలింపిక్ పసిడి పతాన్ని కైవసం చేసుకున్న జావెలిన్ త్రో క్రీడాకారుడు దేవేంద్ర ఝఝూరియా పోటీ చేస్తున్నారు.
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాజస్థాన్‌లోని కోట నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు.
- తొలి దశలో బీజేపీ 77 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎన్డీయే పక్షాలు 23 చోట్ల బరిలో ఉన్నాయి.
- ఇండియా కూటమిలో కాంగ్రెస్ 57 స్థానాల్లో, మిత్రపక్షాలు 42 చోట్ల పోటీలో ఉన్నాయి.
- తొలి దశలో అరుణాచల్ ప్రదేశ్‌లోని 2, ఉత్తరాఖండ్ 5, అసోం 5, బిహార్ 4, ఛత్తీస్‌గఢ్ 1, మధ్యప్రదేశ్ 6, మహారాష్ట్ర 5, మేఘాలయ 2, మణిపూర్ 2, మిజోరాం 1, నాగాలాండ్ 1, రాజస్థాన్ 12, సిక్కిం 1, తమిళనాడు 39, త్రిపుర 1, యూపీ 8, పశ్చిమ బెంగాల్ 3, అండమాన్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఒక్కొక్కస్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

102 స్థానాల్లో మైకులు బంద్!

తొలిదశ పోలింగ్‌కు సంబంధించిన ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రంతో ముగిసింది. షెడ్యూల్ కన్నా ముందు నుంచే ఆయా రాష్ట్రాల్లో ప్రచార హోరును పెంచిన రాజకీయ పార్టీలు తొలిదశ ఎన్నికల ప్రచారం చివరి రోజు వరకు అదే జోరును కొనసాగించాయి. ప్రధాని మోదీ బుధవారం అసోంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి బీజేపీ రూపొందించిన 'వికసిత విజన్'ను(హామీలు) ఆయన ఆవిష్కరించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని శుభాకాంక్షలు చెప్పిన ఆయన.. అయోధ్యలో 500 ఏళ్ల తర్వాత బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించామని తెలిపారు. "బాలరాముని నుదుటన సూర్యతిలకం.. వికసిత త్రిపుర, వికసిత భారత్‌కు సంకేతం" అని వ్యాఖ్యానించారు.

తమిళనాడులో 39 స్థానాలకు ఈ దశలోనే



చెన్నై, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు ఒకే దశలో శుక్రవారం పోలింగ్ జరగనుంది. గత 30 ఏళ్లకు పైగా తమిళనాట ఎన్నికలొచ్చినప్పుడల్లా కొన్ని సమస్యలపై ప్రధానంగా ప్రచారం సాగేది. శ్రీలంక ఆధీనంలో వున్న కచ్చతీవు, శ్రీలంక నావికాదళం తమిళ జాలరులపై జరుపుతున్న దాష్టీకానికి అడ్డుకట్ట వేయడం, మాజీ ప్రధాని రాజీవ్ హంతకుల విడుదల, శ్రీలంకలో తమిళులపై సాగుతున్న అరాచకాలను ఆపడం, కర్నాటక, కేరళ రాష్ట్రాలతో నెలకొన్న నదీ జలాల పంపిణీ వ్యవహారాలు ప్రధానంగా ప్రచారాస్త్రాలుగా ఉండేవి. ఈ సారి ప్రచారంలో ఈ అంశాల ప్రస్తావనే లేకుండాపోయింది. తమిళనాట తొలిసారిగా మతపరమైన ప్రచారం ప్రధానంగా ముందుకు వచ్చింది. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలతో ప్రారంభమైన ఈ తరహా క్యాంపెయిన్.. ఎన్నికల ప్రచారం ముగిసేవరకు కొనసాగింది. బీజేపీ ఆరోపణలపై స్పందించడానికైనా డీఎంకే కూడా అభివృద్ధి ప్రచారానికి బదులుగా మతపరమైన ప్రచారం నిర్వహించాల్సి వచ్చింది. నిజానికి ప్రధాని మోదీ స్వయంగా ఈసారి కచ్చతీవు అంశాన్ని లేవనెత్తారు. కచ్చతీవును శ్రీలంకకు అప్పగించిన పాపం కాంగ్రెస్‌దే అని, అప్పుడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలో ఉందని ఇండియా కూటమిని ఇరుకున పెట్టడంతో పాటు సమస్యను జాతీయం చేసే ప్రయత్నం చేశారు. కానీ, దీనికి అంతగా స్పందన రాకపోవడంతో ఆ అంశం ప్రచారంలో పక్కకి తొలగిపోయింది. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషులుగా తేలి, మరణశిక్ష నుంచి యావజ్జీవ కారాగార శిక్షకు మారి, మూడు దశాబ్దాల పాటు జైలుశిక్ష అనుభవించిన నళిని బృందం వ్యవహారం కూడా ఈ ఎన్నికల ప్రచారంలో కనిపించలేదు. నళిని బృందం మొత్తం జైళ్ల నుంచి విడుదలవడం, ఇందులో ముగ్గురు తమ స్వదేశమైన శ్రీలంకకు వెళ్లడంతో ఈ సారి ఎన్నికల్లో ఈ ప్రస్తావనే లేకుండాపోయింది. ప్రతి ఎన్నికల్లోనూ నళిని బృందం విడుదలపై అన్ని పార్టీలు గట్టిగా గళమెత్తేవి. వారి విడుదల కోసం తామెంతగా శ్రమించిందీ, ఏమేం చర్యలు తీసుకున్నదీ విపులంగా ఓటర్లకు వివరించేవి. తమిళనాడుకు ముల్లైపెరియార్ డ్యాం వ్యవహారంలో కేరళతో, కావేరీ నదీ జలాల పంపిణీ వ్యవహారంలో కర్నాటక ప్రభుత్వంతో దీర్ఘకాలిక వివాదముంది. ఎన్నికల్లోనూ ఈ సమస్యలను పరిష్కరించని కేంద్ర ప్రభుత్వంపై, ఆ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాన పార్టీపైనా తమిళపార్టీలు విరుచుకుపడేవి. అయితే ఈ సారి ఎన్నికల్లో ఆ ప్రస్తావన కించిత్తు కూడా కనిపించకపోవడం గమనార్హం.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	41.4	27.5
ఆదిలాబాద్	40.8	25.7
హనుమకొండ	42.0	25.5
రామగుండం	41.4	26.9
ఖమ్మం	44.2	27.0

మోదీ వేవ్ లేదు.. కష్టపడాల్సిందే!

- వైరల్‌గా మారిన బీజేపీ అభ్యర్థి నవనీత్ రాణా వ్యాఖ్యలు

ముంబై, ఏప్రిల్ 17: 'మోదీ వేవ్ ఉందనే భ్రమల్లో ఉండకండి.. ఓట్ల కోసం కష్టపడాల్సిందే'నంటూ బీజేపీ అమరావతి అభ్యర్థి నవనీత్ రాణా ఇటీవల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నవనీత్ వ్యాఖ్యలు బీజేపీలో అలజడి రేపగా.. ఆమె చెప్పింది నిజమేనంటూ ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలు స్వాగతిస్తున్నారు. సోమవారం అమరావతిలో జరిగిన బీజేపీ ర్యాలీలో నవనీత్ మాట్లాడుతూ.. 'గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ పోరాడాలి. మోదీ వేవ్ ఉందనే భ్రమలో ఉండకండి..' అని ఆమె వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో మోదీ వేవ్ ఉన్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా తాను గెలిచినట్లు గుర్తు చేశారు. 2019లో అప్పటి ఎన్సీపీ మద్దతుతో గెలిచిన నవనీత్.. ఈసారి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. దీనిపై శివసేన(యూబీటీ) అధికార ప్రతినిధి సంజయ్‌రౌత్ స్పందిస్తూ.. 'బీజేపీ అభ్యర్థులు కూడా నిజాలు మాట్లాడుతున్నారు' అని వ్యాఖ్యానించారు.

పేదలకు 10 గ్యాస్ సిలిండర్లు

- 10 హామీలతో టీఎంసీ మ్యానిఫెస్టో

కోల్‌కతా, ఏప్రిల్ 17 : పశ్చిమ బెంగాల్ సీఎం మమత నాయకత్వంలోని టీఎంసీ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు తమ మ్యానిఫెస్టోను బుధవారం ప్రకటించింది. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ రద్దు, పెట్రోల్ ,డీజిల్ ధరల నియంత్రణ సహా పది హామీలతో కూడిన మ్యానిఫెస్టోను కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో విడుదల చేసింది. ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చింది. అలాగే, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఏడాదికి పది గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, నిరుపేదలకు ఉచితంగా ఇళ్లు, రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాలు చేపడతామని పేర్కొంది.

రఘు కుల తిలకుడికి రవి తిలక వైభవం

- ఆధునిక టెక్నాలజీతో నాలుగు నిమిషాలపాటు రామ్‌లల్లా నుదుటన మెరిసిన సూర్యకిరణాలు
- ఐఐఏ బెంగళూరు, సీబీఆర్ఐ పరిశోధకుల డిజైన్



అయోధ్య, ఏప్రిల్ 17: అయోధ్యాపురిలో కొలువైన రామ్‌లల్లా నుదుటన.. సూర్యుడు తన కిరణాలతో తిలకం దిద్దాడు. శ్రీరామనవమినాడు అభిజిత్‌లగ్నం వేళ.. సరిగ్గా విట్టమధ్యాహ్నం 12గంటల సమయానికి 5.8 సెంటీమీటర్ల నిడివిగల సూర్య కిరణం చిన్నారి రాముడి లలాట ఫలకంపై కస్తూరి తిలకమైంది!! బాల రామయ్య ఫాలభాగంపై దాదాపు 4 నిమిషాలపాటు పాలనురగలా మెరిసింది. ఈ సూర్య తిలక ఘట్టం వెనుక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రజ్ఞుల కృషి ఉన్నాయి. ఏటా ఒక ప్రత్యేకమైన రోజున సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోని మూలవిరాట్టును తాకేలా నిర్మించిన ఆలయాలు మనదేశంలో చాలానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్యలోనూ శ్రీరామనవమినాడు రాముడి నుదుటిపై సూర్యకిరణాలు పడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మందిర నిర్మాణాన్ని తలపెట్టినప్పుడే నిర్ణయించారు. ఇందుకోసం విద్యుత్తు వాడకూడదని కూడా నిశ్చయించి మూడేళ్ల క్రితం ఆ బాధ్యతను బెంగళూరులోని 'ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)'కు అప్పగించారు. ఐఐఏ నేతృత్వంలోని బృందం సూర్యుడి గమనం ఆధారంగా 4 అద్దాలు, 4 కటకాల సాయంతో బాలరాముడికి సూర్యతిలకం దిద్దేలా 'సూర్యతిలక్ మెకానిజమ్' పేరిట ఒక ఆప్టికల్ సిస్టమ్‌ను డిజైన్ చేసింది. ఆ డిజైన్ మేరకు.. బెంగళూరుకే చెందిన ఆప్టికా అనే సంస్థ ఒక పరికరాన్ని రూపొందించింది. సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ అనుబంధ విభాగమైన సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (రూర్కీ-ఉత్తరాఖండ్)కు చెందిన బృందం దాన్ని ఆలయంలో అమర్చింది. అయితే, ప్రస్తుతానికి ఆలయ నిర్మాణం పూర్తికానందున ఈ సిస్టమ్‌లో 4అద్దాలు, 2కటకాలను వినియోగిస్తున్నట్టు కేంద్ర శాస్త్ర, సాంకేతిక కార్యదర్శి అభయ్ తెలిపారు.

19 ఏళ్లకొకసారి..

ఇంగ్లిష్ క్యాలెండర్ ప్రకారం ప్రతి 19ఏళ్లకొకసారి శ్రీరామనవమి తేదీ దాదాపుగా ఒకటే అవుతోందని (ఉదాహరణకు 2000లో శ్రీరామనవమి ఏప్రిల్ 12న, 2019లో ఏప్రిల్ 13న; 2001, 2020ల్లో ఏప్రిల్ 2న; 2002, 2021 సంవత్సరాల్లో ఏప్రిల్ 21న.. ఇలా కొన్నిసార్లు ఈ తేదా ఎక్కువ రోజులున్నా.. మెజారిటీ సందర్భాల్లో దగ్గరి తేదీలే వస్తున్నాయి. ఆ లెక్కల ఆధారంగా ఆప్టిక్ సిస్టమ్‌ను డిజైన్ చేశామని అభయ్ కరాండికర్ తెలిపారు. ఈ ఆప్టో-మెకానిజమ్‌లో భాగంగా ఆలయ మూడో అంతస్తులో ఉండే అద్దంపై పడే సూర్యకిరణాలు..ఇత్తడి పైపులు, కటకాల గుండా ప్రసరించి, అద్దాల ద్వారా ప్రతిఫలించి రామ్‌లల్లా నుదుటన పడతాయి. ఇందు కు వాడిన అద్దాలు, పైపులు, కటకాలు అన్నీ ఎక్కువ కాలం మన్నుతాయని.. పైపుల నుంచి ప్రసరించే సూర్యకిరణాలు చెదరకుండా ఉండేందుకు నల్లటి పౌడర్‌తో కోటింగ్ వేశారని సీబీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ రామచర్ల తెలిపారు. ఇక.. ఆలయ పైభాగంలో సూర్యకాంతి పడే అద్దాన్ని సూర్యుడి కదలికలకు అనుగుణంగా కదుపుతూ, ఏటా శ్రీరామనవమి నాటికి అనుకున్న చోటుకు వచ్చేందుకు మరో పరికరాన్ని అమర్చారు. ఈ వ్యవస్థ పంతొమ్మిదేళ్లపాటు పనిచేస్తుంది. ఆ తర్వాత మళ్లీ నవమి రాకకు అనుగుణంగా దాన్ని సరిచేయాల్సి ఉంటుంది. కాగా, ఎల్లోరా గుహల్లోని 10వ గుహలో ధర్మచక్రముద్రలో ఉన్న బుద్ధుడి ముఖం మీదకు కాంతి ప్రసరించేలా 7వ శతాబ్దంలో ఏర్పాటు చేశారు. తర్వాత, చాలా ఆలయాల్లో ఈ తరహాలో గుడి గోపురాలను నిర్మించారు.

వైద్య చికిత్సకు రూ.లక్ష తీసుకోవచ్చు!

- పీఎఫ్ నిబంధనల్లో కీలక మార్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాలో ఉన్న సొమ్మును విత్‌డ్రా చేసుకునే విషయంలో సంస్థ కీలక మార్పు చేసింది. వైద్య ఖర్చుల కోసం చేసుకునే ఆటో క్లెయిమ్ పరిమితిని రెట్టింపు చేసింది. ఈ విషయాన్ని ఈపీఎఫ్‌వో ఓ సర్క్యులర్‌లో వెల్లడించింది. పేరా 68జె కింద ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతున్నట్లు తెలిపింది. చందాదారులు తమ వ్యక్తిగత లేదా కుటుంబసభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం ఈ పేరా కింద పీఎఫ్ ఖాతాలోని డబ్బును తీసుకొనే వెసులుబాటు ఉంది. నెల అంతకంటే ఎక్కువ రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా.. శస్త్రచికిత్సలు చేయించుకున్నా ఈ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. టీబీ, క్షయ, పక్షవాతం, క్యాన్సర్, హృద్రోగ చికిత్సల కోసమూ క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్లు లేకుండానే సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించి దీన్ని పొందొచ్చు.

పీవీ, మన్మోహన్‌లపై కేంద్రం ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: మాజీ ప్రధానులు పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లపై బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో ప్రశంసల జల్లు కురిపించింది. ఆర్థిక సంస్కరణలు చేపట్టడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొంది. పరిశ్రమల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్-ఐడీఆర్ఏ)-1951పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపిన సందర్భంగా వారి సేవలను గుర్తు చేసింది. 1991లో విదేశీ మారక ద్రవ్య నిల్వల సంక్షోభం తలెత్తినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందేలా ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ అన్న మూడు సూత్రాలను ఆధారం చేసుకొని పీవీ, మన్మోహన్ సంస్కరణలు చేపట్టారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాలను గుర్తు చేశారు.

యూఏఈలో జలవిలయం



దుబాయ్, ఏప్రిల్ 17: ఎడారి దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కుంభవృష్టితో తడిసి ముద్దైంది. ఏడాదిన్నరలో కురవాల్సిన వాన మంగళవారం ఒక్కరోజే పడింది. యూఏఈ చరిత్రలోనే కనీవినీ ఎరగని స్థాయిలో కురిసిన వానతో దుబాయ్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపైకి మోకాలి లోతు వరద నీరు వచ్చి చేరింది. విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను అరగంట పాటు పూర్తిగా నిలిపివేశారు. దుబాయ్ నగరంలోని ప్రఖ్యాత దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్‌తో పాటు వేలాది ఇండ్లు, షాపింగ్ మాల్స్‌లోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. సోమవారం రాత్రి భారీ గాలులు, ఉరుములతో ప్రారంభమైన వర్షం మంగళవారం సాయంత్రం వరకు కురిసింది. దుబాయ్‌లో సాధారణ వార్షిక వర్షపాతం 94.7మిల్లీమీటర్లు కాగా.. మంగళవారం ఒక్కరోజే 142 మిల్లీమీటర్ల వాన కురిసింది. దుబాయ్‌కు 130 కిలోమీటర్ల దూరంలో యూఏఈ-ఒమాన్ సరిహద్దులో ఉన్న అల్ అయిన్ నగరంలో ఏకంగా 254మిల్లీమీటర్ల వర్షం పడింది. యూఏఈతో పాటు పొరుగున ఉన్న ఒమాన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్ దేశాల్లో కూడా మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా ఒమాన్‌లో 18 మంది చనిపోయారు. యూఏఈలో మంగళవారం కుంభవృష్టికి 'క్లౌడ్ సీడింగ్' కారణమని భావిస్తున్నారు. నీటి అవసరాల కోసం యూఏఈలో క్లౌడ్ సీడింగ్ పద్ధతిని ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారు. అయితే, తాము ఇటీవల క్లౌడ్ సీడింగ్ నిర్వహించలేదని ఆ దేశ వాతావరణ సంస్థ తెలిపింది. యూఏఈలో వర్షాలు చాలా అరుదు. కానీ, రెండుమూడేళ్లుగా ఇక్కడ కూడా అడపాదడపా భారీ వర్షాలు పడటం సాధారణమైంది. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని భావిస్తున్నారు.

సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ వరదల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన భాస్కర్ అనే ప్రవాస భారతీయుడు చనిపోయినట్లు సమాచారం. భాస్కర్ కారులో చనిపోయి కనిపించాడని, అయితే కారు వరదల్లో కొట్టుకుపోయి ఊపిరాడక చనిపోయాడా.. లేక భయంతో గుండెపోటుతో చనిపోయాడా.. అన్నది ఇంకా తెలియలేదని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు ఎస్వీ రెడ్డి చెప్పారు. ఇదిలా ఉండగా, దుబాయ్‌లో అనేక భవనాల్లోని సెల్లార్లు నీటితో నిండిపోవడంతో కార్లను బయటకు తీయలేని పరిస్థితి ఉందని కర్నూలుకు చెందిన సామాజిక కార్యకర్త షేక్ అబ్దుల్లా అన్నారు.

ఎడారిలో వసంతం

- సౌదీలో పచ్చగా చిగురిస్తున్న నేలలు



ఎర్రటి ఎండలతో చిరచిరలాడే ఎడారి నేల.. భారీ వానలకు తడిసి పచ్చగా చిగురించింది! ముళ్లతో నిండి ఉండే రక్కిస మొక్కల్ని తిని బతికే ఒంటెలు.. పచ్చటి ఆకుల మృష్టాన్నభోజనం చేస్తున్నాయి! కొత్తగా పుట్టుకొచ్చిన మొక్కలతో.. అక్కడి జీవ వైవిధ్యం కూడా పెరుగుతోంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే మక్కా, మదీనా నగరాల నడుమ చిగురిస్తున్న ఈ పచ్చదనం ఆ దేశానికి వెళ్లే పర్యాటకులకు విస్మయం కలిగిస్తోంది. నాసా ఉపగ్రహాల్లోని కెమెరాలు సైతం ఈ అద్భుతాన్ని గుర్తించి, చిత్రీకరిస్తున్నాయి. అయితే.. ఎడారిలో ఇంత పచ్చదనం ఎలా వస్తోందన్నది అందరి సందేహం. సౌదీ అరేబియాలో ఇటీవల కురిసిన ఇబ్బడి ముబ్బడి వర్షాల ఫలితమే అనుకోని వసంతం అని కొందరు అంటున్నారు. కానీ.. దీనికి ప్రధాన కారణం ఆ దేశం చేపట్టిన 'గ్రీన్ ఇనిషియేటివ్' కార్యక్రమం. దేశవ్యాప్తంగా 1000 కోట్ల మొక్కలు నాటడం.. నాలుగు కోట్ల హెక్టార్ల భూభాగాన్ని పచ్చగా మార్చడమే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమమిది. ఇందులో భాగంగా ఆ ప్రోగ్రామ్ కారణంగా ఒక్క మక్కా ప్రాంతంలోనే 2023 ఆగస్టు నుంచి డిసెంబరు నడుమ పచ్చదనం 3,529.4 చదరపు కిలోమీటర్ల నుంచి 26,256 చదరపు కిలోమీటర్లకు (600%) పెరిగింది. ఈ కార్యక్రమంతో పచ్చదనంతో వర్షపాతం కూడా పెరుగుతూ వస్తోంది. -సెంట్రల్ డెస్క్

కల్యాణం కమనీయం

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల కల్యాణం.. రామనామ స్మరణతో హోరెత్తిన భద్రగిరి

- స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్
- హాజరైన మంత్రులు భట్టి, కొండా సురేఖ, పొంగులేటి




పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న సీఎస్ శాంతికుమారి దంపతులు, మంగళసూత్రంను భక్తులకు చూపుతున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 17: జగదానందకారుడైన శ్రీరాముడు జానకీ ప్రాణనాయకుడవుతున్న ఘట్టమది! కల్యాణ వేదికపై వధూవరులుగా జానకిరాములు ఆసీనులయ్యారు. వరుడి తండ్రి దశరథ మహారాజు తరఫున ఒకటి, వధువు తండ్రి జనక మహారాజు తరఫున ఇంకోటి.. భక్తుల తరఫున మరొకటి.. ఇలా రామదాసు చేయించిన "మూడు సూత్రాల మంగళసూత్రం" వేద మంత్రోచ్చారణల నడుమ సీతమ్మవారి మెడలో పడింది. అణిముత్యములు తలంబ్రాలయ్యాయి. ఆ తలంబ్రాలు నీలమేఘశ్యాముడైన రాముడు తన దోసిట తీసుకోగానే నీలపురాశిగా మిలమిలలాడాయి! సీతమ్మ దోసిట్లోకి చేరగానే కెంపులై మెరిశాయి! జానకిరాముల శిరమున వెలసిన ఆ తలబంబ్రాలదెంత భాగ్యం.. ఆ జగత్కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించిన భక్తకోటిదెంత పుణ్యం! ఆ భక్తి భావన మనసు నిండా ఉప్పొంగగా భక్తజనమంతా అంతా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఇలా బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం క్షేత్రంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. సర్కారు తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించిన తొలి సీఎస్ శాంతికుమారే కావడం గమనార్హం. గురువారం రామచంద్రమూర్తికి మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. మిథిలా స్టేడియంలోనే జరిగే ఈ కార్యక్రమం సందర్భంగా స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ రాధాకృష్ణన్ పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

తెల్లవారుజామున 2గంటల నుంచే..

బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకే అర్చకులు ఆలయాన్ని తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళశాసనం, అభిషేకం చేశారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఉదయం 9:30కి కల్యాణమూర్తులను పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపుగా 10 గంటలకు మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. తిరువారాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి మండపశుద్ధి చేశారు. ప్రత్యేక మంత్రాన్ని జపిస్తూ వేద పండితులు సంకల్పంతో స్వామివారికి ఎదురుగా సీతమ్మను కూర్చోబెట్టి కన్యావరణలు జరిపారు. రక్షాబంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణ చేశారు. యోక్త్ర బంధనం, వధూవరుల వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు ప్రవచించారు. ఆశీర్వచనం, పాద ప్రక్షాళన, పుష్పోదక స్నానం జరిపి వర పూజ నిర్వహించారు. కళ్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు. భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం, చింతాకు పతకం, రామమాడ తదితర ఆభరణాలను రామయ్యకు, సీతమ్మకు, లక్ష్మణస్వామికి ధరింపజేశారు. సీతారాములకు శృంగేరిమఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, పట్టువస్త్రాలు అందజేశారు. భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, తూము నరసింహదాసు వంశీకులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకస్వాములు స్వామివారికి నూతన వస్త్రాలంకరణ చేశారు. రామభద్రుడికి సీతామాతకు వేర్వేరుగా మంగళాష్టకం చదివారు. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉత్సవమూర్తుల శిరస్సులపై ఉంచారు. అనంతరం భక్తరామదాసు చేయించిన 3 మంగళసూత్రాలతో సూత్ర ధారణ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొంగులేటి, సుప్రింకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు రవినాథ్ తిలహరి, ఎన్.హరినాథ్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.కిరణ్మయి, సుమతి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్ తదితరులు హాజరయ్యారు. ఏర్పాట్లను భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షించారు. యాదాద్రి, వేములవాడ సహా రాష్ట్ర వ్యాప్తంగా పలు పుణ్యక్షేత్రాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.



భద్రాది సీతమ్మకు సిరిసిల్ల పట్టు చీర

సిరిసిల్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అది పట్టు చీర! బరువు 800 గ్రాములు. ప్రత్యేకత ఏమిటంటే.. నేతలో 2 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండిని ఉపయోగించారు. ఈ చీరను భద్రాద్రి సీతమ్మ వారి కోసం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన యెల్ది హరిప్రసాద్ అనే చేనేత కళాకారుడు నేశాడు. 5.5 మీటర్ల పొడవు.. 48 ఇంచుల వెడల్పుతో కూడిన ఈ చీరను నేసేందుకు ఆయన 18రోజుల పాటు శ్రమించాడు. చీరపై సీతారాముల ప్రతిరూపాలు, శంఖు, చక్ర నామాలు, అంచు మీద 'జై శ్రీరామ్' అనే అక్షరాలు ఉండటం మరో ప్రత్యేకత! హరిప్రసాద్ నేసిన ఈ పట్టుచీరను గర్భాలయంలో బుధవారం అమ్మవారి మూల విరాట్టుకు అలంకరించారు. హరిప్రసాద్‌ను సీఎస్ శాంతికుమారి అభినందించారు.

బైకును ఢీకొట్టి.. 2 కి.మీ. ఈడ్చుకెళ్లి!

- చంపాపేట ప్రధాన రోడ్డుపై లారీ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్
- వైరల్‌గా మారిన వీడియో

సంతోష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ కారును ఢీకొనగా.. వాహనదారులు లారీని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఓ వ్యక్తి లారీని ఆపమంటూ క్యాబిన్ డోర్ వద్ద ఎక్కగా.. వినిపించుకోని లారీ డ్రైవర్ అలాగే దూసుకెళ్లాడు. ఈ క్రమంలోనే లారీ డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టగా వాహనదారుడు రోడ్డు పక్కన పడిపోయాడు. బైక్ కిందపడి ముందు చక్రాల చిక్కుకుపోగా.. అలాగే పోనిచ్చాడు. దీంతో పూర్తిగా బైక్ ధ్వంసమైంది. ఇదంతా వెనకాల కారులో వస్తున్న వారు వీడియో తీయగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈనెల 14న చంపాపేట ప్రధాన రోడ్డుపై చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బైక్ యజమాని ఫిర్యాదు మేరకు ఐఎస్‌సదన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని లారీని సీజ్ చేసి.. డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా లారీ డ్రైవర్ ఓ కారును ఢీకొట్టగా.. వాహనదారులు అతడిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఓ వ్యక్తి లారీ డోరు పట్టుకొని ఎక్కుతుండగా డ్రైవర్ వేగంగా పోనిచ్చాడు. ఈ నేపథ్యంలోనే ఈదీబజార్‌కు చెందిన వ్యాపారి మహ్మద్ అబ్దుల్ మజీద్ (60) తన బైక్‌పై చంపాపేట లక్ష్మిగార్డెన్స్‌కు వెళుతుండగా.. లారీతో ఢీకొట్టాడు. దీంతో అబ్దుల్ మజీద్ రహదారికి ఎడమవైపు పడిపోయాడు. ఈ ఘటనలో అతనికి ఎటువంటి గాయాలు కాలేదు. ఇటు లారీ డోరు పట్టుకున్న వాహనదారుడు ఆపమని మరింత అరుస్తుండగానే.. ముందు చక్రాల కింద చిక్కుకున్న బైక్‌తోనే కొద్ది దూరం దూసుకెళ్లాడు. చివరకు లారీని వెంబడించి ఆపిన వాహనాదారులు డ్రైవర్‌ను పోలీసులకు పట్టించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు పంపారు.



లారీని ఆపాలంటూ క్యాబినెట్ ఎక్కిన వాహనదారుడు.. దూసుకెళ్తున్న లారీ



అక్కంపల్లి రిజర్వాయర్‌కు చేరుకున్న నీరు

పుట్టంగండి వద్ద అత్యవసర మోటారు ప్రారంభం

- హైదరాబాద్‌లో తాగునీటి కొరతను తీర్చేందుకే..

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 17: హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద అత్యవసర మోటారును బుధవారం అధికారులు ప్రారంభించారు. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం కనిష్ఠస్థాయి దిగువకు చేరుకున్నప్పుడు ఆ ప్రభావం హైదరాబాద్ తాగునీటిపై పడకుండా నీటిని ఎత్తిపోసేందుకు ఇక్కడ 10 మోటార్లను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం కనిష్ఠస్థాయి దిగువకు చేరడంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ) చర్యలు చేపట్టింది. 10 మోటార్లలో ఒకదానిని బుధవారం ఉదయం అధికారులు ప్రారంభించగా, జీరో పాయింట్ నుంచి గ్రావిటీ కాలువలోకి నీటిని ఎత్తిపోస్తోంది. బుధవారంరాత్రిలోగా మరో రెండు మోటార్లను, 2-3 రోజుల్లో మొత్తం 10 మోటార్లను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. పంప్‌హౌస్ నుంచి 800 క్యూసెక్కుల నీరు అక్కంపల్లి రిజర్వాయర్‌కూ.. అక్కడి నుంచి ఒక కాలువ ద్వారా ఉదయసముద్రం వైపు, మరో కాలువ ద్వారా కోదండపురం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీకి చేరుకుంది. అక్కడ శుద్ధి చేసిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

'ఎండ'మనూరు!

నల్లగొండ జిల్లా నిడమనూరులో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత.. రాష్ట్రవ్యాప్తంగా మండిన ఎండలు

- సాయంత్రానికి అక్కడక్కడ జల్లులు
- పిడుగుపాటుకు ఒకరు.. వడదెబ్బతో ముగ్గురి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో ఓవైపు భూగర్భజలాలు పడిపోతుండగా.. మరోవైపు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. బుధవారం నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్ జిల్లా అయ్యగారిపల్లి, గార్ల, సూర్యాపేట జిల్లా మునగాల, నల్లగొండ, నాంపల్లి, భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో 44.7 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇక సాయంత్రానికి కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ చిరు జల్లులు పడ్డాయి. ఆసిఫాబాద్ మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. బూర్గుడలో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. రహదారి పక్కనే నిలిపి ఉన్న ఒక లారీ గాలికి బోల్తాపడింది. నిర్మల్ జిల్లా కడెం మండలం సింగాపూర్ తండాలో రామెల లక్ష్మి (40) పిడుగుపాటుకు మరణించింది. హైదరాబాద్‌లో రాత్రి మోస్తరు వర్షం పడింది. కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, కాప్రా, ఈసీఐఎల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వానకు పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, వడదెబ్బ తగిలి బుధవారం ముగ్గురు మృతి చెందారు. పెద్దపల్లి జిల్లా జంగాలపల్లికి చెందిన రవికుమార్ (32), ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మెకానిక్ సాల్వే సంబా (48), సిద్దిపేటలోని పాతబస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30) ఎండదెబ్బకు అస్వస్థతకు గురై మరణించారు.

రెండ్రోజులు వడగాలులు.. ఆ తర్వాత వానలు!

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు ఎండల తీవ్రత పెరుగుతుందని.. ఆపై రెండ్రోజులు అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురు, శుక్రవారాల్లో సాధారణం కంటే 2-3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక శని, ఆదివారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది. మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది.

విద్యార్థి ప్రశాంత్ అంత్యక్రియలు పూర్తి

- గాంధీ ఆస్పత్రి, స్వగ్రామంలో స్వల్ప ఉద్రిక్తత
- భువనగిరి 'గురుకులం'లో తల్లిదండ్రుల ఆందోళన
- ప్రిన్సిపాల్ సస్పెన్షన్..

భువనగిరి టౌన్, ఏప్రిల్ 17: కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి ప్రశాంత్ అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో పూర్తయ్యాయి. ఆస్పత్రి పాలైన 20 మందికిపైగా విద్యార్థులలో భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లికి చెందిన ఆరో తరగతి విద్యార్థి చినలచ్చి ప్రశాంత్(12) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన విషయం తెలిసిందే. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాంధీ ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. కలుషిత ఆహారం ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రశాంత్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సముదాయించడంతో వారు పోస్టుమార్టంకు అంగీకరించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత ప్రశాంత్ మృతదేహాన్ని జిబ్లక్‌పల్లికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. ఆ సమయంలోనూ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

విద్యార్థి ప్రశాంత్ మృతి సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు భువనగిరిలోని గురుకుల పాఠశాలకు పెద్ద సంఖ్యలో చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. వారితో పాటు ఎస్ఎఫ్ఐ, బీజేపీ ఎస్సీ మోర్చ నాయకులు కూడా ఆందోళన చేశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. కాగా విద్యార్థి మృతితో గురుకుల అధికారులు అప్రమత్తమయ్యారు. పాఠశాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. తరగతి గదులు, డార్మెటరీ, వంటశాలలతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసి, వైస్ ప్రిన్సిపాల్ రాముకు బాధ్యతలను అప్పగించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం కొనసాగుతోంది. వేసవి సెలవుల ప్రారంభమయ్యే వరకు(ఈనెల 24) వైద్య శిబిరం కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను కుదించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి 15వ తేదీన పరీక్షలు ప్రారంభమై 24తో ముగియనుండగా.. గడువులోపే పరీక్షలను పూర్తిచేసి, విద్యార్థులను ఇంటికి పంపించేందుకు స్థానిక అధికారులు ఉన్నతాధికారులతో సంప్రదిస్తున్నారు.



పాఠశాలలో కొనసాగుతున్న వైద్య శిబిరం

ఇది ప్రభుత్వ హత్యే: ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి ప్రభుత్వ హత్యే అని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆహారం విషతుల్యమై విద్యార్థి మృతి చెందిన ఘటనపై ఆయన బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. గురుకుల పాఠశాలల్లో క్షేత్రస్థాయి నియంత్రణ లోపించిందని, కొంచం వ్యవస్థను చక్కదిద్దండి అని ఎన్నిసార్లు బహిరంగంగా వేడుకున్నా ముఖ్యమంత్రి రేవంత్ గుండె కరగలేదన్నారు.

టైమ్స్ ప్రభావశీలుర జాబితాలో సత్యనాదెళ్ల

- అజయ్‌బంగా, అలియాభట్, సాక్షిమాలిక్‌లకూ చోటు




న్యూయార్క్, ఏప్రిల్ 17: ప్రఖ్యాత టైమ్ మేగజైన్ ప్రపంచంలోని అత్యంత ప్రభావశీలురైన 100 మందితో విడుదల చేసిన జాబితాలో భారత్‌కు చెందిన మైక్రోసాఫ్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ అజయ్ బంగా, బాలీవుడ్ నటి అలియా భట్, ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్, నటుడు, డైరెక్టర్ దేవ్ పటేల్‌కు చోటు లభించింది. 2024 సంవత్సరానికి టైమ్స్ 100 మంది అత్యంత ప్రభావశీలుర జాబితా బుధవారం విడుదలైంది. ఈ జాబితాలో అమెరికా ఇంధన శాఖ లోన్ ప్రోగ్రామ్స్ ఆఫీస్ డైరెక్టర్ జిగర్‌షా, యేల్ యూనివర్సిటీలో ఆస్ట్రానమీ, ఫిజిక్స్ ప్రొఫెసర్ ప్రియంవద నటరాజన్, భారత సంతతికి చెందిన రెస్టారెంట్ యజమాని అస్మాఖాన్, రష్యాకు చెందిన ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ భార్య యులియా నావల్నయాకు కూడా చోటు లభించింది. మన భవిష్యత్తును రూపొందించడంలో సత్య నాదెళ్ల చాలా ప్రభావవంతంగా ఉన్నారని, ఇది మానవాళికి మంచి విషయమని టైమ్ పేర్కొంది. ఓపెన్‌ఏఐలో పెట్టుబడి, మిస్ట్రాఏఐలో భాగస్వామ్యం ఆయనను కృత్రిమమేధ విప్లవంలో ముందంజలో ఉంచినట్టు తెలిపింది. అజయ్‌బంగా లక్షలాది మందిని డిజిటల్ ఎకానమీలోకి తీసుకువచ్చారని, పేదరికంలేని ప్రపంచాన్ని సృష్టించడానికి కొత్త విజన్‌ను ఆయన నిర్దేశించారని టైమ్ పేర్కొంది. అలియా భట్.. ప్రపంచంలోని ప్రముఖ నటుల్లో ఒకరని, దశాబ్ద కాలంలో ఆమె భారత సినీ పరిశ్రమలో చేసిన కృషిని టైమ్ ప్రశంసించింది. మహిళా అథ్లెట్లను లైంగికంగా వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొన్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్ రాజీనామా చేయాలని, అతన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ 2023లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రెజ్లర్లలో సాక్షి మాలిక్ కూడా ఉన్నారని టైమ్స్ పేర్కొంది. రెజ్లర్లకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటూ చిన్నగా ప్రారంభమైన నిరసనకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున మద్దతు లభించిందని, ప్రపంచం దృష్టిని కూడా ఆకర్షించిందని తెలిపింది.

జువెనైల్ హోమ్ నుంచి 8 మంది పరారీ

- సినీఫక్కీలో తప్పించుకున్న వైనం
- హైదరాబాద్‌లోని జువెనైల్ హోమ్‌లో ఘటన

గాజులరామారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓ జువెనైల్ హోమ్(బాల నేరస్థులు పునరావాస కేంద్రం) నుంచి ఒకేసారి ఎనిమిది చిన్నారులు సినీఫక్కీలో పరారయ్యారు. హోమ్ ప్రధాన గేటు వద్ద అలజడి సృష్టించి లోపల తరగతి గదిలోని కిటికీ ఊచలను వంచి ఏడుగురు పారిపోయారు. మరొకరు హోమ్ ప్రధాన గేటు వద్ద నుంచే పరారయ్యాడు. సూరారం పరిధి కైసర్‌నగర్ ఎక్స్ రోడ్డు ఎదురుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వ జువెనైల్ హోమ్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. సూరారం పోలీసుల కథనం ప్రకారం.. ఘటన జరిగిన జువెనైల్ హోమ్‌లో 32 మంది బాల నేరస్థులు ఉన్నారు. మంగళవారం రాత్రి పాలు తాగే సమయంలో ఇద్దరు బాలలు హోమ్ ప్రధాన గేటు వద్దకు వచ్చి పారిపోయేందుకు యత్నించగా విధుల్లో ఉన్న కాపలాదారుడు అడ్డుకున్నాడు. దీంతో మరికొందరు అక్కడి వచ్చి పాల గ్లాసులు కింద పడేసి గొడవ పడ్డారు. ఈ గొడవ జరుగుతుండగా హోమ్‌లోని ఓ తరగతి గదిలోని కిటికీ ఊచలు వంచి బయటకు వచ్చిన ఏడుగురు బాలలు ప్రహరీ గోడ దూకి పరారయ్యారు. మరోపక్క, హోమ్‌లో గొడవ జరుగుతుండగా ప్రధాన గేటు దగ్గర ఉన్న ఓ బాలుడు వీలు చూసుకుని అక్కడి నుంచే తప్పించుకున్నాడు. ఈ మేరకు జువెనైల్ హోమ్ సూపరింటెండెంట్ సంఘమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తప్పించుకున్న బాలల ఆచూకీ కనిపెట్టేందుకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

బహ్రెయిన్‌లో మరణించిన తెలంగాణ వాసి మృతదేహం హైదరాబాద్‌కు తరలింపు

దుబాయ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): బహ్రెయిన్‌లో పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన ఉప్పు నవీన్ అనే యువకుడి మృతదేహాన్ని బుధవారం భారత్‌కు తరలించారు. బహ్రెయిన్‌లోని తెలుగు సామాజిక సేవకుడు, కాకినాడకు చెందిన డొర్నాల శివకుమార్ స్థానికంగా అధికారిక కార్యక్రమాలను పూర్తి చేసి మృతదేహాన్ని బుధవారం రాత్రి హైదరాబాద్‌కు పంపించారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఖానాపూర్‌కు చేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

చేవెళ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

- గొడ్డలితో నరికి చంపిన బావమరిది



నారాయణదాస్ (ఫైల్)

చేవెళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్యకు గురయ్యారు. డబ్బుల విషయంలో తలెత్తిన వివాదాల కారణంగా తన సొంత బావ మరిదే ఆయనను గొడ్డలితో నరికి చంపేశాడు. చేవెళ్లకు చెందిన కడమంచి నారాయణదాస్ (49) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవారు. నారాయణదాస్ బావమరిది భాస్కర్ కూడా ఆయనతో కలిసి అదే పని చేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితం ఒక భూమి విషయంలో డబ్బులిస్తానని భాస్కర్‌కు నారాయణదాస్ మాటిచ్చాడు. హామీ మేరకు డబ్బులివ్వలేదని 3 నెలలుగా నారాయణదాస్‌కు భాస్కర్ దూరంగా ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం నారాయణదాస్ తన ఫామ్‌హౌస్‌కు వెళ్దామని భాస్కర్‌కు ఫోన్‌చేసి రమ్మనడంతో వచ్చాడు. ఇద్దరూ కలిసి కారులో ఊరెళ్లలో ఉన్న ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ ఇద్దరూ మద్యం తాగి డబ్బుల విషయంలో గొడవపడ్డారు. ఆగ్రహించిన భాస్కర్ గొడ్డలితో నారాయణదాస్ గొంతుపై నరికి హత్య చేశాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నారాయణదాస్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



భారత జనాభా 144 కోట్లు!

- అందులో 14 ఏళ్లలోపు వయసు పిల్లలు 24%
- 77 ఏళ్లలో జనాభా రెట్టింపయ్యే అవకాశం
- చైనా జనాభా 142 కోట్లు: ఐరాస

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారతదేశ జనాభా 144.17 కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి(యూఎన్ఎఫ్‌పీఏ) సంస్థ అంచనా వేసింది. ఇందులో 14 ఏళ్ల లోపు వయసు పిల్లలు 24 శాతం, 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసువారు 17 శాతం, 10 నుంచి 26 ఏళ్ల మధ్య వయసువారు 26 శాతం, 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసువారు 68 శాతం, 65 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసువారు 7 శాతం మంది ఉంటారని పేర్కొంది. పురుషుల జీవితకాలం 71 ఏళ్లు, మహిళల జీవితకాలం 74 ఏళ్లుగా వివరించింది. మరో 77 ఏళ్లలో భారత జనాభా రెట్టింపు అవుతుందని కూడా అంచనా వేసింది. ఈ మేరకు తాజా నివేదికను యూఎన్ఎఫ్‌పీఏ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం చైనా జనాభా 142.5 కోట్లు మాత్రమే. 2011 సంవత్సరంలో చేసిన జనాభా లెక్కల ప్రకారం నాడు భారత జనాభా 121 కోట్లు. లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం విషయంలో 30 ఏళ్లుగా భారత్ పురోగతి సాధిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా అట్టడుగు వర్గాలు ఈ విషయంలో నిర్లక్ష్యంతో ఉన్నట్టు తెలిపింది. అలాగే, 2006, 2023 సంవత్సరాల మధ్య భారత్‌లో బాల్య వివాహాలు 23 శాతంగా ఉన్నట్టు పేర్కొంది. మహిళల్లో వైకల్యం ఉన్నవారు 10 రెట్లు అధికంగా లింగవివక్షా పూరిత హింసను ఎదుర్కొన్నట్టు నివేదిక తెలిపింది. భారత్‌లో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గాయని, అయినప్పటికీ ప్రసూతి మరణాల ముప్పు నాటకీయంగా కొనసాగుతూనే ఉందని వెల్లడించింది. ఇటీవల భారత్‌లో నిర్వహించిన అధ్యయనంలో 640 జిల్లాల్లో ప్రతి లక్ష జననాలకు మరణాల రేటు 70 కంటే తక్కువే ఉన్నప్పటికీ, మరో 114 జిల్లాల్లో ఆ రేటు 210 వరకు ఉందని తెలిపింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తిరప్ జిల్లాలో ప్రతి లక్ష జననాలకు అత్యధికంగా 1,671 మరణాలు సంభవించినట్టు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాల రేటు 8 శాతమని తెలిపింది. 40 శాతం దేశాలలో మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి తగ్గిపోతోందని యూఎన్ఎఫ్‌పీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నటాలియా కనెం పేర్కొన్నారు. ఒక తరం వ్యవధిలో ప్రసూతి మరణాల రేటును 1/3 వంతు, అవాంఛిత గర్భధారణ రేటును 1/5 వంతు తగ్గించగలిగామని, 160 కంటే ఎక్కువ దేశాలలో గృహహింసకు వ్యతిరేకంగా సురక్షిత చట్టాలను తీసుకురాగలిగామని వివరించారు. ఇంత పురోగతి సాధించినప్పటికీ మన సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చల్లని కబురు!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఎక్కువ వర్షాన్ని తెస్తాయని భారత వాతావరణశాఖ చల్లనిమాట చెప్పింది. ప్రకటన వెలువడిననాటికీ, వాటి ఆగమనానికి మధ్య దాదాపు రెండునెలల ఎడం ఉన్నప్పటికీ, మండుటెండల్లో మలమలామాడిపోతున్న జనానికి ఈ వార్త వినగానే వానజల్లుల్లో తడిసినంత ఆనందం కలిగింది. రుతుపవనాల ఆగమనానికి సంబంధించిన తొలి అంచనాల్లోనే అధికవర్షపాతం గురించి ఐఎండీ మాట్లాడటం దశాబ్దకాలంలో ఇదే మొదటిసారి. ఎల్‌నినో పరిస్థితులు బలహీనపడుతున్నాయని, నైరుతి ప్రారంభం నాటికి దాని ప్రభావం మరింత క్షీణిస్తుందని ఐఎండీ అంచనా. ఆగస్టు సెప్టెంబర్ మధ్యలో లానినా ప్రభావంతో ఎక్కువ మోతాదులో వర్షాలు కురుస్తాయని అంటూ, మొత్తంగా ఈ రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే, అధికవర్షపాతానికే అత్యధిక అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ చెబుతోంది.

ఎల్‌నినో కొనసాగుతుందనీ, వర్షాభావం తప్పదని అనుమానపడుతున్న దశలో ఐఎండీ ఈ శుభవార్త వినిపించింది. ఇది తొలి అంచనా కనుక కచ్చితంగా కొన్ని మినహాయింపులు ఇవ్వకతప్పదు. అయినప్పటికీ సాధారణ వర్షపాతం ఉండవచ్చు తప్ప, వర్షాభావం భయాలైతే అక్కరలేదు. వాతావరణ పరిస్థితులను అంచనాకట్టే విషయంలో మనం గతంలో కంటే ఎంతో మెరుగుదలసాధించినప్పటికీ, కచ్చితత్వానికి ఇంకా కాస్తంతదూరంగానే మిగిలిపోయాం. ఇక, ఇప్పుడు ఐఎండీ తన అంచనాలో మొత్తం సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే అధికంగా ఉంటుందని అంటూనే, ఆరంభం మాత్రం కాస్తంత బలహీనంగా ఉంటుందని హెచ్చరిస్తోంది. గత ఏడాదిలాగా ఎల్‌నినో ఈ మారు కూడా నైరుతి పవనాలను బలహీనం చేయవచ్చునన్న అనుమానాలు ఉన్నప్పటికీ, లానినో విషయంలో మాత్రం ఐఎండీ నమ్మకంగా ఉంది. పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం వేడి చల్లారి ఆగస్టులో రుతుపవనాలు బలం పుంజుకొని ఎక్కువమోతాదులో వర్షాలు తెచ్చిపెడతాయని అది అంచనాకడుతోంది. మొత్తం వ్యవసాయంలో అరవైశాతం బోరుబావుల ఆధారంగానే సాగుతున్నందున, ఏయేటికాయేడు నేరుగా వర్షాలమీద ఆధారపడే అవసరం ప్రస్తుతం వ్యవసాయరంగానికి లేకపోవచ్చు. వర్షాలు కాస్తంత అటూఇటూ అయితే వ్యవసాయ ఉత్పత్తి దారుణంగా పడిపోయి, ఆహారధాన్యాలకు వెతుక్కొనే పరిస్థితి ప్రస్తుతం లేదు. వర్షాభావం తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రమే ఉత్పత్తి తగ్గి, సరఫరాలూ ధరలమీద ఆ ప్రభావం ఉంటున్నది. వర్షపాతంలో ఆటుపోట్లనుంచి వ్యవసాయరంగాన్ని బోర్లు రక్షిస్తున్నప్పటికీ, వాటి వినియోగానికి వీలుకల్పిస్తున్న భూగర్భజలాల భర్తీకి అతిముఖ్యమైనవి ఈ రుతుపవనాలే. నైరుతిపవనాలతోనే ఏటా డెబ్బయ్ ఐదుశాతం భూగర్భ జలాలు రీచార్జి అవుతాయని ఓ అంచనా. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల కూడా భూగర్భజలాలు అత్యధికంగా అడుగంటిపోయాయని అంటున్న నేపథ్యంలో, ఈ మారు మరిన్ని వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తున్నాయి.

ఈ దేశంలో ఎక్కువ ఉపాధినిస్తున్నది ఇప్పటికీ వ్యవసాయరంగమే. ఈ వర్షాలతో ఇరిగేషన్ సౌకర్యం లేని మిగతా సగం వ్యవసాయభూమి తడుస్తుంది, మొత్తంగా ఉత్పత్తి పెరుగుతుంది. ఇప్పటికే పెరిగినధరలకు తాళలేకపోతున్న సామాన్యుడికి కాస్తంత ఉపశమనం దక్కడంతో పాటు, ప్రజలకు ఆహారభద్రత కూడా ఏర్పడుతుంది. దేశవ్యవసాయ రంగానికి ముఖ్యమైన ఎనభైకి పైగా ప్రాజెక్టులు నీటితో నిండి కళకళలాడేది ఈ సీజన్‌లోనే. ఒక్క వ్యవసాయరంగమే కాక, దాని అనుబంధరంగాల మనుగడనూ ఈ వర్షాలు ప్రభావితం చేస్తాయి. ఎల్‌నినో ఏర్పడి, అది ముగిసిన అనంతరం లానినా ప్రభావంతో వర్షాలు పడినప్పుడు అవి సాధారణం కంటే హెచ్చుగా ఉండటం ఇప్పటివరకూ పది సందర్భాల్లో జరిగిందట. అందువల్ల, ఈ మారు వాతావరణశాఖ అంచనాలు నిజం కావచ్చును కూడా. వచ్చేనెలలో ఐఎండీ మరింత కచ్చితమైన అంచనాలతో ఎలాగూ ముందుకురాబోతున్నది. రాబోయే వర్షాలు అన్ని ప్రాంతాలకూ విస్తరించి, సుదీర్ఘకాలం పుడమి నిత్యం జల్లులతో తడవాలనీ, నీరంతా నేలలోకి ఇంకి భూగర్భజలమట్టం పెరగాలనీ కోరుకుందాం. ఎంత వర్షం కురిసినా అది కుంభవృష్టిగా నింగినీనేలనూ ఏకం చేసి, ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిపోతే ఏ ప్రయోజనమూ ఉండదు. భయంకరమైన ఎండలనూ, నీటికష్టాలను చవిచూస్తున్న ప్రజలకు ఈ నైరుతిపవనాలు ఉపశమనాన్ని చేకూర్చి, ఒడ్డునపడేస్తాయని ఆశిద్దాం.


తక్కువ చోరుడినే ప్రేమించాలి, తప్పేదేముంది?

ఆలోచనాపరుడైన ఒక మిత్రుడు ఇట్లా ప్రశ్నించాడు. "ఎంత కాలం ఇట్లా జనాన్ని మభ్యపెడతారు? వాళ్ల కంటె వీళ్ల నయం అని, ఇద్దరిలో ఒకళ్లు ఎక్కువ చెడ్డవాళ్లు అని ఎంత కాలం రాస్తూ ఉంటారు? అందరూ దొంగలే అని చెప్పే సమయం వచ్చిందని అనిపించడం లేదా?" ఇంత నిర్మోహమాటంగా నిలదీస్తే నీళ్లు నమలకుండా ఉండడం కష్టమే. "ఈ నాయకులను చూడండి, ఇంతకాలం అధికారం అనుభవించి, ఇప్పుడు ఓడిపోగానే క్షణం కూడా ఆగకుండా గోడదూకేస్తున్నారు. ఎవళ్లకీ నీతి లేదు, నియమం లేదు. సిద్ధాంతం అసలే లేదు. క్రమశిక్షణ గురించి, సంస్కృతి గురించి గప్పాలు కొట్టే పార్టీలోకైనా, రాజ్యాంగాన్ని రక్షిస్తామని, ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరిస్తామని చెప్పే మరో పార్టీలోకైనా నిస్సిగ్గుగా దూకేస్తున్నారు, ఆ పార్టీలు కూడా అంతే బరితెగింపుగా చేర్చుకుంటున్నాయి.. ఏ రాయితో కొట్టుకున్నా పళ్లూడిపోతాయని తెలియడం లేదా? ఒకడిని దించి మరొకడిని ఎక్కిస్తే ఉద్ధరింపు ఏమీ జరగదని తెలిసివచ్చింది కదా?" మిత్రుడి ఆగ్రహావేదన సుదీర్ఘంగా కొనసాగింది.

చాదస్తమేమీ కాదు. ఆలోచించవలసిన విషయమే. దుష్పరిపాలనలో ప్రజలు ఎప్పుడూ తక్షణ ఉపశమనాన్ని కోరుకోవడం, అతి కొద్దికాలంలోనే ఊరట వెనక్కి తగ్గి తిరిగి ఆశాభంగాలూ కొత్త ఆవేదనలూ మొదలు కావడం ఇటీవలి చరిత్రలో చూస్తూనే ఉన్నాం. ప్రత్యామ్నాయాలు పరిమితంగా ఉండడం వల్ల పాత ప్రతినాయకులనే కొత్త కథానాయకులుగా ఎంపిక చేసుకోవలసిన పరిస్థితి. ఎన్నికల ప్రజాస్వామ్యంలోని ఈ డొల్లతనం ఓటర్లకు నిజంగా తెలియదా? అందరూ అందరే అని, ఎవరూ సమూలంగా సమాజాన్ని మార్చివేయరని తెలియదా? తెలిసినా, ఎక్కువ మంచిని కాక, తక్కువ చెడును ఎంచుకోవలసిన దుస్థితిలోకి పడిపోయారా? రాజకీయాలను వ్యాఖ్యానించేవారు కానీ, మంచి చెడ్డలను చర్చించేవారు కానీ, అంతకు మించి ఏమి చెప్పగలరు?

విశాల ప్రజానీకం మాత్రమే కాదు, వారి తరఫున, వారి శ్రేయస్సు కోసం ఆలోచిస్తున్నామనుకునేవారు సైతం, తక్షణ ప్రమాదాలను పరిగణనలోకి తీసుకోవలసి వస్తుంది. ఏదో ముంచుకు వస్తుంది, ఆ గండాన్ని తప్పించుకోవడానికి అనేక పరిమితులను అధిగమించి, ఒక ఆపద్ధర్మ ఆచరణకు దిగవలసి వస్తుంది. నిన్నటి దాకా ఒకరి పొడ మరొకరికి పడనివారు కూడా బలమైన మూడోశక్తిని ఎదిరించడానికి చేతులు కలుపుతారు. వెదుక్కుని రూపొందించిన ఒకే నినాదాన్ని వల్లెవేస్తారు. ఇటువంటివి అనేకమార్లు జరిగే క్రమంలో, వివిధ పార్టీల మిత్రులు, ప్రత్యర్థులు మారిపోతూ ఉంటారు. ప్రతిసారీ ఏదో ఒక ధర్మయుద్ధం జరుగుతోందన్న భ్రమ కలుగుతుంటుంది. నిజంగా ఆ పోరాటాలలో ప్రజలకు పనికివచ్చే విలువలేవైనా ఉంటాయా? కేవలం, బలహీన ప్రజాస్వామ్యం మీద బలమైన ఆశ కలిగించే విన్యాసాలు మాత్రమేనా?

సుప్రీంకోర్టుతో సహా న్యాయవ్యవస్థ అంతా ఒక తెలియని ఒత్తిడిలో ఉన్నదని తెలుస్తూనే ఉన్నది. విచారణ కూడా ఆరంభం కాని కేసుల్లో ఆరేడేళ్ల నుంచి సుదీర్ఘ నిర్బంధంలో ఉన్న మేధావులు ఉన్నారు. ప్రబీర్ పురుకాయస్థ అనే ప్రముఖ పాత్రికేయుడు, ప్రజాస్వామ్యవాది పోయిన ఏడాది అక్టోబర్ నుంచి నిర్బంధంలోనే ఉన్నారు. దర్యాప్తు సంస్థల దాడులకు, అధికారపార్టీ ఎలక్టోరల్ బాండ్లకు అవినాభావ సంబంధం ఉన్నట్టుగా పచ్చిగా తెలిసిపోతూ ఉన్నా, భారతీయ సమాజం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నది. దేశం కోసం ధర్మం కోసం ఏమైనా మాట్లాడవచ్చునని భావించే అధినాయకుడు, ప్రజాస్వామ్యం మనదేశంలోనే పుట్టిందని, రాజ్యాంగంలోనే సనాతన ధర్మం ఉన్నదని ఉద్ఘాటిస్తున్నారు. జాతీయ మీడియా పరవశించిపోయి, నాయకుడి ప్రతిమాటకీ పవిత్రార్థాలను ప్రతిపాదిస్తోంది. చర్చలు, ప్రజాస్వామ్య ప్రక్రియలు అన్నీ వృథా అని, కశ్మీర్ మీద సాహస, కఠిన చర్య తీసుకుని నిర్బంధశాంతిని సాధించారు. పెట్టుబడులకు కొత్త స్వర్గం తెరచుకున్నదని కార్పొరేట్ లోకం సంబరపడింది. ఛత్తీస్‌గఢ్‌లో చర్చలకు రమ్మని ఒకవైపు ఆహ్వానిస్తూనే, మూడు నెలల్లో వందమందిని నిర్మూలించి, ఆదివాసుల నుంచి అడవికి విముక్తి సాధించే ప్రయత్నం చేస్తున్నారు. మధ్యభారతంలోని దండకారణ్యంలో గనివనరులకు ఇక రెక్కలు రావచ్చు. బలశాలి ప్రభుత్వంలోనే ఇవన్నీ సాధ్యమని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. మరింత బలం ఇమ్మని, అసలు చిత్రం చూపిస్తామని ఆశపెడుతున్నారు.





■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇవన్నీ సరే, మరి ఈ బాహుబలి పార్టీ మీద పోరాడే కూటమికి, శక్తి లేకపోవచ్చు కానీ, సంకల్పం అయినా ఉన్నదా? కోరలూ కొమ్ములూ తానే తొడిగితే, బీజేపీ హయాంలో విషాన్ని కూడా నింపుకున్న ఊపాను రద్దు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కాకపోయినా చెవిలో అయినా చెప్పగలదా? న్యాయవ్యవస్థ వెన్నెముకను సరిచేయగలదా? జైళ్లలో దట్టించి పెట్టిన అసమ్మతికి స్వేచ్ఛ ఇవ్వగలదా? దేశం నాడీవ్యవస్థ అంతటా వ్యాపించిన అసహన, విద్వేష, విభజన కాలుష్యాన్ని ప్రక్షాళన చేయగలదా? కాంగ్రెస్ పార్టీ కానీ, అది భాగంగా ఉన్న ఇండియా కూటమి కానీ, అటువంటి మాటలు మాట్లాడగలిగే శక్తి కూడా లేని నీరసస్థితిలో ఉన్నాయి. వారికి జవసత్వాలు వస్తే వాళ్లు ఎట్లా వ్యవహరించగలరో మనకు తెలుసు. బలహీన పక్షమని సానుభూతి చూపవచ్చును కానీ, బాధితులై ఉండీ ప్రతిఘటించలేని భీరుత్వాన్ని మాత్రం ఎట్లా అర్థం చేసుకోగలం? ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా ఎటువంటి మార్పూ అనుభవంలోకి రాని ప్రజాశ్రేణులే ఇప్పుడు దేశంలో, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నాయి. భ్రమతో కాక, అవసరంతో అవగాహనతో కలసి నడుస్తున్నాయి.

అన్నమైతేనేమిరా, మరి, సున్నమైతేనేమిరా అని పాడుకునే బైరాగి కూడా, తినడానికి ఏదో ఒకదాన్ని ఎంచుకోవలసిందే. పరమ తాత్విక ప్రశ్నలకు కూడా ఒక్కోసారి పచ్చి భౌతికమయిన సమాధానాలే ఉంటాయి. అన్ని రాజకీయ పక్షాలూ ఒకేతాను ముక్కలే అని, అందరు రాజకీయవాదుల డిఎన్ఏ ఒక్కటే అని స్థూల సత్యాలుగా భావించడం ఓకే. కానీ, ఒక్కో ముక్కను ఒక్కోసారి అధికారానికి తీసుకువచ్చే చిన్న అవకాశం ఓటర్లకు ఉన్నది. ఓటరు అభీష్టాన్ని హైజాక్ చేసే అనేకమార్గాల వల్ల, ఉన్న చిన్నపాటి ఎంపిక అవకాశం కూడా గాలికిపోతోంది. అయినప్పటికీ, ఎన్నికల వేళ, ప్రజల తరఫున ఒక ఎజెండాను ప్రచారంలో పెట్టి, దానికీ ఓటింగ్‌కూ సాధ్యమైనంతగా ముడివేయడానికి వీలయిన చోట్ల ప్రజాస్వామిక శక్తులు పనిచేస్తూ వస్తున్నాయి.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదు. సమస్త ప్రజాజీవనరంగాలలోను అమలుజరగవలసిన విలువ ప్రజాస్వామ్యం. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ప్రజాస్వామ్యం సమానత్వ భావనకు, సమానావకాశాలకు ఒక ప్రాతిపదిక. ప్రజలు తమ వ్యవహారాలను నిర్వహించడానికి కావలసిన అధికారరాజకీయ శ్రేణిని ఎంచుకుంటారు. ప్రజల పేరు మీద అధికారానికి వచ్చినవారు, అధికారయంత్రాంగం, ఇతర పాలనా వ్యవస్థల ద్వారా గౌరవప్రదమైన సామూహిక సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధించాలి, నిర్వహించాలి. కానీ, ప్రభుత్వాలు ఏమిచేస్తున్నాయి? ప్రజలందరి సమష్టి సంపద అయిన వనరులను స్వార్థ వ్యక్తులకు, సంస్థలకు మళ్లిస్తున్నాయి. ప్రతిప్రభుత్వ కార్యక్రమంలోనూ ప్రజల సొమ్ము అపహరణకు వీలు కల్పిస్తున్నాయి. సామాజిక, ఆర్థిక అంతరాలను కాపాడడానికి అణచివేతను ప్రయోగిస్తున్నాయి. ఈ అసమాన, అన్యాయ సామాజిక, రాజకీయ వ్యవస్థ నుంచి ఆవిర్భవించి, దాని నియమాలకు లోబడి పనిచేసే రాజకీయపక్షాలు, విప్లవాత్మకంగా వ్యవహరిస్తాయని ఆశించలేము. ఎన్నికల సమయంలో మాత్రమే తమ అభీష్టాన్ని తెలిపి, ఆ తరువాత ప్రభుత్వాల నుంచి ఆశించడం మాత్రమే చేస్తే, ప్రజలు సాధించేది స్వల్పమే. ప్రజాస్వామ్యాన్ని సకలరంగాలలో అమలుజరిపేందుకు ప్రజలు ప్రయత్నిస్తేనే దాత, గ్రహీత సంబంధం తొలగిపోయి, భాగస్వామ్య భావన ఏర్పడుతుంది.

వర్తమానాన్ని మాత్రమే మదింపు వేస్తే, భారత ప్రజాస్వామ్యం అత్యంత నాసిరకమైన, అమానవీయమైన స్థితిలో ఉన్నది, అయితే, ఇది అంతకు మునుపున్న స్థితి కంటె మెరుగైనదే. గత ఏడున్నర దశాబ్దాలలో భారత ప్రజాస్వామ్యం నాణ్యత క్రమంగా పెరుగుతూ వస్తోంది. బహుశా, ప్రజాచైతన్యం, ప్రజాస్వామిక ఆచరణలు పెరిగినందువల్లనే, ప్రస్తుత ప్రభుత్వాలు హెచ్చు అణచివేతను, క్రూరమైన పాలనావిధానాలను అమలుచేయవలసి వస్తున్నది. ప్రధాన రాజకీయపక్షాలు చెప్పే మాటలు, ఆశయాలు, లక్ష్యాలు మాత్రమే కాక, వివిధ ప్రజా సమూహాలు, శ్రేణులు, సొంతంగా రూపొందించి ప్రకటించే రాజకీయ వాదనలు సమాజంలో బలం పుంజుకుంటున్నాయి. ఎన్నికల ద్వారా కాకుండా, సాటి ప్రజల మద్దతుతో, ప్రభుత్వాలతో సంప్రదింపులతో, పోరాటాలతో తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి వివిధ ప్రజాసమాజాలు ప్రయత్నిస్తున్నాయి. అదే క్రమంలో, ఎన్నికల ప్రక్రియలో కూడా తమ ప్రమేయాన్ని పెంచుకోవడానికి ప్రజాస్వామిక శక్తులు మునుపటి కంటె అధికంగా చొరవ చూపుతున్నాయి. ఆ రంగాన్ని వృత్తి రాజకీయనాయకులకు, డబ్బుకు సామాజిక పలుకుబడికి లొంగిపోయే ఓటర్లకు వదిలిపెట్టకూడదని అనుకుంటున్నాయి. ఇదంతా ప్రజాస్వామ్యం మీద అనవసరపు భ్రమలు పెంచుతుందా లేక ఆచరణాత్మకమైన విశ్వాసాన్ని పెంచుతుందా అన్నది చర్చనీయాంశమే.

> ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా ఎటువంటి మార్పూ అనుభవంలోకి రాని ప్రజాశ్రేణులే ఇప్పుడు దేశంలో, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నాయి. భ్రమతో కాక, అవసరంతో అవగాహనతో కలసి నడుస్తున్నాయి.

ఎన్నికల పద్ధతిని పూర్తిగా వ్యతిరేకించి, ఇతరమార్గాల ద్వారానే ప్రజల సాధికారతను సాధిస్తామని నమ్మేవారిని ఖండించనక్కరలేదు. వ్యవస్థను మౌలికంగా మార్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సృజనాత్మకంగా అన్వేషించే ప్రయత్నం కూడా నిరంతరం సాగవలసిందే. ఓటింగ్‌ను నిరాకరించడం అన్నది ఒక విధానప్రకటన. స్వతంత్ర భారతంలో అనేక సందర్భాలలో ఓట్ల బహిష్కరణ ఒక నిరసన రూపంగా వ్యక్తమైంది. కానీ, పూర్తి వ్యవస్థ మీద నిరసనతో జరిగిన సైద్ధానిక బహిష్కరణ అతి బలహీనంగా మాత్రమే ఉన్నది. పైగా, భారత ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడం రానురాను పెరుగుతోంది. వివిధ నిర్బంధ ప్రలోభాల ఆధారంగా కాక, స్వీయ ఇచ్ఛతో రహస్య ఓటింగ్‌ను వినియోగించుకోవాలనుకునే వారు కూడా పెరుగుతున్నారు. మెరుగైన జీవితాల కోసం ప్రజల ప్రయత్నాలు ఎన్నికల రాజకీయాలతోను, ఉద్యమ రాజకీయాలతోను కూడా కలసి నడుస్తాయి. ఒక్కోసారి ఆ రెండు రకాల రాజకీయాలు కలసి ఉండవచ్చు, మరోసారి అవి ఎదురెదురుగా తలపడవచ్చు. అధికారంలో ఉన్న వారి దౌర్జన్యం నుంచి తప్పించుకోవడంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయి. వాటిని సాధించుకునే సందర్భంలో ఉభయపక్షాల మధ్య వైరుధ్యాలు తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంటాయి. ప్రజాస్వామ్య స్థలాలు విస్తరిస్తాయి. ప్రజలే లబ్ధి పొందేలా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.

ఆపద పెద్దదైనప్పుడు, అందరూ దొంగలే అనే అద్భుత సత్యాన్ని అర్జెంటుగా ప్రకటించవలసిన అవసరం ఏముంది?

> భారత ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడం రానురాను పెరుగుతోంది. వివిధ నిర్బంధ ప్రలోభాల ఆధారంగా కాక, స్వీయ ఇచ్ఛతో రహస్య ఓటింగ్‌ను వినియోగించుకోవాలనుకునే వారు కూడా పెరుగుతున్నారు. మెరుగైన జీవితాల కోసం ప్రజల ప్రయత్నాలు ఎన్నికల రాజకీయాలతోను, ఉద్యమ రాజకీయాలతోను కూడా కలసి నడుస్తాయి. ఒక్కోసారి ఆ రెండు రకాల రాజకీయాలు కలసి ఉండవచ్చు, మరోసారి అవి ఎదురెదురుగా తలపడవచ్చు. అధికారంలో ఉన్న వారి దౌర్జన్యం నుంచి తప్పించుకోవడంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయి. వాటిని సాధించుకునే సందర్భంలో ఉభయపక్షాల మధ్య వైరుధ్యాలు తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంటాయి. ప్రజాస్వామ్య స్థలాలు విస్తరిస్తాయి. ప్రజలే లబ్ధి పొందేలా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.

ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన వారసత్వ నిర్మాణాల పరిరక్షణ

రాజులు, రాజ్యాలు పోయినా వారు నిర్మించిన అద్భుత కట్టడాలు ఆనాటి మహోన్నత సంస్కృతిని మన వారసత్వంగా సగర్వంగా చెప్పుకునేలా చేశాయి. ఆ ప్రాచీన వైభవాన్ని కాపాడుకోవడం ఇప్పుడు ప్రపంచ మానవాళి బాధ్యత. ఈ బృహత్తరమైన అంశాన్ని గమనించి యునెస్కో 1983లో ప్రతి ఏటా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచ వారసత్వ ప్రదేశాల ప్రాముఖ్యత, చారిత్రక నిర్మాణాలను సంరక్షించడంతో పాటు ప్రజలలో వీటి గురించి అవగాహన, అనురక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏటా వారసత్వ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. యునెస్కో ఇంతవరకు మన దేశంలో 42 ప్రదేశాలను ప్రపంచ వారసత్వ స్థలాలుగా గుర్తించింది. ఇందులో 34 ప్రదేశాలు సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలుగా, ఏడు సహజసిద్ధమైన అద్భుత ప్రదేశాలుగా, ఒకటి మిశ్రమ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందాయి. సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క రామప్ప దేవాలయం మాత్రమే ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మానవజాతి తమ వారసత్వ సంపదగా పరిరక్షించాల్సిన ప్రదేశాలు, సరైన గుర్తింపునకు నోచుకోని వారసత్వ కట్టడాలు వాటి ఆలనా పాలనా కొరకు ఇంకా ఎదురుచూస్తున్నాయి, అనేకం చారిత్రక శిథిలాలుగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. చారిత్రక సంపద ఇంకా మన తెలుగు రాష్ట్రాలలో మిగిలివున్నా, అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి యునెస్కో పరిశీలనకు పంపడానికి ఆసక్తి చూపే ప్రభుత్వాలు కరువయ్యాయి. పారిస్, వెనిస్, రోమ్ వంటి నగరాలకు ఏ మాత్రం తీసిపోని దీటైన సాంస్కృతీ ప్రవంతి నగరాలు మన దేశంలో చాలా ఉన్నాయని, ప్రాచీన మధ్య యుగాలలో మన దేశానికి రాయబారులుగా, వర్తకులుగా వచ్చిన అనేకమంది విదేశీ చరిత్రకారులు వారి రచనలలో పేర్కొన్నా, ఈనాటికీ కొన్ని చారిత్రక నగరాలు సరైన గుర్తింపునకు నోచుకోక, ఆక్రమణలకు బలైపోతూ కాలగర్భంలో కలసిపోతున్నాయి. అయితే వీటి సంరక్షణ బాధ్యతలు తీసుకొనే ప్రజలే సమాజానికి, దేశానికి, ప్రపంచానికి సాంస్కృతిక సంపత్తిని అందించిన వారుగా చరిత్రలో నిలిచిపోతారు. మహోన్నతమైన మన తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక, వాస్తు, శిల్పకళా సంపదను భావితరాలకు అందించడం మన అందరి కర్తవ్యం.

– గోవిందు సురేంద్ర

(నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం)

వికాసం, వారసత్వం... మోదీ సంకల్పం

మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా దేశంలోని మొత్తం 46 ప్రముఖ దేవాలయాలలో 1629 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో తెలంగాణలోని మూడు ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయి. అవి హన్మకొండ, అలంపూర్, భద్రాచలం. యునెస్కో గుర్తింపు సాధించిన రామప్ప ఆలయానికి కేంద్రం నుంచి 62 కోట్లు మంజూరు అయ్యాయి, పనులు వివిధ దశలలో ఉన్నాయి. అలంపూర్ జోగులాంబ శక్తిపీఠానికి కూడా 36.73 కోట్లు మంజూరయ్యాయి.

ఉత్తరాదిన ఉన్న అయోధ్య రామునికి మాత్రమే నిధులు ఇస్తున్నారు, భద్రాచలంలో ఉన్న రాముని గుడికి నిధులు ఇవ్వలేదు అనే మాట కూడా అవాస్తవం. 2022లో ప్రసాద్ పథకంలో భాగంగా భద్రాచలంలో సౌకర్యాల అభివృద్ధి కోసం 41.38 కోట్లు మంజూరయ్యాయి, పనులు వివిధ దశలలో ఉన్నాయి. రామాయణ సర్క్యూట్‌లో భారత రైల్వే నడుపుతున్న ప్రత్యేక భారత్ గౌరవ్ రైల్ అయోధ్యలో ప్రారంభమై నేపాల్‌లోని సీతమ్మ జన్మస్థలం జనకపూర్‌తో పాటు భద్రాచలాన్ని కూడా కలుపుతూ తిరిగి ఢిల్లీలో ముగుస్తుంది. కాబట్టి భద్రాచలాన్ని విస్మరించారనడం అనుచితం.

ఇవి మాత్రమే కాక, హన్మకొండలోని వేయి స్తంభాల గుడిలో ఉన్న మండపం 2006లో తొలగించిన తరువాత మళ్లీ గతంలో మాదిరిగా స్థాపించే పని పూర్తిగా ఆగిపోయింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 11 కోట్ల రూపాయలతో దాని పునర్నిర్మాణాన్ని పూర్తి చేయించి, ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. వరంగల్ ఫోర్ట్, ఉస్మానియా యూనివర్సిటీ, గోల్కొండ ఫోర్ట్‌లో సౌండ్ అండ్ లైట్ షో ప్రారంభమయ్యాయి. హుస్సేన్ సాగర్ వద్ద వాటర్ స్క్రీన్‌పై కోహినూర్ స్టోరీ పేరుతో లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభమయింది. మాదాపూర్‌లో భారత్ కళా మండపం పేరుతో కొత్త ఆడిటోరియానికి శంకుస్థాపన జరిగింది. దేశంలోనే మొదటి జాతీయ శిలాశాసనాల సంగ్రహాలయం హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో ప్రారంభమైంది. ఇందులో లక్షకు పైగా చారిత్రక శిలాశాసనాలని భవిష్యత్ తరాల కోసం డిజిటైజ్ చేయనున్నారు.

ఇవన్నీ కూడా భారత్ సాంస్కృతిక వైభవాన్ని పెంపొందించుకోవడానికి ఉద్దేశించినవే. మన పూర్వీకుల సంస్కృతిని తెలుసుకుని మనం కూడా కొనసాగించాలి, అప్పుడే విశ్వంలో మన దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. వికాస్ భీ, విరాసత్ భీ (వికాసంతో పాటు వారసత్వం కూడా) అనే మోదీ ప్రభుత్వ సంకల్పం ఇంకా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాం.

– భవాని సాగి

రావణవీణ పురస్కారాలు

రావణవీణ–2023 సంగీత సాహిత్య పురస్కారాన్ని తెలంగాణ ఉద్యమ వాగ్గేయకారులు నలిగంటి శరత్ చమార్, మచ్చ దేవేందర్‌లకు ప్రదానం చేయనున్నాం. 11 మంది సామాజికవేత్తలతో కూడిన కమిటీ పురస్కార గ్రహీతలను ఎంపిక చేసింది. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే ఐహెచ్ఆర్ఎస్‌వి ఆవిర్భావ కార్యక్రమంలో వీరికి రూ.25 వేల నగదుతో పురస్కార ప్రదానం ఉంటుంది.

– డాక్టర్ అరూరి సుధాకర్
'ఇంటర్నేషనల్ హిందూ రావణ సేవావాహిని' (ఐహెచ్ఆర్ఎస్‌వి)

వన్యప్రాణి సిబ్బందిని ఎన్నికలకు వాడొద్దు!

తెలుగు రాష్ట్రాలు ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ స్థితిని ఎదుర్కొంటున్నాయి. సాగునీటితో పాటు తాగునీటికి కూడా తీవ్ర కొరత ఏర్పడింది. ఇక పశుపోషకులు పశువుల దాహార్తిని ఎలా తీర్చాలో తెలియక మార్చి నెల నుంచే సతమతమవుతున్నారు. అడవులలో తాగునీరు లభ్యం కాక అనేక వన్యప్రాణులు పంట పొలాలు, జనావాసాలలోకి ప్రవేశించి బీభత్సాన్ని కలిగిస్తున్నాయి. విచక్షణా రహితంగా సాగునీరు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల వల్ల అడవులలోని సహజ జలవనరులు చాలాచోట్ల ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వాలు ఇలాంటి దుర్భిక్ష పరిస్థితి నుంచి కాపాడడానికి రిజర్వుడు అడవులలో నిర్మించిన తాగునీటి గుంటలు, ట్యాంకులు, వాయువుతో నడిచే భూగర్భ జలాలను తోడే విండ్‌మిల్స్ ఏర్పాట్లు ఇప్పుడు చాలావరకు సరియైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే అంతకంటే బాధ్యతారాహిత్యం వేరొకటి ఉండదు.

వెంటనే ప్రభుత్వాలు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మన అడవులలోని చెక్‌డ్యామ్‌లను, చెరువులను, గుంటలను, వాటర్ ట్యాంకులను, భూగర్భ జలాలను తోడే విండ్‌మిల్స్‌ను పూర్తిగా పునరుద్ధరించి, ప్రతి వన్యప్రాణికీ తాగునీరు అందేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. వన్యమృగాలకు తాగునీటిని క్రమం తప్పకుండా ట్యాంకర్లతో అడవులలో ఏర్పాటుచేసిన కుండీలలో నింపే విధంగా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కింద చర్యలు తీసుకోవాలి.

అయితే గత పది సంవత్సరాలుగా మన అటవీశాఖలో పదవీ విరమణలు తప్ప నియామకాలు లేనందువల్ల క్షేత్రస్థాయి విధులు నిర్వహించే సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ స్థితిలో అడవుల్లో విధుల్ని నిర్వహించే సిబ్బందిని ఎన్నికల విధుల నుంచి పూర్తిగా మినహాయించాలి. అప్పుడే వన్యమృగాల సంరక్షణకు ఆటంకాలు ఉండవు. ఈ విషయమై ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

పౌరుల తాగునీటి సరఫరాలోనే ఎన్నో అక్రమాల కథనాలు వింటున్న ఈ రోజుల్లో మారుమూల అడవుల్లోని మూగజీవాలకు కనీస తాగునీటి సరఫరా పట్ల ప్రభుత్వ వ్యవస్థ చిత్తశుద్ధి అనుమానాస్పదంగా ఉండడం బాధాకరం. కాబట్టి జంతు ప్రేమికులు, పర్యావరణ–జీవకారుణ్య సంస్థలు, జీవవైవిధ్యం పట్ల స్పృహ కలిగిన పౌర సమాజం స్వచ్ఛంద సంఘాలుగా ఏర్పడి వన్యప్రాణుల దాహార్తిని తీర్చే కృషిలో పాలుపంచుకోవాలి.

– ఎం.వి.జి అహోబలరావు

కార్పొరేట్, సైనిక్ భారత్‌లు కలిసి ఆదివాసీలపై యుద్ధం!

నాలుగు దశాబ్దాలుగా ఎంతో హింసను అనుభవించిన దండకారణ్యంలో గత మూడు నెలలుగా తీవ్ర యుద్ధమే నడుస్తున్నది. ఇది దండయాత్రను, దురాక్రమణ యుద్ధాన్ని, అంతర్యుద్ధాన్ని తలపిస్తున్నది. ఏప్రిల్ 16న మాడ్ ప్రాంతంలో జరిగిన దాడిలో 29 మంది చనిపోయారు. వీరిలో విప్లవకారులు ఎందరో, సాధారణ ఆదివాసులు ఎందరో ఇప్పటికీ తెలియదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ అనే సరికొత్త యుద్ధంలో భాగంగా ఈ మారణకాండ జరిగింది. ఢిల్లీలోని ప్రభుత్వం అబూజ్‌మాడ్‌ను చేజిక్కించుకోడానికి తన సర్వసైన్యాలను దండకారణ్యానికి తరలించింది. మొన్నటి దాకా ఎవ్వరికీ తెలియని మారుమూల అటవీ స్థావరం కోసం జరుగుతున్నట్టు కనిపించే ఈ పోరాటం ఎవరికైనా జానపద గాథలా అనిపించవచ్చు.

వాస్తవానికి ద్రవ్యపెట్టుబడి యుగంలో, ఆధునిక రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో జరుగుతున్న సంఘర్షణ ఇది. అక్కడున్న సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడానికి జరుగుతున్న యుద్ధం ఇది. సారాంశంలో ఈ పోరాటం దేశ రాజకీయార్థికాల కేంద్రస్థానానికి సంబంధించినది. దేశమంతా పెద్ద ఎత్తున సాగుతున్న కార్పొరేటీకరణకు దండకారణ్యంలో తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యాక పాలకులు ఆ ప్రాంతాన్ని అతిపెద్ద మిలటరీ జోన్‌గా మార్చేశారు. ఇది ఇప్పటికిప్పుడు మొదలైంది కాదు. కనీసం ముప్పై ఏళ్ల చరిత్ర ఉన్నది. కార్పొరేటీకరణకు ఆటంకంగా ఉన్న ఆదివాసీ ఉద్యమాన్ని ప్రభుత్వం మారుమూల సమస్యగా భావించడం లేదు. అదే కేంద్ర సమస్య అనుకుంటోంది.

అబూజ్‌మాడ్ ఘటన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అమితానందంగా స్పందించాడు. మావోయిస్టు ఉద్యమం అభివృద్ధికి అతిపెద్ద శత్రువనీ, దాన్నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని అన్నాడు. దేశంలో కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమాల్లో మావోయిస్టు ఉద్యమాన్ని అతి పెద్ద ప్రమాదంగా భావించడంలో స్పష్టమైన రాజకీయార్థిక వైఖరి ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ నినాదం ఒకటే. 'మావోయిస్టు ఉద్యమం నుంచి దేశాన్ని విముక్తి చేస్తాం.. కార్పొరేట్లకు అప్పగిస్తాం'. దీని కోసం తెచ్చిన ఆపరేషన్ కగార్ 2017లో మొదలైన ఆపరేషన్ సమాధాన్–ప్రహార్‌లో భాగమే అయినా గుణాత్మకంగా భిన్నమైనది.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు ముఖ్యమైన ప్రకటనలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వెలువడ్డాయి. ఒకటి: మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన; రెండు: మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని రాష్ట్ర హోం మంత్రి విజయ్‌శర్మ ప్రకటన. మొదటిది నిర్మూలన కాబట్టి సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, నేషనల్ సెక్యురిటీ గార్డ్స్ తదితర బలగాల్లోని వేలాది మందిని అదనంగా దండకారణ్యంలోకి తరలించారు. రెండోది చర్చలు కాబట్టి అటవీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి, గనుల తవ్వకానికి ఆటంకం కల్పించకూడదనే కండీషన్ పెట్టారు. సజావుగా గనులు తవ్వుకోడానికి కార్పొరేట్లకు అనుకూల వాతావరణం ఉండాలని, అప్పుడే చర్చలు జరుగుతాయని చెప్పారు. దీనికి మావోయిస్టులు సిద్ధమైనా కాకపోయినా అలాంటి అనుకూల వాతావరణాన్ని నెలకొల్పాల్సిన తక్షణ బాధ్యత తనకు ఉన్నదని ప్రభుత్వం భావించింది. ఈ స్వల్ప కాలంలోనే ఒక్క మాడ్ ప్రాంతంలోనే ఆరు బేస్ కేంపులు ఏర్పాటు చేసింది.

> ఛత్తీస్‌గఢ్–ఢిల్లీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం కార్పొరేట్ల తరఫున ముందుకు వచ్చి, వాళ్ల పనులకు ఏ ఇబ్బందీ కలగకుండా చేయడమే లక్ష్యంగా చర్చలను ప్రతిపాదించింది. రాజకీయార్థిక పరిభాషలో ఇది కార్పొరేటీకరణ. దాన్ని సాధించేందుకు ఒక పక్క చర్చల ప్రతిపాదన, ఇంకో పక్క సైనికీకరణ అనే విధానాన్ని తీసుకొచ్చింది.

సైనిక ఉద్రిక్తత ఉన్న చోట ఇరు పక్షాల మధ్య చర్చలకు ఎవరు ప్రతిపాదించినా అది రాజకీయాల ప్రాధాన్యతను పెంచాలి. కానీ ఛత్తీస్‌గఢ్ ఢిల్లీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం చర్చలకు వింత ప్రతిపాదన పెట్టింది. కార్పొరేట్ల తరఫున ప్రభుత్వం ముందుకు వచ్చి, వాళ్ల పనులకు ఏ ఇబ్బందీ కలగకుండా చేయడమే లక్ష్యంగా చర్చలను ప్రతిపాదించింది. రాజకీయార్థిక పరిభాషలో ఇది కార్పొరేటీకరణ. దాన్ని సాధించేందుకు ఒక పక్క చర్చల ప్రతిపాదన, ఇంకో పక్క సైనికీకరణ అనే విధానాన్ని తీసుకొచ్చింది.

గత ఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచి బీజేపీ ప్రభుత్వం వేగంగా ఈ సన్నాహాన్నంతా చేసింది. జనవరి ఒకటో తేదీ మంగ్లీ అనే పసిపాప హత్యతో కగార్ మొదలయ్యాక విరామం లేకుండా ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉంది. దాడులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. ఏప్రిల్ 2న బీజాపూర్ జిల్లా కోర్చోలి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు చనిపోయారని వార్త వచ్చింది. వాళ్లంతా మావోయిస్టులైనా కాకపోయినా ఆదివాసులే. అప్పటి నుంచి 75 మందిని ఎన్‌కౌంటర్ పేరిట ఆదివాసులను, విప్లవకారులను కాల్చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో జరిగిన వైమానిక దాడులకు కొనసాగింపుగా ఐదోసారి జనవరి 13న ఏరియల్ బాంబింగ్ కూడా చేశారు.



నిజానికి 2022 అక్టోబర్ 27, 28 తేదీల్లో హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో ఒక చింతనా శిబిరం జరిగింది. దీనికి వివిధ రాష్ట్రాల హోం మంత్రులు, హోం సెక్రటరీలు, పోలీసు, సైనిక అధికారులు హాజరయ్యారు. వీళ్లంతా 'నూతన భారతదేశం' అనే ఒక స్వప్నం గురించి చర్చించారు. అది 2047 నాటికి సాకారం కావాలని అన్నారు. సుమారుగా ఆ కాలంలోనే ఆర్ఎస్ఎస్ అధికార పత్రికలు దీన్నే హిందు రాష్ట్ర సాకారం చేసే లక్ష్యంగా ప్రకటించుకున్నాయి. న్యూ ఇండియాకైనా, హిందూ రాష్ట్ర స్థాపనకైనా మావోయిస్టు ఉద్యమం అడ్డంగా ఉన్నది. ఈ సంగతి సూరజ్‌కుండ్ చింతనా శిబిరమే కాదు. అంతక ముందే సంఘ్ పరివార్ కూడా తేల్చుకున్నది. వామపక్ష విప్లవోద్యమం ఉన్నంత వరకు కార్పొరేట్ హిందుత్వ పునాది మీద 'నూతన భారత్'కు అవకాశం లేదు. కార్పొరేట్ హిందూ రాష్ట్ర స్థాపన అనేది సంఘ్ పరివార్‌కు భావజాల సాంస్కృతిక వ్యూహమే కాదు. బీజేపీ ప్రభుత్వానికి రాజకీయార్థిక, సైనిక, పాలనా వ్యూహం కూడా. మధ్య భారతదేశంలో గత మూడేళ్లుగా కనీసం పద్నాలుగు అతి పెద్ద ప్రజా పోరాటాలు నడుస్తున్నాయి. గతంలో ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమ కాలంలోనే మొదలైన సిలింగేర్ నిరాయుధ పోరాటం ఇప్పటికీ కొనసాగుతున్నది. అడవులను, చెట్లను, నీటిని, నేలను, ఆకాశాన్ని కాపాడుకోడానికి పర్యావరణ, సాంస్కృతిక, నైసర్గిక కోణాలతో ఈ రాజకీయార్థిక పోరాటాలు జరుగుతున్నాయి. లక్షలాది మంది ఏండ్ల తరబడి వంతెనలు, రోడ్లు, గనుల తవ్వకం, పర్యాటకం, హిందుత్వ ప్రచారం, రైతాంగ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చట్టాల వంటి అనేక సమస్యలపై పోరాడుతున్నారు. వీటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించలేకపోతున్నాయి. ఇప్పటి దాకా ఉన్న సమాధాన్ ఆపరేషన్ చాలక దానికి పదును పెడుతూ కగార్‌ను తీసుకొచ్చాయి.

గత పదేళ్లుగా దేశ ప్రజలందరూ అనుభవిస్తున్న ఉక్కపోత వెనుక, అభద్రత వెనుక, రాజ్యాంగ సంస్థల విధ్వంసం వెనుక ఈ వ్యూహం ఉన్నది. ఇక ఇది గతంలో దేశమంతా అనుభవించిన ఎమర్జెన్సీలాంటిదే కాదు. పీవీ నరసింహారావు ఆరంభించిన నూతన ఆర్థిక విధానాల వంటిదీ కాదు. రెండు నక్సలైట్ పార్టీలు కలిసి సిపిఐ మావోయిస్టుగా ఏర్పడగానే అప్పటి కాంగ్రెస్ ప్రధాని అన్నట్లు 'దేశ అంతరంగిక శత్రువు' మీది పోరాటం మాత్రమే కాదు. 2009 నుంచి 2017 దాకా నడిచిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ కూడా కాదు. ఇది సంఘ్ పరివార్ సాధించాలనుకుంటున్న కార్పొరేట్ హిందూ రాష్ట్ర స్థాపన కోసం తాజాగా మొదలైన ఆపరేషన్ కగార్.

■ పాణి



వేయిస్తంభాల దేవాలయంలో..



కల్యాణం అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులు

కల్యాణ వైభోగమే..

నేత్రపర్వంగా శ్రీ సీతారాముల కల్యాణం

- చూచువారలకు చూడముచ్చటగా వేడుక
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం
- వేయిస్తంభాలగుడి, చిన్న కోవెలలో నేత్రపర్వంగా రాములోరి పెళ్లి
- రెవెన్యూ రామాలయంలో పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నాయిని

జగదభిరాముడు శ్రీరామచంద్రుడు.. జానకీమాత సీతాదేవిల కమనీయ కల్యాణ ఘట్టాలు బుధవారం చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రంతో కర్కాటక లగ్నంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై అభిజిద్ లగ్నసుమూర్తాన 12గంటలకు రాములోరి పెళ్లి వేడుకలు నగరమంతా ఆవిష్కృతమయ్యాయి. చూచువారలకు చూడముచ్చటగా వాడవాడలా రాములోరి పెళ్లి వేడుకలు కనువిందు చేశాయి. ఆలయాలు పెళ్లిసందడితో పులకించిపోయాయి. ఎండవేడిని కూడా లెక్క చేయకుండా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాములోరి పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు అంతగా ఆసక్తి చూపనప్పటికీ భక్తులు, అధికారులు అక్కడక్కడా వేడుకల్లో పాల్గొన్నారు.



రెవెన్యూ కాలనీలోని సీతరామాంజనేయ స్వామి ఆలయంలో తాళి చూపిస్తున్న ఆలయ పూజారి

పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

8



వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణపై ట్రయల్ నిర్వహిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

నామినేషన్ల స్వీకరణకు వేళాయే..

- నేటి నుంచి లోక్‌సభ స్థానాలకు నామినేషన్లు
- ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరణ
- 26న పరిశీలన, 29న ఉపసంహరణలకు గడువు
- మే 13న మహబూబాబాద్, వరంగల్ ఎంపీ స్థానాలకు ఎన్నికలు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- రెండు జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లు
- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ప్రచారపర్వంలోకి ప్రధాన పార్టీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్ సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినే షన్లను గురువారం నుంచి స్వీకరించనున్నారు. ఇందు కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న వరం గల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశా రు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. మే 13న రెండు లోక్‌స భ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఓట్ల కోసం ప్రజాక్షేత్రంలో మండుటెండను లెక్క చేయకుండా ప్రచారపర్వంలో చెమటోడ్చుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 4వ దశలో తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానా లకు మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఇచ్చారు. 26వ తేదీన వచ్చిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో పరిశీలన చేయనున్నారు. 27 శనివారం, 28 ఆదివారం కావటంతో రెండు రోజులు సెలవులు. 29వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్నికల గుర్తులను కూడా కేటాయించనున్నారు. మే 13వ తేదీన రెండు లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్లలో నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3గంటల తరువాత వచ్చే నామినేషన్లను స్వీకరించరని వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన లైటింగ్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు సిద్ధం

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. నగదు రవాణా, మద్యం అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిం ది. వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌ల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఓట్ల వేటకు దిగుతున్నారు. కీలక నేతలను కలుసుకోవటంతో పాటు బూత్‌స్థాయి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో ఎన్నికల ప్రచారం మరింతగా హీటెక్కనుంది.

అభ్యర్థులు సై..

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఈనెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే 21 లేదా 22వ తేదీన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీ‌ష్‌రావు కవిత నామినేషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ నామినేషన్ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డాక్టర్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. అలాగే వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మొదటి సెట్ 22వ తేదీన దాఖలు చేస్తుండగా, 24వ తేదీన మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. 24వ తేదీన కావ్య నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మడికొండలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 24వ తేదీన నామినేషన్ వేయనున్నారు. అరూరి రమేష్ నామి నేషన్ ఘట్టానికి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ 22వ తేదీన నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఓటర్ల లెక్క ఇదీ..! 7

- వరంగల్‌లో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 28న ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని ఆయా లోక్‌సభ స్థానాలకు సంబంధించి గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికా‌స్‌రాజ్ కోరారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వికా‌స్‌రాజ్ మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఆర్వో కార్యాలయాల వద్ద ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 28వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. అదే విధంగా సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్, డైలీ రిపోర్ట్, నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా వికాస్ రాజ్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, డీఆర్‌ఓ వైవీ గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీఓ నాగ పద్మజ, ఆర్డీవోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎన్నికల విధులు సమన్వయంతో నిర్వహించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ చేయాలి
- వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ నుంచి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్, హనుమకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రాధిక గుప్తాలతో కలిసి వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం చేసే అభ్యర్థుల వాహనాల అనుమతులకు సువిధ యాప్ ద్వారా రిటర్నింగ్ అధికారి పరిధిలో మంజూరు చేయాలన్నారు. సభలు, సమావేశాలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు లేదా ఎన్నికల అధికారుల స్థాయిలో మంజూరు చేస్తూ ఎస్ఎస్‌టీలు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల అంశాలపై నియమించిన అధికారులు సకాలంలో నిర్ణీత నమూనాలు, రోజువారి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ సెంట్రల్ అధికారులను రిజర్వ్‌గా ఉంచుకోవాలని రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తక్షణమే పూర్తి చేసి, ప్రతీ పోలింగ్ కేంద్రంలో అధికారులు, సిబ్బంది బీఎల్‌వోల వివరాలు ప్రదర్శించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 స్వీకరణను ఎసెన్షియల్ సర్వీసెస్, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్‌ను ఈ నెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని సూచించారు. గత ఎన్నికల ఆధారంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో దివ్యాంగుల సౌకర్యార్థం అవసరమైన వీల్‌ఛైర్‌లతో పాటు వలంటీర్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ప్రావీణ్య తెలిపారు.

కాన్ఫరెన్స్‌లో వరంగల్, హనుమకొండ డీఆర్వోలు శ్రీనివాస్, వైవి.గణేష్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు డీఎస్.వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటేశ్, సీదం దత్తు, మంగీలాల్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, సంజీవరెడ్డి, పుష్పలత, సౌజన్య, ఏవో శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్, చంద్రశేఖర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మళ్లీ హనుమకొండకే..

- నగరానికి ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం తరలింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్ ఇంటర్ కమిషనర్ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలోని ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఉండేది. అక్కడి నుంచి హనుమకొండ ప్రాంతంలోని ఎక్సైజ్‌కాలనీలోని ప్రైవేట్ భవనంలో ఉండేది. అయితే రాష్ట్ర ఇంటర్ కళాశాల కమిషనర్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌లోని ఇంటర్ కమిషనరేట్ కార్యాలయానికి తరలించారు. అయితే ఇంటర్ విద్య సంఘాలు, ఇతర అధ్యాపక సంఘాల వేర్వేరు అభ్యర్థనల మేరకు ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్-1 పరిధిలోని ఇంటర్ కళాశాలల పర్యవేక్షణ, జూనియర్ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు, ఇతరత్రా పనులు ఆర్జేడీ కార్యాలయం నుంచి నిర్వహిస్తారు. హైదరాబాద్ నుంచి హనుమకొండకు ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని తరలించడంపై అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మడికొండలో సీఎం సభా స్థలి పరిశీలన

మడికొండ, ఏప్రిల్ 17: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 24న హనుమకొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు బహిరంగ సభ నిర్వహణ కోసం బుధవారం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకా‌ష్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సభ కోసం మడికొండ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరులు

బుధవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 42.0°C	కనిష్ఠం : 25.5°C

28 నుంచి దూరవిద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఈనెల 28 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 మే 5, 11, 12, 19,26, 27, 28, 29, 30 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. కేయూ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని తెలిపారు.

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ పంచశీల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, జనగామ ఆర్ఆర్ఎం కాలేజీ, ఎస్ఆర్ఆర్ కాలేజీ, కౌటలా శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ శ్రీఆరంపూర్, స్వాతి డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2లో రామగిరి రైలులో మంగళవారం ఓగుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 55 - 60 యేళ్లు ఉంటుందని, తెల్ల గడ్డం, 5.4 ఎత్తు బ్లూషర్ట్‌పై వైట్‌లైన్స్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్ 87126 58609, 99498 59108కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: అమృత థియేటర్ సమీపంలోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన తన బిడ్డ అదృశ్యమైందని తండ్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో ఎంబీఏ చదువుతున్న యువతి(23) బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపునకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. చింతగట్టు క్యాంపునకు చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

డబ్ల్యూడీసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి మే 20వ తేదీ వరకు నెల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వరంగల్ మండిబజార్‌లోని డబ్ల్యూడీసీఏ కార్యాలయంలో డబ్ల్యూడీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో చాగంటి శ్రీనివాస్ పాల్గొని వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ 5 సెంటర్లను ఎంపిక చేయగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రీడాకారులకు గురువారంతో గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిసామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ప్రతీ సెంటర్‌లో పాల్గొనే క్రీడాకారులకు జంబో క్రికెట్ కిట్, మ్యాట్, బ్యాక్సనెట్, గ్రేస్‌బాల్స్, టెన్నిస్‌బాల్స్‌తో పాటు శిబిరంలో పాల్గొనే ప్రతీ ఒక్క క్రీడాకారుడికి పౌష్టికాహారంగా కోడిగుడ్డు, అరటి పండ్లను ఉచితంగా అందిస్తామన్నారు. అదే విధంగా శిబిరాలలో కోచింగ్ ఇవ్వనున్న కోచ్‌లకు రూ.15వేలు, గ్రౌండ్ మెన్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శ్రీనివాస్ సూచించారు.

నేటితో ముగియనున్న స్వీకరణ

హెచ్‌సీఏ ఆదేశాల మేరకు డబ్ల్యూడీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌లో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ పేర్లను టీటీటీ.జిఖిటజీచిజ్బ్యూటజ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుదని, శిక్షణా శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫామ్‌తో రావాలని కోరారు. శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు మే నెల చివరి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీడీఎల్ - 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడమే కాకుండా హెచ్‌సీఏ అకాడమీకి ఎంపిక చేస్తామన్నారు.

ఐదు జిల్లా కేంద్రాల్లో శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లా కేంద్రాలలోని క్రీడా మైదానాలలో శిక్షణ శిబిరాలను ఎంపిక చేశారు. వరంగల్ ఎల్బీ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు గోవిందసింగ్, బి.వేణు, మహిళా కోచ్ రూప్సీ సెల్ నెంబర్ 9849570979, పరకాల జూనియర్ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు బొజ్జం అరుణ్ సెల్ 9666206662, జయశంకర్ భూపాలపల్లి, సింగరేణి క్రీడా మైదానం కోచ్‌లు కర్ణాకర్, రాజ్‌కుమార్ సెల్ 8897805683, ములుగు తంగేడు క్రీడా మైదానంలో కోచ్‌లు మట్టెడ కుమార్, సందీప్‌నేత్ర సెల్ 9030130727, మహబూబాబాద్ సిద్ధార్థ హైస్కూల్ క్రీడా మైదానం కోచ్‌లు కుమార్, వినయ్ సెల్ 9866479666 నెంబర్‌లలో కోచ్‌లు అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రాఘురాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్, మట్టెడ కుమార్ తదితరులు పాల్గొ

అఫిడవిట్‌లో తప్పులుంటే ఆగమే..

- అభ్యర్థులు నేర సమాచారాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సిందే
- ఆస్తులు, అప్పులను చెప్పాల్సిందే..
- అన్ని కాలమ్స్ నింపాల్సిందే

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అభ్యర్థులు నామపత్రాలతో పాటు సమర్పించే అఫిడవిట్ పత్రాలు కీలకంగా మారుతాయి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పులు ప్రమాణరూపంలో ముందే స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులున్నా.. శిక్ష పడినా.. వాటిని పొందుపరుచాలి. వీటన్నింటిని కలిపి దాఖలు చేసే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారి తీయవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు 2023లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించినట్లు నిర్ధారించి, ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేర సమాచారం చెప్పాల్సిందే...

అభ్యర్థి తనపై క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటిని అఫిడవిట్‌లో పొందుపరచాలి. న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీలుకు వెళ్లినా వాటి సమాచారాన్ని, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలనూ తెలపాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైన నామినేషన్ దాఖలు చేస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలో మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలి. అలాగే అభ్యర్థులు తమపై నమోదైన కేసుల వివరాలు ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలివ్వాలి.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి..

స్థిర, చరాస్తులతో పాటు చేతిలో, ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్‌ను, బీమా పాలసీలను, అప్పులు తదితర సమాచారాన్ని పొందు పర్చాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్‌లో పొందుపరుచాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది పేర్కొనాలి. స్థిరాస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను వెల్లడించాలి.అభ్యర్థి తోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలు ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయమార్గాలు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపనీల కాంట్రాక్టులు ఉంటే వాటిని తెలుపాలి.

అభ్యర్థి వివరాలు తెలుసుకోవడం హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటరు హక్కు. అప్పుడే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫాం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్‌ను సమర్పించాలి.


అన్ని కాలమ్స్‌ను పూర్తి చేయాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలవద్దని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో నిల్ లేదా వర్తించదు అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే రిటర్నింగ్ అధికారి నోటీస్ ఇస్తారు. అప్పుడు సవరించిన అఫడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు.



ఫాం-26 నిబంధనలకు లోబడి ఉండాలి

తీగల జీవన్‌గౌడ్, న్యాయవాది



అభ్యర్థులు ఫాం-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు.

ఓటర్ల లెక్క ఇదీ..

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

వరంగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అలాగే ఓటును ఇతర ప్రాంతాలకు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. దీంతో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల పెరిగాయి. మొత్తంగా నెల రోజుల ఓటరు డ్రైవ్‌లో వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో కొత్తగా 114 ఓట్లు మాత్రమే పెరిగాయి. మహబూబాబాద్ పరిధిలో 3,369 ఓట్లు పెరిగాయి.

వరంగల్ లోక్‌సభ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం వరంగల్ లోక్‌సభ పరిధిలో మొత్తం 18,16,543మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208 మంది, ఇతరులు 395మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,892 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,874 మంది ఓటర్లు ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,030 మంది, వర్ధన్నపేట నియోజకరవ్గంలో 2,72,724మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 15,30,367 మంది ఓటర్లుండగా, పురుషులు 7,46,982 మంది, మహిళలు 7,83,280 మంది ఓటర్లు, ఇతరులు 105మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,58,451మంది ఓటర్లుండగా, నర్సంపేట నియోజకవర్గంలో 2,35,447 మంది, ములుగు నియోజకవర్గంలో 2,32,791 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లి నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	2,56,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

మానుకోట లోక్‌సభ పరిధిలోని అసెంబ్లి నియోజకవర్గాలో ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	79,597	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

నెలరోజుల్లో స్వల్పంగా పెరిగిన ఓటర్లు..

లోక్‌సభ స్థానం	మార్చి 16 (2014)	ఏప్రిల్ 16(2024)	పెరిగిన ఓట్లు
వరంగల్	18,16,429	18,16,543	114
మహబూబాబాద్	15,26,998	15,30,367	3,369

పులకించిన భద్రగిరి



- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 17: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. కంచరికుంటకు చెందిన కేతిరి బాబు ఈనెల 16న మద్యం మత్తులో కాలు జారి కిందపడి ఎంజీఎం ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ సైరన్ పెట్టుకున్న వ్యక్తిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 17: కారులో పోలీస్ సైరన్ పెట్టుకొని రోడ్డుపై మోగించుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. హసన్‌పర్తికి చెందిన కారు డ్రైవర్ అనిల్ నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్‌ను కారులో ఏర్పాటు చేసుకొని కేయూ నుంచి పెద్దమ్మగడ్డలో సైరన్ మోగిస్తూ పెట్రోలింగ్ పోలీసులకు పట్టుబడ్డాడు. వెంటనే కారును స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాములోరి పెళ్లి సందడి

భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



కాజీపేటలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్ యాదవ్



వడ్డేపల్లిలో తాళిబొట్టును చూపిస్తున్న రుత్వికులు



కొత్తూరు వేడుకల్లో పాల్గొన్న నాయిని దంపతులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 18: వరంగల్ హంటర్‌రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం వరంగల్, హనుమకొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ల సంయుక్తాధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అసోసియేషన్ భవన ఆవరణలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఈ కల్యాణ వేడుకలను తిలకించేందుకు రెండు వందల మంది రైస్ మిల్లర్లు, వెయ్యి మందికిపైగా భక్తులు హాజరయ్యారు. ఆలయ పూజారి సతీష్ శర్మ కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా వరంగల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, కార్యదర్శి గోనెల రవీందర్, కోశాధికారి యుగేందర్, హనుమకొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కిషన్ హాజరయ్యారు. కల్యాణం అనంతరం వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు.

● వరంగల్ కార్పొరేషన్: 5వ డివిజన్ కొత్తూరులోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తాడిశెట్టి విద్యాసాగర్, ఆలయ కమిటీ నాయకుడు సతీష్‌ల ఆర్థిక సహాయంతో రూ.5లక్షల విలువగల డైమండ్ నెక్లెస్, పుస్తెలను తయారు చేయించి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్‌శర్మకు అందించారు. అప్పై సీతారాముల కల్యాణ తంతు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొని రామనామ స్మరణ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, రవీందర్, శ్రవంతి, సతీష్, రాకేశ్, సురేష్, షఫీ, శ్రీనివాస్, ఓంప్రకాశ్, మీనయ్యలు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: శ్రీరామ నవమి పురస్కరించుకొని బుధవారం వివిధ ప్రాంతాల్లో జరిగిన సీతారాముల కల్యాణంలో వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ హాజరై పూజలు చేశారు. ప్రశాంత్‌నగర్‌లో మహిళలతో కలిసి కోలాటం ఆడి ఊరేగింపులో పాల్గొన్నారు. హంటర్‌రోడ్డు నందిహిల్స్‌లోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శ్రీరాముడి వివాహవేడుకల్లో పాల్గొన్నారు. జిల్లాలోని హసన్‌పర్తి, వంగపహాడ్, అరెపల్లి, శాయంపేట, తిమ్మాపూర్, మామునూర్, నక్కలపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం హసన్‌పర్తిలో నేత్రపర్వంగా జరిగింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, రాజరాజేశ్వరి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాలనీలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మార్కెట్ మాజీ డైరెక్టర్లు చకిలం రాజేశ్వర్‌రావు, వీసం సురేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు సీతారాముల శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాలనీ వాసులు, శ్రీరామసేవాసమితి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● వడ్డేపల్లి: శ్రీరామ నవమిని పురస్కరించుకొని హనుమకొండ వడ్డేపల్లి శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్-రేవతి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరుకాగా రుత్వికులు మణికొండ వామన్‌కుమార్ శర్మ సీతారామచంద్రస్వామి కల్యాణ తంతును కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి కటకం ప్రసాద్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారామచంద్రస్వామిని కొలిచారు. గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ (నార్త్)లోని పాపులర్‌గార్డెన్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈటూరు కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఖదీర్, ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రావు, పొన్నాల శ్రీకాంత్ తదితరుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను నేత్రపర్వంగా రుత్వికులు నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ మహాలక్ష్మి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, జవహర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భైరి సోమయ్య, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీ నగర్‌లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి- కవిత, కొల్లూరి శ్రీరాములు-హైమావతి సమక్షంలో రుత్వికులు వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణతంతును నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొని శ్రీసీతారామచంద్రస్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. సాయంత్రం సంధ్యావేళ సీతారాముల శోభాయాత్ర మంగళహారతులతో పురవీధులలో నయనానందకరంగా నిర్వహించారు. తొలుత మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంతో పాటు తీర్థప్రసాద వితరణ గావించారు.

● న్యూశాయంపేట: 31వ డివిజన్ న్యూశాయంపేటలో ఉన్న హనుమాన్ దేవాలయంలో బుధవారం ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే నాయిని వెంట స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

● భీమారం: సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పలివేల్పుల గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణతంతును ఆలయ అర్చకులు కె.సాంబయ్య, మఠం రాజేష్ కుమార్‌లు వేద మంత్రోశ్చరణనల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేటలోని స్వయంభు శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు మూలవిరాట్ స్వామివార్లకు పంచామృతాభిషేకం, పానకంతో అభిషేకం నిర్వహించారు. కల్యాణోత్సవానికి స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమాదేవి దంపతులు, అభయ ఆస్పత్రి అధినేత వైద్యం రాజగోపాల్, సవిత, డాక్టర్ వైద్యం గౌతం, వైష్ణవి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. సాయంత్రం కాజీపేట పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగింపు నిర్వహించారు. గురువారం ఉదయం 11 గంటలకు వసంత నవరాత్రులు పూర్తి చేసుకున్న సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు అయినవోలు సాయికృష్ణశర్మ తెలిపారు. కాజీపేట ప్రాంతంలోని డీజిల్ కాలనీ, జూబ్లీమార్కెట్‌లలోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వరాజ్ కుమార్ భానుప్రకాశ్, రవీందర్, శ్రీనివాస్, జగదీష్, భీష్మదేవ్ తదితరులు పాల్గొన్నారు. 63వ డివిజన్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ముస్లింల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

● మడికొండ: మడికొండలోని మెట్టుగుట్టపై గల సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో సీతారాములు ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి కల్యాణ మండపం పైకి చేర్చారు. అంతకుముందు ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేదమంత్రాల హోరులో స్వామివారల కల్యాణ ఘట్టాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, జనగామ అడిషనల్ కలెక్టర్ సుహాసిని స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు. మడికొండ ఇండస్ట్రియల్ ఏరియాలోని వీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు పారుపెల్లి ఉపేందర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం చేశారు. మడికొండలోని వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. కడిపికొండ శివారులోని సూర్య కుటీర్‌లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. సూర్యకుటీర్ కుటుంబ సభ్యులు స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

● ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానానికి ఉప దేవాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కమనీయంగా పూర్తిచేశారు. ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్యఅర్చకులు, పురోహితుడైన ఐనవోలు మధుకర్‌శర్మ పాతర్లపాటి శ్రీనివాస్, వేద పండితుడు గట్టు పురుషోత్తంశర్మ, అర్చకులు నరేష్‌శర్మ, దేవేందర్, భానుప్రసాద్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణాన్ని జరిపి మహాన్నదానం నిర్వహించారు. వెంకటాపూర్, పంథిని, పెరుమాండ్లగూడెం, కక్కిరాలపల్లి, గర్మిళ్లపల్లి, నందనం, పున్నేలు, సింగారం, నర్సింహులగూడెం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి, ఉడుతగూడెం, లింగమోరిగూడెం, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. వేలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు కల్యాణాన్ని తిలకించారు. పట్టు వస్త్రాలను దాతలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ధర్మసాగర్:సీతారాముల కల్యాణ మహోత్సవం ధర్మసాగర్, వేలేరు మండలాల్లో వైభవంగా జరిగింది. పెద్దపెండ్యాల గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన కల్యాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి అశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందచేశారు. శ్రీరాముడి ఆశీస్సులతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కడియం, ఎంపీ అభ్యర్థి కావ్య వేడుకున్నారు.

● బాలసముద్రం : హనుమకొండ బాలసముద్రంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రుత్వికులు సీతారాముల కల్యాణోత్సవ తంతును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా అన్నదానంతో పాటు తీర్థ ప్రసాద వితరణ గావించారు.



ఐనవోలులో మంగళ సూత్రాన్ని చూపిస్తున్న పురోహితుడు మధుకర్‌శర్మ



గాంధీ నగర్‌లో కల్యాణ తంతును నిర్వహిస్తున్న రుత్వికులు



హంటర్‌రోడ్డులో రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అరూరి రమేశ్



మెట్టుగుట్టపై సీతారాములు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కల్యాణ వైభోగమే..

నేత్రపర్వంగా శ్రీ సీతారాముల కల్యాణం



చిన్న కోవెలలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 17: శ్రీ రామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగాయి. హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయం, చిన్న కోవెల పేరుగాంచిన సీతారామచంద్రస్వామి ఆలయం, హనుమకొండ రెవెన్యూ కాలనీలోని రామాలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో యజుర్వేద పండితులు విజయ కుమారాచార్యుల యాజ్ఞికంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నేత్రపర్వంగా జరిగిన కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు నిత్య పూజాకైంకర్యాలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ వేదికపై ప్రతిష్ఠింపజేసి పూజాదికాలు నిర్వహించి కల్యాణ తంతును నిర్వహించారు. విజయ, విజయరాజ్, రవీంద్రనాథ్, అనురాధ దంపతుల సౌజన్యంతో అంతకుముందు మహాపూర్ణాహుతి నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ వేద పండితులు గంగు మణికంఠ, ప్రముఖ న్యాయవాది కర్రె రవీంద్రనాథ్, వసంత దంపతులు పెళ్లి కూతురు పక్షాన, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి దంపతులు పెళ్లి కుమారుడి పక్షాన ఒకరికొకరు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆద్యంతం నేత్రపర్వంగా కల్యాణ వేడుకలు జరిగాయి.

నగరంలోని ప్రసిద్ధ రెవెన్యూకాలనీ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతాచారి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్ల మధ్య నేత్రపర్వంగా వేడుకలు జరిగాయి. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెవెన్యూకాలనీలోని రామాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆనవాయితీగా రాములోరికి సంప్రదాయంగా పట్టువస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా ప్రముఖ చరిత్ర గాంచిన చిన్నకోవెల సీతారామచంద్రస్వామి ఆలయంలో కండ్లకుంట వెంకటరామానుజచార్యులు, చెరుకుపల్లి శ్రీనివాసాచార్యులు యాజ్ఞికంలో ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకుపల్లి నర్సింహాచారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కల్యాణ వేడుకలు జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ జ్ఞానేశ్వర్‌తోపాటు అనేక మంది ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు మజ్జిక, మంచినీరు విరివిగా అందజేశారు.

హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో నేత్రపర్వంగా రాములోరి పెళ్లి వేడుకలు జరిగాయి. ఆలయ చైర్మన్ మతుకుపల్లి హరగోపాల్ దంపతులతోపాటు రాకం సదానందం, పూస సురేశ్‌కుమార్, నిమ్మల శ్రీనివాస్, వేయిగండ్ల రమేశ్ తదితర ధర్మకర్తలు పాల్గొన్నారు. ఆలయ పురోహితులు రాంబాబుశర్మ, కిశోర్‌శర్మ, మణిశర్మల వేద మంత్రాలు, ముత్యాల తలంబ్రాల మధ్య పెళ్లి వేడుకలు జరిగాయి భక్తులకు అన్నదానంతో పాటు బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు. హనుమకొండలోని అదాలత్ సమీపంలోని వెంకటేశ్వరాలయంలో ఆలయ చైర్మన్ అమరేందర్‌రెడ్డి, చాడా సుభాష్‌రెడ్డి, దొంతుల శ్రీధర్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సీతారాముల కల్యాణ వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు దేశికన్‌స్వామి, వంశీ, ఆచార్య, కృష్ణమాచార్య, త్రిపాటిలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి కల్యాణ విశేషాలను భక్తులకు తెలియజెప్పారు.



రెవెన్యూ కాలనీ రామాలయంలో కొబ్బరికాయలు కొడుతున్న మహిళలు

నగరంలోని అనేక అపార్ట్‌మెంట్లలోనూ కల్యాణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. హనుమకొండ విద్యానగర్ కాలనీలోని విజయగణపతి ఆలయంలో ఆలయ అర్చకుడు గిరిజా శంకర్‌భట్ వేద మంత్రోచ్ఛరణలు, వరిగొండ కాంతారావు కమనీయ వ్యాఖ్యానం మధ్య వేడుకలు నిర్వహించారు. హనుమకొండలోని గుడిబండల్ వెంకటేశ్వరాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, అర్చకుడు కలకోట శ్రీనివాసాచార్య, వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాంనగర్ టవర్స్‌లో...

హనుమకొండ రాంనగర్‌లోని టవర్స్‌లో రాములోరి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దర్భాకుల వెంకటేశ్వరశర్మ యాజ్ఞికంతో కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో రాంనగర్ టవర్స్ వాసులతోపాటు నందితారేగర్, క్రాంతినగర్‌వాసులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాంనగర్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్‌రావు, కార్యదర్శి ప్రణయ్, కోశాధికారి దేవేందర్‌రావు, ప్రకాశ్, ప్రసాద్, లక్ష్మణ్ రావు, భగవంత్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ ఏకశిలాపార్కు సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు యాజ్ఞికంతో ఆలయ చైర్మన్ అరుణారెడ్డి, ఉపాధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.స్వాతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. హనుమకొండ ములుగురోడ్‌లోని దత్తక్షేత్రంలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి.

కేడీసీలో ఉచిత కెమిస్ట్రీ ఎంట్రెన్స్ కోచింగ్ ప్రారంభం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే 60 రోజుల పాటు నిర్వహించే ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో కళాశాల విద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ఆన్‌లైన్ ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి మాట్లాడుతూ.. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. కేడీసీ రసాయనశాస్త్ర విభాగాధిపతి, శిక్షణ సమన్వయకర్త డాక్టర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. ఉచిత శిక్షణకు 750 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ క్లాస్‌లను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేడీసీ రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సునీత, డాక్టర్ మొగిలి, డాక్టర్ జగదీశ్‌బాబు, రాష్ట్రంలోని ఇతర కళాశాలల అధ్యాపకులుపాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రవీందర్‌రాజు



రాజారాం



రవీందర్‌రాజు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్. రవీందర్‌రాజును, ఉపాధ్యక్షుడిగా రాజారాంను ఎన్నుకున్నారు. బుధవారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోకల సోమశేఖర్ వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పెండెం రాజు, కోశాధికారి డి.కిరణ్‌కుమార్, కార్యదర్శులు మల్లిక్, మోజెస్, చంద్రయ్య, నవీన్‌కుమార్, లింగారావు, శశిధర్‌రెడ్డి, సదానందం, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలి

కేయూలో విద్యార్థుల ఆందోళన

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: కాకతీయ యూనివర్సిటీ లేడీస్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నేతృత్వంలో విద్యార్థులు బుధవారం ఆందోళన నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, హాస్టల్స్‌లో వసతులు కల్పించాలని ఏబీవీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు.

విద్యార్థులకు అన్నం సరిగా ఉడకనిది పెడుతున్నారని, అల్పాహారం నాణ్యత లేదని, మంచినీళ్ల సక్రమంగా రావడం లేదని అన్నారు. హాస్టల్స్ వర్కర్స్ మెస్ సమస్యలపై విద్యార్థులను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని, దీంతో లేడీస్ భోజనం చేయని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళన విషయం తెలుసుకున్న వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామని, హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మచ్చ పవన్ కల్యాణ్, నరేందర్, అశోక్, చైతన్య, ప్రదీప్, నవ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ రోడ్డులో రోడ్డు పనులు జరుగుతున్నందున నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రజక సంఘం డీటీఆర్, మైత్రినగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

వాహ్.. మోడల్ స్టీమ్ రైలింజన్



విద్యుత్ వెలుగులో మోడల్ రైలింజన్

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన మోడల్ రైల్వే స్టీమ్ ఇంజన్ విద్యుత్ కాంతులతో బుధవారం రాత్రి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన మోడల్ రైల్వే స్టీమ్ ఇంజన్‌ను విద్యుత్ కలర్ లైట్లతో రైల్వే ఉద్యోగులు జిగేల్‌మనేలా ముస్తాబు చేశారు. ఈ స్టీమ్ ఇంజన్ ప్రస్తుతం అంతరించిపోయినప్పటికీ ఇంజన్ సేవలకు గుర్తింపుగా కాజీపేట లోకో డీజిల్ షెడ్, బ్రేక్ డౌన్ స్టాఫ్ 2008లో దీనిని తయారు చేసి కాజీపేట స్టేషన్ ఎదుట ఏర్పాటు చేశారు. వారసత్వ కట్టడాలు, స్మారక చిహ్నాలు గుర్తింపుగా మననం చేసుకోవడానికే ఈ మోడల్ రైలింజన్‌ను ముస్తాబు చేసినట్లు డీజిల్‌షెడ్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ మోడల్ రైలింజన్ చూసిన రైల్వే ప్రయాణికులు వాహ్.. సూపర్బ్.. అంటూ సెల్ఫీలు దిగుతూ, ఫొటోలకు పోజులిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య 9
కుటుంబ కదంబం
గురువారం • 18 ఏప్రిల్ 2024

'ఒకవేళ నటి కాకపోయి ఉంటే ఏమయ్యేవారు' అని అడిగితే... 'ఊహ తెలిసినప్పటి నుంచి అది తప్ప నా మనసులో వేరే ఆలోచనే రాలేదు' అంటుంది **షనయా కపూర్.**
ఇంకా ఒక్క చిత్రంలోనూ కనిపించని ఈ అమ్మాయి పేరు ఇప్పటికే పరిశ్రమలో బాగా వినిపిస్తోంది.
బాలీవుడ్ నటుడు సంజయ్‌కపూర్ తనయ కావడం అందుకు మొదటి కారణమైతే...
రెండోది... సామాజిక మాధ్యమాల్లో లేటెస్ట్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ... సరికొత్త లుక్స్‌తో అలరించడం.
ఫ్యాషన్ ఐకాన్‌గా లక్షల మంది అభిమానులను సంపాదించుకున్న షనయా... ఓ భారీ బడ్జెట్ చిత్రంతో వెండి తెరకు నయా మెరుపులు అద్దడానికి సిద్ధమవుతోంది.

ష'నయా' అవతార్

షనయా కపూర్ సినీ నేపథ్యం చాంతాడంత ఉంటుంది. ఆమె తండ్రి సంజయ్ కపూర్ ఒకప్పటి బాలీవుడ్ హీరో, నిర్మాత. తల్లి మహీప్ సంధూ నటి. ఇక అనిల్ కపూర్, బోనీ కపూర్, అర్జున్, సోనమ్, జాన్వీ, ఖుషీ, రియా... షనయా కుటుంబంలో దాదాపు అందరూ పరిశ్రమలో భాగమైనవాళ్లే. అందుకే తన మనసులో కూడా సినిమా



తప్ప మరో ఆలోచన రాలేదంటుంది షనయా.

"నేను నటిని అవుతా"నని మా అమ్మానాన్నకు చెప్పని రోజంటూ లేదు. చిన్నప్పటి నుంచీ నటన మినహా మరొక వృత్తిని నేను ఊహించుకోలేదు. అంత మక్కువ నాకు. ఇంట్లో డిన్నర్ టేబుల్ దగ్గర సినిమా ముచ్చట్లు వింటూ పెరిగాను. నా జీవితమంతా సినీ వ్యక్తుల చుట్టూనే తిరుగుతోంది. ఈ వాతావరణమే నాపై బలమైన ప్రభావం చూపింది. నటన తరువాత నాకు బాగా ఇష్టమైంది నాట్యం. నన్ను నేను తెలుసుకోవడానికి, నాలోని భావాలను వ్యక్తం చేయడానికి నాట్యం ఒక అద్భుతమైన సాధనం" అంటున్న షనయా... మంచి డ్యాన్సర్ కూడా.

'షూటింగ్‌లు లేని రోజుల్లో పొద్దున్నే లేచి నాట్య తరగతులకు వెళతాను. డ్యాన్స్ చేస్తుంటే నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయినట్టు అనిపిస్తుంది. కొన్ని కారణాల వల్ల రెండేళ్ల కిందట ఆపేసిన కథక్ అభ్యాసం మళ్లీ మొదలుపెట్టాను. 'పాకీజా, ఉమ్రావ్ జాన్' తదితర చిత్రాల్లోని పాటలు పెట్టుకొని డ్యాన్స్ చేస్తుంటాను. బెల్లీ డ్యాన్స్‌ను ఒక కళా రూపంగా అధ్యయనం చేస్తున్నా. వీటివల్ల భిన్న సంస్కృతుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు కలుగుతుంది. అలాగే కత్రినా డ్యాన్స్ నాకు ఎంతో ఇష్టం. ప్రస్తుతం ఆమె పాటలన్నిటినీ చూసే పనిలో ఉన్నా' అంటుంది షనయా.

అసిస్టెంట్ డైరెక్టర్‌గా...

ముంబయి 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... డిగ్రీ అనంతరం నటనలో మెలకువలు నేర్చుకోవడానికి తరచూ వర్క్‌షాప్‌లకు వెళ్లేది. నెట్‌ఫ్లిక్స్‌లో 'ది రియల్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్' ద్వారా తొలిసారి తెరపై కనిపించింది. 2019లో శ్రీదేవి కూతురు, తన కజిన్ జాన్వీ కపూర్ నటించిన 'గుంజన్ సక్సేనా' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన సినీ ప్రయాణం ప్రారంభించింది షనయా. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయడంవల్ల చిత్ర నిర్మాణంలోని లోతుపాతులు తెలుసుకోగలిగానని, నటిగా కెరీర్ ప్రారంభించడానికి అది ఒక పునాది రాయిలా ఉపయోగపడిందని అంటుంది ఈ ముద్దుగుమ్మ.

ఆ ఒత్తిడి లేదు...

కపూర్ లాంటి ప్రముఖ సినీ కుటుంబం నుంచి ఎవరైనా పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారంటే... వారిపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. 'అది వాస్తవమే అయినా... నేను భిన్నమైన వ్యక్తిని. ఎందుకంటే నా చుట్టూ ఉన్నవారంతా ఎప్పుడూ సినిమాల గురించే మాట్లాడుతుంటారు. మా ఇంట్లో నిర్మాతలు, దర్శకులు, నటులున్నారు. స్టైలిస్టులు కూడా ఉన్నారు. మా ఇంట్లోవాళ్ల జీవితాలే పరిశ్రమతో ముడిపడి సాగుతున్నాయి. కానీ ఏ రోజూ నా కెరీర్‌ను ఎవరూ శాసించలేదు. నాకు నచ్చిన మార్గంలో నడిచే స్వేచ్ఛ నాకు ఇచ్చారు. అలాంటప్పుడు కొత్తగా నాపై ఒత్తిడి ఏముంటుంది? కాకపోతే వారి స్థాయిలో నన్ను ఊహించుకొని... అంచనాలు పెంచుకొంటారు. అరంగేట్రంలోనే అమాంతం ఆ అంచనాలను అందుకోవడం నాకే కాదు... ఎవరికీ సాధ్యం కాదు కదా' అంటూ చెప్పుకొచ్చింది షనయా.

బడా ప్రాజెక్ట్‌లు...

ప్రస్తుతం మళయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ భారీ బడ్జెట్ చిత్రం 'వృషభ'లో నటిస్తోంది షనయా కపూర్. మోహన్‌లాల్‌తో కలిసి పని చేయడం తనకు లభించిన ఒక అద్భుత అవకాశం అంటోంది. "వృషభ' సెట్‌లో మొదటిసారి అడుగుపెట్టినప్పుడు ఎంతో ఉత్సుకతకు లోనయ్యాను. అది కూడా నా తొలి షాట్ మోహన్‌లాల్ సర్‌తో. కెమెరా నా ముఖం మీదకు వచ్చి ఆగినప్పుడు... నాలో ఏవో తెలియని అనుభూతులు. ఇది కలా... నిజమా..! నన్ను నేను నమ్మలేకపోయాను. ఆ క్షణం ఒక్కటే అనుకున్నా... నాలోని భావోద్వేగాలన్నిటినీ కెమెరా ముందు పలికించడానికి నాకు లభించిన చక్కని అవకాశం ఇదని. ఇలాంటి అవకాశం కోటిలో ఒక్కరికే లభిస్తుంది. దాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరుకున్నా. సెట్‌లో మోహన్‌లాల్ సర్ ప్రతి కదలికనూ నిశితంగా గమనించాను. ఆయనలోని ప్రకాశం, ఉత్సాహం, అంకితభావం నాలో స్ఫూర్తి రగిలించాయి" అంటున్న ఈ అందాల రాశి... బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ కరణ్ జోహార్ ప్రాజెక్ట్‌లోనూ నటిస్తోంది.

'నా పనితనం చెప్పాలి'...

కపూర్‌ల కుటుంబం నుంచి వచ్చినా... పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే గొప్ప ప్రతిభ ఉండాలంటోంది షనయా కపూర్. 'నా గురించి... నా వ్యక్తిత్వం గురించి, నా సామర్థ్యం గురించి నేను కాదు... నేను చేసే పని చెప్పాలి. ఇష్టపడి కష్టపడతాను. దాన్ని ఒక పనిలా చూడను' అని చెబుతున్న షనయా... స్టార్ హీరో రణ్‌వీర్‌సింగ్‌కు వీరాభిమాని. అతడి పక్కన నటించే అవకాశం వస్తే ఎగిరి గంతేస్తానంటోంది.



అలాగే బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్ కూతురు సుహానా ఖాన్, నటుడు చంకీ పాండే తనయ అనన్యా పాండేతో కూడా కలిసి తెర పంచుకోవాలని కోరుకొంటోంది. వీరిద్దరూ షనయాకు మంచి స్నేహితులు.

రాత్రుళ్లు రచ్చ...

సాధారణంగా ఉదయం లేచి వ్యాయామాలూ అవీ చేయడం తారలకు అలవాటు. కానీ వారికి భిన్నం షనయా. 'ఇంట్లోని అందరి గదుల్లో లైట్లు ఆఫ్ చేసే సమయంలో నాదైన ప్రపంచం మేల్కొంటుంది. చిరుతిండ్లు తింటూ... ఏదో ఒక సినిమా చూస్తుంటాను. చూసిన సినిమాలే లెక్కలేనన్నిసార్లు చూస్తుంటాను... ముఖ్యంగా కొన్ని సన్నివేశాలు. ఎక్కువగా హిందీ, ఇంగ్లీష్ చిత్రాలు చూస్తా. అప్పుడప్పుడూ కొరియన్ కూడా' అంటున్న షనయా కపూర్‌కు బాగా నచ్చిన చిత్రం 'దేవ్‌దాస్'.



ప్రభుత్వ కొలువు సాధించాలని ఎంతోమంది కలలు కంటారు. కానీ ఈమె... అందుకు భిన్నం. అమ్మానాన్న లేని చిన్నారులకు మాతృ ప్రేమ పంచడం కోసం గ్రూప్-1 ఉద్యోగాన్ని సైతం వదిలేశారు. అభాగ్యుల సేవకు పూర్తిగా అంకితమయ్యారు. అంతేకాదు... సేంద్రియ వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ లాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకూ నాంది పలికారు. నిస్వార్థంతో సమాజం కోసం పాటుపడుతున్న పార్వతీపురం 'జట్టు ఆశ్రమం' నిర్వాహకురాలు **వెనిగండ్ల పద్మజ** 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

ఉద్యోగం విడిచిపెట్టి... ఆదర్శంతో 'జట్టు' కట్టి..!

"పార్వతీపురంలోని జట్టు ఆశ్రమాన్ని ఇదే ప్రాంతంలో పని చేసే ప్రభుత్వ ఉపాధ్యాయుడు పారినాయుడు గారు పాతికేళ్ల కిందట ప్రారంభించారు. గిరిజన, ఆదివాసీ అనాథ పిల్లల కోసం ఆయన దీన్ని నెలకొల్పినా, తరువాత కాలంలో ఏ దిక్కూ లేని మైదాన ప్రాంత చిన్నారులను కూడా అక్కున చేర్చుకున్నాం. ఈ ఆశ్రమంతో నా పరిచయం చాలా ప్రత్యేకమైంది. వ్యవసాయ రీత్యా కర్ణాటకలో స్థిరపడిన కుటుంబం మాది. అయితే నేను ప్రకాశం జిల్లా ఒమ్మెవరంలోని మా అమ్మమ్మగారింట పెరిగాను. లియో టాల్‌స్టాయ్, మాగ్జిమ్ గోర్కీ, చెహోవ్ తదితర రష్యన్ రచయితల తెలుగు అనువాదాలను పాఠశాల రోజుల నుంచి బాగా చదివేదాన్ని. బహుశా అందుకేనేమో... నేను పుస్తకాల్లో చదివినట్టుగా ఈ సమాజం లేదని నాలో అంతర్మథనం మొదలైంది. పేదరికం, ఆకలి బాధలు, అవి తెచ్చిపెట్టే కష్టాలను ఇతరుల జీవితాల్లో చూస్తున్నప్పుడు నేనేమీ చేయలేకపోతున్నానన్న బెంగ నన్ను బాగా వేధించేది. అప్పుడే అనుకున్నాను... పెళ్లి, పిల్లలు, ఉద్యోగం లాంటి లక్ష్యాలు కాకుండా నా జీవితాన్ని సమాజంతో మమేకం చేసుకొని బతకాలని! ఆలోగా ఈ వ్యవస్థను కొంత అర్థం చేసుకోవడం అవసరమనుకున్నాను.

కొలువు కాదనుకొని...

పోటీ పరీక్షలు రాసి మొదట కర్ణాటక స్టేట్ గ్రూప్-1కు ఎంపికయ్యాను. తెలుగు మీద ఇష్టంతో అక్కడ చేరకుండా ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 రాస్తే ఇక్కడ ఎంపీడీవోగా ఉద్యోగం వచ్చింది. తర్వాత జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిగానూ నియమించారు. కానీ అవేవీ నాకు సంతృప్తినివ్వలేదు. కాలేజీ రోజుల నుంచి నాకు గిరిజన ప్రాంతాల్లో పని చేయాలని ఉండేది.

వాస్తవానికి గిరిజన సంక్షేమ శాఖలో ఉద్యోగం వస్తుందనుకున్నాను. కానీ అది జరగలేదు. అయితే పార్వతీపురంలోని నా స్నేహితురాలి ద్వారా ఈ ప్రాంతానికి అప్పుడప్పుడూ వస్తుండేదాన్ని. ఇక్కడి పరిస్థితుల మీదా కొంత అవగాహన ఉంది. తర్వాత నా ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఐఏఎస్ అధికారులు కరికాలవలవన్, సెర్ప్ సీఈఓ విజయ్‌కుమార్ ద్వారా 'జట్టు ఆశ్రమం' గురించి తెలిసింది. అలా 2004లో ఈ ఆశ్రమానికి మొట్టమొదటిసారి వచ్చాను. ఆ వాతావరణం నన్ను కట్టిపడేసింది. అప్పుడే అనుకున్నాను... నా జీవితమంతా ఇక్కడే గడపాలని.

ఆశ్రమం కోసం...

ప్రభుత్వ ఉద్యోగంలో రాజకీయ ఒత్తిళ్లు ఎదురవ్వడం సాధారణమే. కానీ అలాంటివాటికి భయపడేంత బలహీనురాలిని కాదు. నా జీవితం పట్ల నాకు ఒక స్పష్టత ఉంది. నాకంటూ ఒక లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకున్నాను కనుక... 2007లో ఉద్యోగానికి రాజీనామా చేసి, జట్టు ఆశ్రమ సేవకు పూర్తిగా అంకితమయ్యాను. 'ఉద్యోగం చేస్తూనే సమాజానికి సేవ చేయచ్చు కదా' అని మొదట మా అమ్మ లలిత నాకు నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించింది. మా నాన్న భీమేశ్వరరావు మాత్రం మౌనంగా ఉన్నారు. అయితే ఉద్యోగ హోదా కన్నా ఆశ్రమంలోని పిల్లలకు తల్లిగా ఉండటమే నాకిష్టమని ఇంట్లో చెప్పాను. దాంతో వారెవరూ కాదనలేకపోయారు. ఆ నాటి నుంచి నా పిల్లలతో



కలిసుంటున్నాను.

పెళ్లిళ్లు... పురుళ్లు...

ఈ పదిహేనేళ్లలో 150మందికి పైగా పిల్లలు ఆశ్రయం పొందారు. వారిలో కొందరు వివిధ ఉద్యోగ, వ్యాపార వృత్తుల్లో స్థిరపడ్డారు. కొందరికి పెళ్లిళ్లు మేమే దగ్గరుండి చేశాం. తర్వాత పురుళ్లు లాంటి బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నాం. ఆ పిల్లలకు జట్టు ఆశ్రమమే పుట్టిల్లు. నా పిల్లలు ఒక్కొక్కరు పీహెచ్‌డీ, పీజీ, లా, ఇంజనీరింగ్ లతో పాటు డాన్స్, యోగా తదితర కోర్సుల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారందరి చదువుకు అవసరమైన ఖర్చుతోపాటు విగతా బాధ్యతలను పూర్తిగా ఆశ్రమమే చూసుకొంటోంది.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇల్లు...

పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ఒక ప్రహసనంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చేయడం చూసి, దానివల్ల తలెత్తే నష్టాలను గుర్తించాం. ప్రయోగాత్మకంగా మొదట ఎనిమిది గ్రామాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ప్రారంభించాం. 'పునర్వ వేస్ట్ మేనేజ్‌మెంట్' పేరుతో ఒక యూనిట్‌ను నిర్మించాం. దాని కేంద్రంగా తడి చెత్తతో గ్యాస్, సేంద్రియ ఎరువు, టాయిలెట్ క్లీనర్ లాంటివి తయారు చేయడం మొదలుపెట్టాం. తరువాత తడి చెత్త తెచ్చి ఇచ్చినవారికి వాటికి బదులుగా సేంద్రియ ఎరువులు, విత్తనాలను ఇవ్వడం ద్వారా వాటి విలువను తెలియజేయగలిగాం. ఎలక్ట్రానిక్స్‌తో పాటు కుక్కర్ హ్యాండిల్స్ లాంటి పొడి వ్యర్థాలతో కుండీలు, ఇటుకలు లాంటివి తయారు చేయగలిగాం. ఇంటి నిర్మాణానికి పనికొచ్చే ఫ్లోర్ ఫిల్లింగ్ మెటీరియల్‌ను రూపొందించాం. అలా ఒక ఇల్లు కూడా నిర్మించాం. ఇంకా రకరకాల ప్రయోగాలు చేస్తున్నాం. తడి, పొడి చెత్త నుంచి పలు ఉత్పత్తులను తయారుచేయడం ద్వారా కాలుష్యాన్ని కొంత వరకు తగ్గించవచ్చు. వనరులను పొదుపుగా వాడుకోవచ్చు. త్వరలోనే పూర్తి స్థాయిలో వ్యర్థాల నిర్వహణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

పిల్లలే నిర్వాహకులు...

జట్టు ఆశ్రమానికి నేను కాదు, మా పిల్లలే నిర్వాహకులు. ధాన్యం, పప్పు దినుసులు, కూరగాయలు... ఇలా ఆశ్రమానికి అవసరమైన ఆహారమంతా మేమంతా కలిసి పండిస్తాం. అదీ సేంద్రియ పద్ధతిలో. ఈ స్ఫూర్తితో పార్వతీపురం పరిసర పల్లెల్లోని చాలామంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తుండటం మంచి పరిణామం. మా ఆశ్రమంలోని పిల్లలంతా నన్ను 'అమ్మ' అని పిలుస్తారు. నా కడుపున పుట్టకపోయినా వారంతా నాకు బిడ్డలు. ఆ పిల్లలు తప్ప నాకూ మరెవరూ లేరు.

మొదటగా మా పిల్లల్లో తమకు ఎవరూ లేరన్న భావనను పోగొట్టేందుకు సమష్టి జీవన విధానాన్ని అలవరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. అంటే ప్రతి పనీ ఒక జట్టుగా చేయడమన్నమాట. తద్వారా 'అమ్మానాన్న ప్రేమను మనం పొందలేకపోవచ్చు కానీ, ఇతరులకు పంచవచ్చు' అన్న స్పృహను వారిలో కల్పించగలిగాం. ఆశ్రమం అనగానే కట్టుకోడానికి దుస్తులు ఇచ్చి, మూడు పూటలా తిండి పెట్టడంతో సరిపుచ్చడం కాదు కదా. వారి సమగ్రాభివృద్ధికి తోడ్పడేలా చదువుతో పాటు కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, కర్ర సాము, కత్తి సాము లాంటి కళలతో పాటు హాకీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లోనూ తర్ఫీదు ఇప్పిస్తున్నాం. అందుకే మా పిల్లలు కూడా చాలా వాస్తవికంగా ఉంటారు. సాటి మనుషుల పట్ల ప్రేమతో, సమాజం పట్ల గౌరవంతో మసులుకుంటారు.

అమ్మ పచ్చళ్లు...

కొన్నాళ్ల కిందట 'అమ్మ పచ్చళ్లు' తయారీ కేంద్రాన్ని ప్రారంభించాం. ఆశ్రమ అమ్మాయిలు గౌతమి, అమల దీన్ని నిర్వహిస్తున్నారు. మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. పచ్చళ్లు అంటే మార్కెట్లో దొరికే వస్తువులతో తయారు చేసి, అవి నిల్వ ఉండటం కోసం రసాయనాలు కలిపి, వాటిని డబ్బాల్లో పెట్టి అమ్మడం కాదు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో మేము పండించిన వాటితోనే రకరకాల కారప్పొడులు, మామిడి, అల్లం, ఉసిరి, టమోటా, పండుమిర్చి పచ్చళ్లు, వడియాలు లాంటివన్నీ తయారు చేస్తాం. వాటిల్లో రంగులు కానీ రసాయనాలు కానీ అస్సలు కలపం. ప్లాస్టిక్ ప్యాకింగ్‌కు మేము వ్యతిరేకం కనుక సీసాల్లోనే అమ్ముతాం. ఒక్క పార్వతీపురంలోనే కాదు అమ్మ పచ్చళ్ల కోసం విశాఖపట్టణం, విజయనగరం, గజపతినగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వచ్చి కొనుక్కెళుతుంటారు. చాలామంది విదేశాల్లోని పిల్లలకు పంపిస్తుంటారు. తిన్నవారంతా అమ్మ పచ్చళ్లు, పొడులు రుచి చాలా బావుంటుందని చెబుతుంటారు.

రజనీరాజా కళాక్షేత్రం...

పిల్లల మనోవికాసానికి కళలు తోడ్పడతాయి. గ్రామీణ విద్యార్థులకు అవి నేర్పించేందుకు ఎవరు ముందుకు వస్తారా అని ఎదురుచూస్తున్నాం. అదే సమయంలో నాట్యాచార్యులు నాగకన్యక, శ్రీనివాస్ దంపతులు ఒకరోజు మా ఆశ్రమానికి వచ్చారు. వారికి ఇక్కడి వాతావరణం బాగా నచ్చింది. దాంతో ఆశ్రమంలోని పిల్లలతో పాటు పార్వతీపురం చుట్టుపక్కల గ్రామాల చిన్నారులకు నృత్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించారు. అలా ఆ దంపతులు పదేళ్లుగా 'రజనీ రాజా' కళాక్షేత్రం ద్వారా విద్యార్థులకు భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నారు. గాయని పద్మప్రియ కర్ణాటక సంగీతం ఉచితంగా నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు మా కళాక్షేత్రంలో 1,200 మందికిపైగా విద్యార్థులు శిక్షణ పొందారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గృహిణులు సైతం చాలామంది సంగీత వాయిద్యాలు నేర్చుకోడానికి వస్తుంటారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో చాలామంది బయట ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిస్తున్నారు. తొలినాళ్లలో నేర్చుకున్నవారిలో కొందరు ఇక్కడే గురువులుగా కొనసాగుతున్నారు.

ప్రకృతికి దగ్గరగా...

జట్టు ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నా... సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా... వ్యర్థాల నిర్వహణను చేపట్టినా... ఇదంతా సమష్టి కృషి. ఇందులో పార్వతీపురం చుట్టుపక్కల గ్రామస్తుల సహకారం వెలకట్టలేనిది. వారివల్లే ఆశ్రమం సజావుగా ముందుకు సాగుతోంది. ఆశ్రమం ద్వారా పదిమందికి తోడ్పడుతూ హాయిగా ప్రకృతికి దగ్గరగా సాధారణ జీవితం గడపాలన్నది నా కోరిక. అంతకుమించిన లక్ష్యాలు ఏమీ లేవు."

• సాంత్వన్

ఈ పండ్లలో విటమిన్-సి పుష్కలం

శరీరానికి సి- విటమిన్ ఎంతో అవసరం. కణాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తెల్లరక్తకణాల సంఖ్యను పెంచి.. వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే గుణం సి-విటమిన్‌కు ఉంది. ఇంతకీ ఏయే పండ్లలో సి- విటమిన్ ఎక్కువ దొరుకుతుందో తెల్సుకుందాం.

- వంద గ్రాముల నారింజలో 53 మిల్లీ గ్రాముల సి-విటమిన్ ఉంటుంది. గుప్పెడు నల్ల ద్రాక్ష తింటే 181 మి.గ్రా సి-విటమిన్ లభ్యమవుతుంది. అంటే నారింజ పండ్లకంటే మూడు రెట్లు ఎక్కువ.
- కివి పండ్లలో మినరల్స్, ఫైబర్ కంటెంట్ ఎక్కువ. వంద గ్రాముల కివి పండ్లలో 93 మి.గ్రా. విటమిన్- సి దొరుకుతుంది. స్ట్రాబెర్రీస్‌లో అధికంగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. కనీసం వంద గ్రాముల స్ట్రాబెర్రీలను తింటే 58 గ్రాముల సి-విటమిన్ శరీరానికి అందుతుంది.
- బరువు తగ్గటానికి, జీర్ణక్రియ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే బొప్పాయి పండ్లను ఐదారు ముక్కలు తింటే చాలు.. అందులో 60 మి.గ్రా. విటమిన్-సి దొరుకుతుంది.
- వంద గ్రాముల పైనాపిల్ తింటే 47 మి.గ్రా. సి- విటమిన్ ఉంటుంది. చిన్న జామకాయ తింటే 228 గ్రాముల అత్యధిక విటమిన్-సి అందుతుంది.



కౌన్సెలింగ్

కాలేయానికి కొవ్వు ప్రమాదమా?

డాక్టర్! నాకు రెండవ దశ ఫ్యాటీ లివర్ సమస్య ఉంది. మద్యం అలవాటు లేకపోయినా నాకు ఈ సమస్య ఎందుకొచ్చింది? దీన్నుంచి పూర్తిగా కోలుకోవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరుడు, హైదరాబాద్.

ఫ్యాటీ లివర్ గురించి సర్వత్రా రెండు అపోహలున్నాయి. మద్యం తాగే వాళ్లకే ఫ్యాటీ లివర్ పరిమితం అనేది ఒక అపోహ అయితే, ఇది కాలేయాన్ని దెబ్బ తీసేంత ప్రమాదకరమైనది కాదనేది రెండవ అపోహ. కానీ ఫ్యాటీ లివర్ గురించిన వాస్తవాలు పూర్తి భిన్నం. 60 శాతానికి మించిన కాలేయ సమస్యల కారణాలకు మద్యంతో సంబంధం ఉండదు. ఏ కారణంతో కాలేయం దెబ్బతిన్నా, తొలి దశలోనే సమస్యను కనిపెట్టగలిగితే, కాలేయాన్ని పూర్తిగా కోలుకునేలా చేయవచ్చు. అలా కాకుండా కాలేయం తిరిగి సరిదిద్దలేనంతగా దెబ్బతింటే, అంతిమంగా కాలేయ మార్పిడినే ఆశ్రయించవలసి వస్తుంది.

కాలేయానికి కొవ్వు ఎందుకు?

మద్యంతో పాటు, హెపటైటిస్ సి, హెపటైటిస్ బి, జన్యు సమస్యలు, కొవ్వు, దీర్ఘకాలంగా అదుపుతప్పిన మధుమేహం, ఒబేసిటీ... ఇలా కాలేయం దెబ్బ తినడానికి ఎన్నో కారణాలుంటాయి. తాజాగా కొవ్వు మూలంగా సిర్రోసిస్, కేన్సర్‌లకు దారి తీసి, అంతిమంగా మార్పిడి వరకూ వెళ్తున్న సందర్భాలు ఎక్కువవుతున్నాయి. సాధారణంగా కాలేయం మీద కొద్ది పరిమాణంలో కొవ్వు ఉంటుంది. ఈ కొవ్వు పరిమాణం పెరిగేకొద్దీ, కాలేయ కణాలు ఒత్తుకుపోయి, పాడైపోతాయి. ఈ పరిస్థితి లివర్ ఫైబ్రోసిస్‌కూ, సిర్రోసిస్‌కూ దారి తీస్తుంది.



ఏప్రిల్ 19 వరల్డ్ లివర్ డే

ఫైబ్రో స్కాన్

సాధారణ స్కాన్‌లో కాలేయం పైనున్న కొవ్వు తప్ప, అడుగున ఉన్న స్కార్స్ కనిపించవు. కాబట్టి అల్ట్రాసౌండ్ స్కాన్‌లో ఫ్యాటీ లివర్ ఉందని తేలితే, తప్పనిసరిగా ఫైబ్రో స్కాన్ కూడా చేయించుకోవాలి. ఈ స్కాన్ ద్వారా ఫైబ్రోసిస్ నాలుగు దశలు, సిర్రోసిస్ మొదటి దశతో పాటు, కాలేయంలో ఉన్న కొవ్వు పరిమాణాన్ని కూడా కనిపెట్టవచ్చు. అలాగే కాలేయం గట్టితనాన్ని కూడా అంచనా వేయవచ్చు. ఇలా ఫైబ్రో స్కాన్‌తో ముందుగానే సమస్యను కనిపెట్టగలిగితే ఫైబ్రోసిస్‌తో పాటు, మొదటి దశ సిర్రోసిస్‌ను కూడా రివర్స్ చేసుకోవచ్చు. క్రమం తప్పకుండా ఆల్కహాల్ తీసుకునేవాళ్లు, హెపటైటిస్ సి, బి ఇన్‌ఫెక్షన్స్ ఉన్నవాళ్లు, ఫ్యాటీ లివర్ నిర్ధారణ అయిన వాళ్లు, ఏడాదికోసారి ఫైబ్రో స్కాన్ చేయించుకుంటూ ఉండాలి. అలాగే స్థూలకాయులు, ఐదేళ్లుగా మధుమేహం అదుపు తప్పిన వాళ్లు కూడా ఏడాదికోసారి ఫైబ్రో స్కాన్ చేయించుకోవాలి. స్కాన్‌లో సమస్య తీవ్రతను కనిపెట్టినప్పుడు, మూల కారణాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలితో సమస్యను పూర్తిగా నయం చేసుకోవచ్చు. ఫ్యాటీ లివర్ రాకుండా ఉండడం కోసం సమతులాహారం తీసుకోవాలి.
అదనపు నూనెలు, పిండిపదార్థాలు తగ్గించుకోవాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. 45 నిమిషాల నడక, సైక్లింగ్, ఈత క్రమం తప్పకుండా కొనసాగించాలి.

డాక్టర్ కె.ఎస్. సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్, గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KZkX1bsలో చదవండి.

పిల్లలను తీర్చిదిద్దాలంటే ఆ పనిని పేరెంట్స్ మాత్రమే చేయగలరు. పేరెంట్స్ చెప్పిన మాటలకు ఎమోషనల్‌గా కనెక్టవుతారు. పిల్లల మైండ్‌సెట్ మార్చాలంటే ఉదయాన్నే మాట్లాడాలి ఇలా..



ఉదయాన్నే ఉత్సాహం...

- పిల్లలు నిద్రలేచిన వెంటనే వారికి 'గుడ్ మార్నింగ్' చెప్పాలి. నవ్వుతో, హగ్‌తో పిల్లలను దగ్గరకు తీసుకుంటే వారిలో పాజిటివ్‌నెస్ పెరుగుతుంది.
- చైల్డ్‌తో ఎక్కువ మాటలు కలపడం, ఆడుకోవటం చేయాలి. ఉదయాన పిల్లలతో తక్కువ సమయం గడిపినా అది క్వాలిటీ టైమ్ అవుతుంది. దీనివల్ల పిల్లల్లో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది.
- స్కూల్‌లో చదివే పిల్లలతో అయితే మీ ఆలోచనలను, కలల్ని షేర్ చేయండి. వారితో కమ్యూనికేట్ అవటం వల్ల తెలీకుండా చురుగ్గా ఉంటారు.
- వారి స్నేహితుల గురించి అడగటం.. వారి సమాధానాలను, ఆలోచనలు వినటం చేయాలి. దీని వల్ల గ్రేట్‌గా ఫీలవుతారు. ప్రతి రోజూ కాకున్నా కనీసం వారానికి ఓసారి అయినా పిల్లలతో ఉదయం పూట గడిపితే చాలు.. చక్కని ఫలితం ఉంటుంది.

సడలుతున్న నక్సల్స్ పట్టు!

దండకారణ్యంలో వరుస దెబ్బలు.. 80 వేల బలగాలతో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్



మృతులు లలిత, మాధవి, జుగ్ని, సుఖ్‌లాల్, శంకర్‌రావు, శ్రీకాంత్, రూపీ మేద్కి., రాంశీలా, రజిత; (కింది వరుసల్లో ఉన్న వారి వివరాలు తెలియరాలేదు)



- అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకెళ్లిన బలగాలు
- ప్రతి 5 కిలోమీటర్లకొక పోలీసు క్యాంపు
- సాంకేతికతతో అడుగడుగునా గాలింపు
- మూడు నెలల్లో 79మంది నక్సల్స్ మృతి

చర్ల, ఏప్రిల్ 17: దండకారణ్యంపై మావోయిస్టులు పట్టు కోల్పోతున్నారా? ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని నల్లమల నుంచి.. నేపాల్ వరకు రెడ్‌కారిడార్‌ను ఏర్పాటు చేసుకున్న నక్సల్స్ ఇప్పుడు సేఫ్‌జోన్లు లేక సతమతమవుతున్నారా? కొవిడ్ కల్లోలం తర్వాత మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు ఔననే సమాధానం చెబుతున్నాయి. కరోనా వైరస్ బారిన పడి అప్పట్లో పలువురు అగ్రనాయకులు కన్నుమూయగా.. రెండేళ్లుగా పోలీసులు ఉధృతం చేస్తున్న ఆపరేషన్లతో నక్సల్స్‌కు భారీఎత్తున ఎదురు దెబ్బలు తగులుతున్నాయి.

అడవుల్లో 80 వేల పోలీసు బలగాలు

ఒకప్పుడు పీపుల్స్ వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ)గా ఉన్న నక్సలైట్లు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంతో చర్చల సందర్భంగా.. 2004 సెప్టెంబరు 21న తాము మావో సిద్ధాంతాలను అనుసరిస్తామని, ఇకపైన తమ గ్రూప్ పేరు మావోయిస్టు పార్టీ అని ప్రకటించుకున్నారు. ఆ చర్చలు విఫలమవ్వడం.. దండకారణ్యంలో మావోయిస్టుల ప్రాబల్యం మరింత ఉధృతమవ్వడంతో.. అప్పటి యూపీఏ సర్కారు 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ప్రారంభించింది. హింస-ప్రతిహింసలతో దండకారణ్యం దద్దరిల్లింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, ఛత్తీస్‌గఢ్ అగ్రనాయకులు చాలా మంది ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. 2020 మార్చిలో దేశంలోకి కొవిడ్ ప్రవేశించిన తర్వాత.. మావోయిస్టులు వైరస్‌తో అతలాకుతలమయ్యారు. పెద్ద సంఖ్యలో నాయకులు, క్యాడర్‌ను కోల్పోయారు. ఆ తర్వాత పీఎల్‌జీ నేత మాడ్వీ హిడ్మా లాంటి మావోయిస్టు నేతల వ్యూహాల్లో సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందినా.. పోలీసు క్యాంపులపై రాకెట్ దాడులకు దిగినా.. క్రమంగా పోలీసులు పైచేయి సాధిస్తూ వస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గడిచిన మూడు నెలల్లో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొనే సిబ్బంది సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఒక్క బస్తర్ రీజియన్‌లోనే 80 వేల మంది డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ జవాన్లు నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటున్నట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దులో ఉండే మావోయిస్టుల కంచుకోట పూవర్తి, తెర్లం కాగా.. అక్కడి నుంచి సుమారు 300-400 కిలోమీటర్ల దూరంలో ఉన్న అబూజ్‌మడ్ అడవుల వరకు కూడా పోలీసులు క్రమంగా క్యాంపులను విస్తరించారు. అడవుల్లో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులు ఏర్పాటయ్యాయి. ఒక్కో క్యాంపులో 2 వేల నుంచి 5 వేల వరకు బలగాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. మూడున్నర నెలలుగా ఎన్‌కౌంటర్లు పెరిగాయి. 79 మంది మావోయిస్టులు మృతిచెందారు. గడిచిన నెలరోజుల్లోనే ఈ సంఖ్య 54గా ఉంది. 125 మంది మావోయిస్టుల అరెస్టవ్వగా.. 150 మంది నక్సల్స్ లొంగిపోయారు. ఈ గణాంకాలను బట్టి.. కొవిడ్ కల్లోలం నుంచి మంగళవారం నాటి ఎన్‌కౌంటర్ వరకు మావోయిస్టు పార్టీ భారీ ఎదురు దెబ్బలను చవిచూసిందని స్పష్టమవుతోంది.

గుర్తించిన మృతులు వీరే

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన 29 మంది నక్సల్స్‌లో 15 మంది మహిళలున్నారు. మృతుల్లో పలువురిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు గుర్తించారు. వీరిలో శంకర్‌రావుతోపాటు.. ప్రతాప్‌పూర్ ఏరియా కమిటీ ఇన్‌చార్జి, జనతన్ సర్కార్ కో-ఆర్డినేటర్ లలిత, ప్రతాప్‌పూర్ సభ్యులు జుగ్ని అలియాస్ మాల్తి, శుక్లాల్, నార్త్‌బస్తర్ డివిజన్‌కు చెందిన మాధవి, రామశిల, రంజిత, ప్లాంగ్ ఎల్‌వోఎస్ కమాండర్ రూపి, వినోద్‌బాడ్డే, రాజు ఉన్నారు. శంకర్‌రావు భార్య సుమన కూడా మృతిచెందినట్లు భావిస్తున్నామని, ఇంకా నిర్ధారించాల్సి ఉందని పోలీసులు చెప్పారు. మిగతా మృతులను గుర్తిస్తున్నామన్నారు.

దెబ్బ కొడుతున్న టెక్నాలజీ

ఓ దశలో మావోయిస్టులు సైతం టెక్నాలజీ వైపు మళ్లినా.. భద్రత బలగాలు మాత్రం ఈ విషయంలో చాలా ముందంజలో ఉన్నాయి. తమ క్యాంపుల నుంచి ప్రతిరోజూ నిర్ణీత సమయంలో డ్రోన్ కెమెరాలతో పరిసర అడవులను జల్లెడ పడుతున్నాయి. ఎక్కడికక్కడ మావోయిస్టుల సెల్‌టవర్‌ను లొకేట్ చేసే టెక్నాలజీని పోలీసులు వినియోగిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేశారు. బలగాలు పెరగడంతో కూంబింగ్ ముమ్మరం చేశారు. ఒకప్పుడు ఇంటెలిజెన్స్ కోసం తెలంగాణ గ్రేహౌండ్స్, ఎస్ఐబీపై ఆధారపడే ఛత్తీస్‌గఢ్ పోలీసులు.. ఇప్పుడు సొంతంగా పక్కా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారనడానికి మంగళవారం నాటి అబూజ్‌మడ్ ఎన్‌కౌంటరే నిదర్శనం. ఛత్తీస్‌గఢ్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా రాష్ట్రాలతో ఉన్న సరిహద్దుల్లో భద్రత బలగాలు రేయింబవళ్లు నిఘా పెడుతున్నాయి. మావోయిస్టుల సమాచారం అందిందే తడవుగా.. ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి.

భద్రత బలగాలకూ సవాలే..!

ఛత్తీస్‌గఢ్‌లో అబూజ్‌మడ్ వరకు చొచ్చుకు వెళ్లిన భద్రత బలగాలకు ఇంకా సవాళ్లు మిగిలే ఉన్నాయని దండకారణ్యంపై పట్టున్న విశ్రాంత అధికారులు, అరెస్టయిన/లొంగిపోయిన మావోయిస్టులను విచారించిన దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. "అబూజ్‌మడ్ అడవుల విస్తీర్ణం చాలా ఎక్కువ. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు, ఇతర అగ్ర నాయకులు అక్కడే షెల్టర్ పొందుతున్నారని నిఘావర్గాలు విశ్వసిస్తున్నాయి. అక్కడి కొండ ప్రాంతాలు ప్రతికూలంగా ఉంటాయి. ఒక్కోచోట కొండ ఎక్కి దిగడానికి రెండు-మూడు రోజులు పడుతుంది. ఈ మధ్యలో వాటర్ పాయింట్లు(తాగునీరు లభించే ప్రదేశాలు) ఉండవు. ఎండాకాలం డీహైడ్రేషన్ సమస్య ఉంటుంది. మధ్యలో సొరకలు(గుహలు, బొరియల్లాంటివి) ఉంటాయి. అక్కడక్కడా 8-10 కుటుంబాలు మాత్రమే నివసించే గిరిజన గూడేలు ఉంటాయి. ఈ మార్గాల్లో మావోయిస్టులు బూబీట్రాప్‌లు, మందుపాతరలను పెట్టే ప్రమాదాలున్నాయి" అంటూ హెచ్చరించారు. అయితే.. వరుస ఎన్‌కౌంటర్లు, కీలక నేతల మృతి వంటి ఘటనలతో ఇతర నక్సల్స్ లొంగిపోయే ప్రయత్నాలు పెరిగే అవకాశాలున్నట్లు అభిప్రాయపడ్డారు.

29 మంది మృతుల్లో 15 మంది మహిళలే

అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని సందర్శించేందుకు పోలీసులు బుధవారం ఉదయం మీడియాకు అనుమతినిచ్చారు. "ఆ ప్రాంతంలో చెట్లకు కూడా తుపాకీ తూటా గుర్తులు కనిపించాయి. ఓ ప్రాంతంలో నెత్తుటి తివాచీ పరిచారా? అన్నట్లుగా రహదారిలో రాలిపోయిన వెదురు ఆకులపై మావోయిస్టుల నెత్తుటి మరకలు కనిపించాయి. చనిపోయిన మావోయిస్టుల కుటుంబ సభ్యులు వారి మృతదేహాల కోసం అడవుల్లో ఎదురుతెన్నులు కాయడం కనిపించింది. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన సుక్కూ అనే మావోయిస్టు సోదరుడు మాతో మాట్లాడారు. సుక్కూ బాలుడిగా ఉన్నప్పుడే నక్సల్స్‌లో చేరినట్లు చెప్పారు. వెనక్కి రావాలని వారించినా వినలేదని, చివరకు విగతజీవి అయ్యాడని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇక్కడి గూడేల్లోని ఆదివాసీలు బిక్కుబిక్కుమంటూ కనిపించారు. మీడియాతో మాట్లాడడానికి నిరాకరించారు" అని పీటీఐ వార్తాసంస్థ కాంకేర్ ప్రతినిధి తెలిపారు.

నక్సలిజాన్ని కూకటివేళ్లతో పెకలిస్తాం

- ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వచ్చాక ఆపరేషన్స్ వేగవంతం
- బలగాల క్యాంపులను 250కి పెంచాం: అమిత్‌షా

అహ్మదాబాద్, ఏప్రిల్ 17: దేశంలో మావోయిస్టులను కూకటివేళ్లతో పెకిలిస్తామని.. ఈ చర్య ఎంతో దూరంలో లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. నక్సలిజంతోపాటు.. టెర్రరిజాన్ని కూడా తుడిచిపెట్టేస్తామని మోదీ సర్కారు కంకణబద్ధమై ఉందన్నారు. బుధవారం ఆయన అహ్మదాబాద్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం నాటి అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. "కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు క్యాంపులను పెంచాం. 2019 నుంచి వీటి ఏర్పాటు ముమ్మరమైంది. ఛత్తీస్‌గఢ్ 250 క్యాంపులను ఏర్పాటు చేశాం. ఛత్తీస్‌గఢ్‌లో మా(బీజేపీ) ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎన్‌కౌంటర్లలో 80 మంది దాకా నక్సల్స్ మృతిచెందారు. 125 మంది అరెస్టయ్యారు. 150 మంది లొంగిపోయారు" అని ఆయన వివరించారు. తమ ప్రభుత్వ చర్యల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుతోందన్నారు.

గవర్నర్‌గా ఉన్నప్పుడు నా ఫోనూ ట్యాప్ చేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేసిన పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల ఫోన్లు ట్యాపింగ్‌కు పాల్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో నలుగురు పోలీసులు ఇప్పటికే అరెస్టు అయ్యారు. ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును విచారించాల్సి ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, కీలక నిందితులు పరారీలో ఉన్నారని దర్యాప్తు అధికారులు ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలో మాజీ గవర్నర్ తమిళిసై చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. కాగా తమిళిసై తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమెకు తగిన ప్రోటోకాల్ పాటించని విషయం తెలిసిందే.

ఆ 32 కోట్లు ఎవరివి?

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం. రూ.43.80 కోట్లలో అవసరమైన పత్రాలు చూపించి కేవలం రూ.11 కోట్లు మాత్రమే తీసుకెళ్లారు. రూ.32 కోట్ల కోసం ఎవరూ రాకపోవడంతో కేసులు నమోదు చేసి, కోర్టుకు సమర్పించినట్లు ఓ అధికారి తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడు రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లడం నిబంధనలకు విరుద్ధం. అంతకంటే ఎక్కువ నగదు తీసుకెళ్తుంటే సంబంధిత పత్రాలు చూపించాలి. లేనిపక్షంలో నగదును తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకొని జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తారు. అక్కడి నుంచి డబ్బును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెంటర్(డీజీసీ)కు పంపుతారు. తనిఖీ సమయంలో పత్రాలు చూపించలేని వారు అనంతరం డీజీసీలో వాటిని సమర్పించి నగదును తీసుకెళ్లవచ్చు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పట్టుబడిన నగదులో రూ.11 కోట్లను అలాగే తీసుకెళ్లారు. మరో రూ.32 కోట్ల కోసం ఎవరూ రాకపోవడంతో ఆ డబ్బు ఎన్నికల పంపిణీ కోసం తరలిస్తున్నదే అయి ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లధనం కావడం వల్లే సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లేందుకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.

ఇప్పుడు రూ.14.31 కోట్లు..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదలైంది. ఆ రోజు నుంచి నగరంలో తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటి వరకు రూ.14.31 కోట్ల నగదు, రూ.2.13 కోట్ల విలువైన వస్తువులు, 20441 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. 185 మందిపై కేసులు నమోదు చేసి 181 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. డీజీసీ నుంచి ఇప్పటి వరకు రూ.1.70 కోట్లు విడుదల చేశారు. మరో రూ.69 లక్షలు ఐటీ విభాగం పరిశీలనలో ఉన్నాయి.

నవ్య | చిత్రజ్యోతి

రాబిన్ హుడ్ రిలీజ్ డేట్



ఇంతవరకూ తను పోషించని పాత్రలో నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నితిన్ గెటప్ నుంచి క్యారెక్టరైజేషన్ వరకూ సరికొత్తగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదం కలిగిన ఈ సినిమాను డిసెంబర్ 20న విడుదల చేస్తున్నాం. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు మా సినిమాకు కలిసి వస్తాయనుకుంటున్నాం' అని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చుని ఉన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.

యుద్ధం... సన్నద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా స్పెషల్ అప్డేట్‌ను మేకర్స్ వదిలారు. త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'మీ ముందుకు... ధర్మంకోసం యుద్ధం త్వరలో' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



కొత్త కబుర్లు

బెల్లంకొండ హారర్ మిస్టరీ




శ్రీరామ నవమి సందర్భంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నిర్మించే కొత్త చిత్రాన్ని నిర్మాత సాహు గారపాటి ప్రకటించారు. 'భగవంత్ కేసరి' సంచలన విజయం తర్వాత ఆయన నిర్మించే ఈ హారర్, మిస్టరీ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. శ్రీరాముడు తన చేతిలోని విల్లుతో బాణాన్ని ఆకాశంలో ఉన్న రాక్షసుడికి ఎక్కుపెట్టడం , షాడో తోలుబొమ్మలాట, నిర్జనమైన అడవి, యాంటెన్నా టవర్, హార్నెట్... ఇవన్నీ ఆ పోస్టర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సహ రచయిత: దరహాస్ పాలకొల్లు, సంగీతం: బి.అజనీష్ లోకనాథ్, సమర్పణ: అర్చన, రచన, దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి.

సుందరకాండ సందడి



త్వరలోనే 'ప్రతినిధి 2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు నారా రోహిత్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం నుంచి స్పెషల్ అప్‌డేట్ వచ్చింది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం చేస్తూ, సంతోష్ చిన్నపొళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్న చిత్రానికి 'సుందరకాండ' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. అలాగే సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీరామనవమి సందర్భంగా 'సుందరకాండ' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. వృతి వాఘని ఈ చిత్రంలో కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయ కృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ప్రదీప్ ఎం. వర్మ

జర్నీ టూ అయోధ్య




రామాయణం ఆధారంగా టాలీవుడ్‌లో మరో భారీ చిత్రం రూపుదిద్దుకోనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, చిత్రాలయం బేనర్‌పై భారీస్థాయిలో నిర్మించేందుకు నిర్మాత వేణు దోనెపూడి సన్నాహాలు మొదలుపెట్టారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఆయన ఈ చిత్రాన్ని ప్రకటించారు. దర్శకుడు వి.ఎన్ ఆదిత్య కథను అందిస్తున్నారు. 'జర్నీ టూ అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయోధ్యప్రాంతంలో లోకేషన్ల అన్వేషణలో చిత్రబృందం పాల్గొంటోంది. తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల కాంబినేషన్‌లో వస్తున్న 'విశ్వం' సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలసి చిత్రాలయం స్టూడియోస్ నిర్మిస్తోంది.

రెండు యుగాల కథ



వైవిధ్యమైన కథలతో హీరోగా సక్సెస్‌లు అందుకొంటున్నారు తిరువీర్. ఆయన కథానాయకుడిగా నటించే తదుపరి చిత్రం ఖరారైంది. ఘంటా సతీశ్‌బాబు దర్శకత్వంలో రాధాకృష్ణ తేలు, రామకృష్ణారెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కార్తీక మురళీధరన్ కథానాయిక. త్రేతాయుగం, కలియుగం నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కుతోంది. అయ్యప్ప పి. శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ:రామిరెడ్డి

వీర ధీర శూరుడు



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే నటుడు విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 62వ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. తమిళంలో ఈ సినిమాకు 'వీర ధీర శూరన్' అనే పేరు నిర్ణయించారు. టైటిల్ టీజర్ విడుదల చేశారు. తెలుగు టైటిల్ త్వరలో ప్రకటిస్తారు. ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ పక్కా మాస్ పాత్ర పోషిస్తున్నట్లు 225 సెకన్లు ఉన్న టైటిల్ టీజర్ చెప్పకనే చెప్పింది. ఇందులో కిరాణా షాప్ ఓనర్ కాళీ పాత్రను ఆయన పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. అలాగే విక్రమ్ నటిస్తున్న 'తంగలాన్' చిత్రం నుంచి ఆయన పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

ఇటీవల 'ఓం భీమ్ బుష్' చిత్రంతో విజయాన్ని పొందిన హీరో శ్రీవిష్ణు తన కొత్త చిత్రం వివరాలు బుధవారం ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రంలో ఆయన సరసన నటించిన రెబా జాన్ ఇందులో హీరోయిన్. హాస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికి అరవై శాతం షూటింగ్ పూర్తయిందనీ, వీలైనంత త్వరగా మిగిలిన సినిమాను పూర్తి చేస్తామని నిర్మాతలు చెప్పారు. ఓ ఆసక్తికరమైన అంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వీర్ ఆర్యన్, అయ్యప్ప శర్మ, సుదర్శన్, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, ఎడిటింగ్: శ్రీకరప్రసాద్.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MR4yp18 లో చదవండి.

అమర రాజా ఇన్‌ఫ్రా నుంచి ప్రీమియర్ ఎనర్జీస్‌కు ఆర్డర్

హైదరాబాద్: అమరరాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 140 మెగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్స్ సరఫరా కోసం ఆర్డర్ అందుకున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ (పీఈఎల్) అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించింది. బంగ్లాదేశ్‌లోని ఈపీసీ ప్రాజెక్ట్ కోసం అమర రాజా ఇన్‌ఫ్రా నుంచి ఈ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు కంపెనీ తెలిపింది. 2025 ఏప్రిల్ నాటికి ఈ సోలార్ పీవీ మాడ్యూల్స్ సరఫరా పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ పేర్కొంది. కంపెనీ సోలార్ పీవీ మాడ్యూల్స్ నాణ్యత. పనితీరుకు లభించిన గుర్తింపు ఇదని పీఈఎల్ ఎండీ చిరంజీవ్ సలూజా తెలిపారు. ప్రస్తుతం పీఈఎల్, దాని అనుబంధ సంస్థల వార్షిక స్థాపిత సామర్థ్యం.. 2 గిగావాట్స్ సోలార్ సెల్స్, 3.36 గిగావాట్ సోలార్ మాడ్యుల్స్, 1 గిగావాట్ సోలార్ సెల్‌గా ఉంది. కాగా మరో 1 గిగావాట్ సోలార్ మాడ్యుల్ సామర్థ్యం నిర్మాణ దశలో ఉంది.

అనుగ్రహ్ స్టాక్ అండ్ బ్రోకింగ్ బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల జప్తు

న్యూఢిల్లీ: మార్కెట్ నిబంధనల అతిక్రమణ కేసులో రూ.1.22 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు అనుగ్రహ్ స్టాక్ అండ్ బ్రోకింగ్ బ్యాంక్, డీమ్యాట్ అకౌంట్ల జప్తునకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. అనుగ్రహ్ స్టాక్ అండ్ బ్రోకింగ్ ఖాతాల నుంచి డెబిట్ లావాదేవీలను అనుమతించవద్దని అన్ని బ్యాంకులు, డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్లను నియంత్రణ మండలి ఆదేశించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,150 ▲	67,970 ▲	90,000 ▼
ముంబై	73,302 ▲	67,145 ▲	83,213 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	415
చిత్తూరు	483	విశాఖపట్నం	430
గోదావరి	415	వరంగల్	412
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	128	గోదావరి	131
వరంగల్	128	విజయవాడ	131
కరీంనగర్	128	గుంటూరు	131
మహబూబ్‌నగర్	128	ఒంగోలు	131
కర్నూలు	128	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

సీనియర్ సిటిజన్స్ బ్యాంక్ డిపాజిట్లు రూ.34 లక్షల కోట్లు

ఐదేళ్లలో 150 శాతం పెరుగుదల.. ఎస్‌బీఐ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: కంపెనీలు తమ రుణ పత్రాలపై అధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తున్నా, సీనియర్ సిటిజన్లు మాత్రం బ్యాంక్ డిపాజిట్లపైనే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గత ఏడాది (2023) చివరి నాటికి బ్యాంకుల్లో వీరి డిపాజిట్లు రూ.34.36 లక్షల కోట్లకు చేరాయి. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 150 శాతం ఎక్కువని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో బ్యాంకుల్లో డిపాజిట్లు ఉన్న సీనియర్ సిటిజన్ల సంఖ్య 81 శాతం పెరిగి 4.1 కోట్ల నుంచి 7.4 కోట్లకు చేరింది. దీంతో మొత్తం టర్మ్ డిపాజిట్లలో వీరి డిపాజిట్ల వాటా 15 శాతం నుంచి 30 శాతానికి చేరింది.

రూ.2.7 లక్షల కోట్ల వడ్డీ

గత ఐదేళ్లలో సీనియర్ సిటిజన్ల సగటు డిపాజిట్ల మొత్తం రూ.3,34,243 నుంచి రూ.4,63,3472కు చేరింది. ప్రస్తుతం బ్యాంకులు ఈ సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై సగటున 7.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నాయి. ఈ లెక్కన రూ.34.36 లక్షల కోట్ల సీనియర్ సిటిజన్ల డిపాజిట్లు, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)పై రూ.2.7 లక్షల కోట్లు వడ్డీగా లభిస్తోంది.

బ్యాంకు డిపాజిట్లపైనే ఆసక్తి

సీనియర్ సిటిజన్స్ డిపాజిట్లపై ప్రస్తుతం బ్యాంకులు సగటున 7.5% వడ్డీ చెల్లిస్తున్నాయి. అదే సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)లో పెట్టుబడి పెడితే సగటున 8.2 శాతం వడ్డీ వస్తోంది. అయినా బ్యాంకు టర్మ్ డిపాజిట్లపైనే సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. 2023 డిసెంబరు నాటికి బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లు రూ.34.36 లక్షల కోట్లు ఉంటే, ఎస్‌సీఎస్‌ఎస్ పథకంలో ఉన్న డిపాజిట్ల మొత్తం రూ.1.62 లక్షల కోట్లు మాత్రమే. దీనిపై వారికి వచ్చిన వడ్డీవ రూ.13,000 కోట్లు.

రూ.27,000 కోట్ల పన్ను ఆదాయం

సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ పథకాలు ప్రభుత్వానికి పెద్ద మొత్తంలోనే పన్ను ఆదాయం సమకూర్చి పెడుతున్నాయి. ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీపై ప్రభుత్వం సగటున 10 శాతం పన్ను విధిస్తోంది. ఈ లెక్కన సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ స్కీమ్, ఎస్‌సీఎస్‌ఎస్‌పై ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరానికి పన్నుల రూపంలో రూ.27,000 కోట్లు వసూలు చేయనుంది.

టర్మ్ డిపాజిట్లపై మక్కువ ఎందుకంటే..

- ఇతర డిపాజిట్లతో పోలిస్తే అర శాతం నుంచి ముప్పావు శాతం అధిక వడ్డీ
- రూ.5 లక్షల వరకు డిపాజిట్లకు బీమా భద్రత
- కంపెనీల రుణ పత్రాలతో పోలిస్తే అధిక భద్రత
- సీనియర్ సిటిజన్ల కోసం బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక డిపాజిట్ పథకాలు
- ఇతర పెట్టుబడి సాధనాల్లో మదుపు చేస్తే అసలుకు కూడా భద్రత ఉండదనే భయం

స్మాల్ క్యాప్ ఫండ్స్‌పై రిటైల్ మదుపరుల ఆసక్తి

రూ. 2.43 లక్షల కోట్లకు చేరిన పెట్టుబడులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఆఫర్ చేసే స్మాల్ క్యాప్ ఫండ్స్ రిటైల్ మదుపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో వీరు ఈ పథకాల్లో రూ.40,188 కోట్లు మదుపు చేశారు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.18,085 కోట్లు ఎక్కువ. ఈ పెట్టుబడుల వరదతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.2.43 లక్షల కోట్లకు చేరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 83 శాతం ఎక్కువ. ఇదే సమయంలో రిటైల్ మదుపరుల సంఖ్యా 1.09 కోట్ల నుంచి 1.90 కోట్లకు చేరింది. స్మాల్ క్యాప్ ఫండ్స్‌పై రిటైల్ మదుపరుల ఆసక్తికి ఈ కింది అంశాలు దోహదం చేశాయి.

- పెరుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ
- లిస్టింగ్ కాని అనేక చిన్న కంపెనీలు ఐపీఓలకు రావడం
- లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్స్ కంటే అధిక లాభాలు
- జోరు మీద ఉన్న స్టాక్ మార్కెట్
- దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు
- ఆకర్షణీయమైన కంపెనీల ఆర్థిక ఫలితాలు
- స్వల్ప వ్యవధిలోనే పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశం

ఇరాన్ చర్యలతో ముప్పే: జానెట్ ఎల్లెన్

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులపై అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ ఎల్లెన్ ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఉంటుందన్నారు. ఇరాన్ దుందుడుకు చర్యలను అడ్డుకునేందుకు ఆ దేశంపై మరిన్ని ఆర్థిక ఆంక్షలు తప్పవని హెచ్చరించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల సమావేశాలు ఈవారం ప్రారంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్లెన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. ఆర్థిక ఆంక్షల్లో భాగంగా ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించబోతున్నట్టు సమాచారం. అదే జరిగితే ఇరాన్ నుంచి భారత చమురు దిగుమతులకు ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉంది. దీనికి తోడు చమురు ధరా చుక్కలంటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు పావులూరి సుబ్బారావుకు ఆర్యభట్ట అవార్డు

హైదరాబాద్: అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) వ్యవస్థాపకుడు, సీఈఓ, చైర్మన్ పావులూరి సుబ్బారావును ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 'ఆర్యభట్ట అవార్డ్'తో సత్కరించింది. భారత ఆస్ట్రోనాటిక్స్ రంగంలో సుబ్బారావు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఏఎస్ఐ ప్రెసిడెంట్, ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, మాజీ ఇస్రో చైర్మన్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా పావులూరి సుబ్బారావు ఈ అవార్డును అందుకున్నారు. తొలుత ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసిన సుబ్బారావు 1992లో అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. భారత రక్షణ రంగం, ఇస్రో కోసం దేశీయంగా పలు ఏవియానిక్స్ ఉత్పత్తులను డిజైన్ చేయటంతో పాటు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఏటీఎల్.. హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురంలలో మూడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నిర్వహిస్తోంది.

అంబుజాలో అదానీ వాటా పెంపు

మరో రూ.8,339 కోట్ల పెట్టుబడితో 70.3 శాతానికి పెరిగిన వాటా

న్యూఢిల్లీ: అంబుజా సిమెంట్స్‌లో మరో రూ.8,339 కోట్ల పెట్టుబడి ద్వారా గౌతమ్ అదానీ కుటుంబం కంపెనీలో వాటాను 70.3 శాతానికి పెంచుకుంది. గతంలోనూ అదానీ కుటుంబం 2022 అక్టోబరు 18న రూ.5,000 కోట్లు, 2024 మార్చి 28న రూ.6,661 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. తాజా ఇన్వెస్ట్‌మెంట్‌తో కలిపి మొత్తం రూ.20,000 కోట్ల నిధులు సమకూర్చిందని అంబుజా సిమెంట్స్ వెల్లడించింది. తాజా ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అంబుజాలో అదానీ ఫ్యామిలీ వాటా మరో 3.6 శాతం పెరిగింది. మొత్తం రూ.20,000 కోట్ల పెట్టుబడి ద్వారా 63.2 శాతం నుంచి 70.3 శాతానికి చేరుకుంది. కంపెనీ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2028 నాటికి రెట్టింపు స్థాయి 14 కోట్ల టన్నులకు పెంచుకునేందుకు దోహదపడనున్నాయి. గత డిసెంబరు 31 నాటికి సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 7.61 కోట్ల టన్నులుగా ఉంది. స్విట్జర్లాండ్‌కు చెందిన సిమెంట్ దిగ్గజం హోల్సిమ్ నుంచి అంబుజా సిమెంట్స్, ఏసీసీలో మెజారిటీ వాటాను 1,050 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయడం ద్వారా 2022లో అదానీ గ్రూప్ సిమెంట్ తయారీ రంగంలోకి ప్రవేశించింది.

తగ్గిన చమురు దిగుమతి బిల్లు

ఆదుకున్న రష్యా డిస్కౌంట్ చమురు

న్యూఢిల్లీ: రష్యా డిస్కౌంట్స్ పుణ్యమాని 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశ చమురు దిగుమతి బిల్లు 15.9 శాతం తగ్గింది. 2022-23 ఆర్థిక సంవత్సరం 15,750 కోట్ల డాలర్లు ఉన్న ఈ బిల్లు ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో 13,240 కోట్ల డాలర్లకు (సుమారు రూ.11.06 లక్షల కోట్లు) తగ్గింది. దిగుమతి చేసుకున్న చమురు పరిమాణం మాత్రం 23.25 కోట్ల టన్నుల వద్దే ఉంది. ఇదే సమయంలో చమురు కోసం దిగుమతులపై ఆధారపడడం మాత్రం 87.4 శాతం నుంచి 87.7 శాతానికి పెరిగింది. దేశీయ చమురు ఉత్పత్తి ఎదుగూ బొదుగు లేకుండా 2.94 కోట్ల టన్నుల వద్దే ఉండడం ఇందుకు ప్రధాన కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం ముడి చమురుతో పాటు ఎల్‌పీజీ వంటి 4.81 కోట్ల టన్నుల పెట్రో ఉత్పత్తుల దిగుమతి కోసం 2,340 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఇదే సమయంలో 4,740 కోట్ల డాలర్ల విలువైన 6.22 కోట్ల టన్ను పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేసింది.



సామ్‌సంగ్ ఏఐ టీవీలు

ప్రారంభ ధర రూ.1.39 లక్షలు

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ బుధవారం భారత మార్కెట్లోకి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అల్ట్రా ప్రీమియం టీవీలను ప్రవేశపెట్టింది. నియో క్యూఎల్‌ఈడీ మోడల్‌లో 4కే, 8కే సిరీస్‌లతో పాటు ప్రపంచంలో మొట్టమొదటి గ్లేర్ ఫ్రీ ఓఎల్‌ఈడీ టీవీలను అందుబాటులోకి తెచ్చింది. 55, 65, 75, 85, 98 అంగుళాల సైజులో లభించే నియో క్యూఎల్‌ఈడీ 4కే టీవీల ధర రూ.1,39,900 ప్రారంభం కానుందని కంపెనీ తెలిపింది. కాగా, క్యూఎన్900డీ, క్యూఎన్800డీ మోడళ్లు.. 65, 75, 85 అంగుళాల సైజుల్లో లభించనున్న నియో క్యూఎల్‌ఈడీ 8కే టీవీల ధర రూ.3,19,990 నుంచి ప్రారంభమవుతుంది. రెండు మోడళ్లలో (ఎస్95డీ, ఎస్90డీ).. 55, 65, 77, 83 అంగుళాల సైజుల్లో లభించనున్న ఓఎల్‌ఈడీ టీవీల ప్రారంభ రేటు రూ.1,64,990గా ఉంది. ఈ ఏడాది భారత మార్కెట్లో టీవీ విక్రయాల వ్యాపారాన్ని రూ.10,000 కోట్ల మైలురాయిని దాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ విభాగ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దీప్ సింగ్ తెలిపారు.

స్పోర్ట్స్



సాధారణ ఆర్చర్లతో పోటీపడి రజతం కొల్లగొట్టింది

» ఖేలో ఇండియాలో మెరిసిన పారా అథ్లెట్ శీతల్

న్యూఢిల్లీ: ఆసియా పారా క్రీడల స్వర్ణ పతక విజేత, 17 ఏళ్ల శీతల్ దేవి మరోసారి అదిరిపోయే ప్రదర్శన చేసింది. ఖేలో ఇండియా జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నమెంట్‌లో రజతంతో మెరిసింది. అయితే, ఈ పోటీల్లో ఆమె సాధారణ ఆర్చర్ల విభాగంలో పోటీపడి పతకం నెగ్గడం విశేషం. మంగళవారం ఢిల్లీలో జరిగిన జూనియర్ కాంపౌండ్ వ్యక్తిగత కేటగిరీ ఫైనల్లో శీతల్ 138-140 స్కోరుతో ఏక్తా చేతిలో ఓడి, రజతంతో సరిపెట్టుకుంది. ఏక్తాకు రూ.50 వేలు, శీతల్‌కు రూ.40 వేలు నగదు బహుమతి లభించింది.

గుజరాత్ ఢమాల్

దుమ్మురేపిన ఢిల్లీ బౌలర్లు
89 పరుగులకే టైటాన్స్ అవుట్
53 బంతుల్లోనే గెలిచిన పంత్ సేన



అహ్మదాబాద్: ఎట్టకేలకు బౌలర్లు చెలరేగడంతో.. ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్లతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. కేవలం 53 బంతుల్లోనే లక్ష్యాన్ని చేరుకొన్న క్యాపిటల్స్ నెట్ రన్‌రేట్‌ను భారీగా మెరుగుపరచుకొంది. తొలుత గుజరాత్ 17.3 ఓవర్లలో 89 పరుగులకు కుప్పకూలింది. రషీద్ ఖాన్ (31) టాప్ స్కోరర్. ముకేశ్ 3 వికెట్లు పడగొట్టగా.. ఇషాంత్, స్టబ్స్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం స్వల్ప ఛేదనలో ఢిల్లీ 8.5 ఓవర్లలో 92/4 స్కోరు చేసి అలవోకగా నెగ్గింది. జాక్ ఫ్రేజర్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 20), హోప్ (10 బంతు ల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 19), రిషభ్ పంత్ (16 నాటౌట్) వేగంగా ఆడారు. సందీప్ వారియర్ 2 వికెట్లు పడగొట్టాడు. రెండు స్టంపింగ్‌లు, రెండు క్యాచ్‌లు పట్టడంతో పాటు బ్యాటింగ్‌లో అజేయంగా నిలిచిన ఢిల్లీ కెప్టెన్ పంత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈ గెలుపుతో ఢిల్లీ పట్టికలో ఆరో స్థానానికి చేరుకొంది.

1
89 పరుగులు చేసిన గుజరాత్‌కు ఐపీఎల్‌లో ఇదే అత్యల్ప స్కోరు. గతేడాది ఢిల్లీపై టైటాన్స్ 125/6 స్కోరు చేసింది.
బంతుల పరంగా (67 బంతుల్లో) ఢిల్లీకి ఇదే భారీ గెలుపు.

ఎడాపెడా బాదేశారు..: స్వల్ప లక్ష్య ఛేదనను ఢిల్లీ వీలైనంత వేగంగా ముగించింది. వార్నర్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ఫ్రేజర్ తొలి ఓవర్‌లోనే 4,6తో జోరు చూపాడు. ఆ తర్వాతి ఓవర్‌లో 6,4 బాదిన ఫ్రేజర్‌ను స్పెన్సర్స్ అవుట్ చేయడంతో.. మొదటి వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఫోర్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న మరో ఓపెనర్ పృథ్వీ షా (7)ను వారియర్ వెనక్కిపంపాడు. ఈ దశలో జతకలసిన అభిషేక్ పోరెల్ (15), షాయ్ హోప్ వేగంగా ఆడుతూ మూడో వికెట్‌కు 14 బంతుల్లో 34 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. 5వ ఓవర్‌లో వారియర్ బౌలింగ్‌లో హోప్ 4,6,6తో జోరు చూపగా.. సిక్స్ బాదిన పోరెల్ ఆ తర్వాతి బంతికి బౌల్డ్ అయ్యాడు. కానీ, ఈ ఒక్క ఓవర్‌లోనే వీరిద్దరూ 23 పరుగులు రాబట్టారు. అయితే, హోప్‌ను రషీద్ క్యాచవుట్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ 67/4తో నిలిచింది. అనంతరం పంత్, సుమిత్ (9 నాటౌట్) ఐదో వికెట్‌కు అజేయంగా 25 పరుగులు జోడించడంతో.. క్యాపిటల్స్ మరో 67 బంతులు మిగిలుండగానే గెలిచింది. పంత్ 6,4 బాదగా.. సుమిత్ రెండు బౌండ్రీలతో మ్యాచ్‌ను ముగించాడు.

పెవిలియన్‌కు క్యూ..: ఢిల్లీ బౌలర్లు ఇషాంత్, ముకేశ్ విజృంభించడంతో.. గుజరాత్ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకొన్న టైటాన్స్.. లీగ్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ బ్యాటింగ్‌లో రషీద్ మినహా ఒక్క బ్యాటర్ కూడా మూడు పదుల స్కోరు దాటలేక పోయారు. పవర్‌ప్లేలోనే టాపార్డర్ బ్యాటర్లు గిల్ (8), సాహా (2), సాయి సుదర్శన్ (12)తోపాటు మిల్లర్ (2) వికెట్లను కోల్పోయిన గుజరాత్ 30/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. రెండు ఫోర్లతో ధాటిగా ఆడుతున్న గిల్‌ను అవుట్ చేసిన ఇషాంత్.. టైటాన్స్ పతనానికి నాంది పలికాడు. ముకేష్ బౌలింగ్‌లో సాహా వికెట్ల మీదకు ఆడుకొన్నాడు. సుమిత్ మెరుపు ఫీల్డింగ్‌తో సుదర్శన్ రనౌట్ కాగా.. ఇషాంత్ బౌలింగ్‌లో పంత్ అద్భుత క్యాచ్‌తో మిల్లర్ వెనుదిరిగాడు. ఈ దశలో అభినవ్ మనోహర్ (8), రాహుల్ తెవాటియా (10) జట్టును ఆదుకొంటారని భావించారు. కానీ, 9వ ఓవర్‌లో మనోహర్, షారుక్ ఖాన్ (0)లను పంత్ స్టంపౌట్ చేయడంతో.. టైటాన్స్ 54/6తో కోలుకోలేక పోయింది. రషీద్ రెండు బౌండ్రీలతో దూకుడుగా ఆడాడు. కానీ, 12వ ఓవర్‌లో తెవాటియాను అక్షర్ ఎల్బీ చేయడంతో గుజరాత్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. మోహిత్ శర్మ (2)ను ఖలీల్ పెవిలియన్ చేర్చాడు. 18వ ఓవర్‌లో రషీద్‌తోపాటు నూర్ అహ్మద్ (1)ను అవుట్ చేసిన ముకేశ్.. వంద పరుగులలోపే గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.
పంజాబ్ X ముంబై

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	12 వికెట్లు

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) ముకేశ్ 2, గిల్ (సి) పృథ్వీషా (బి) ఇషాంత్ 8, సాయి సుదర్శన్ (రనౌట్) 12, మిల్లర్ (సి) పంత్ (బి) ఇషాంత్ 2, మనోహర్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 8, తెవాటియా (ఎల్బీ) అక్షర్ 10, షారుక్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 0, రషీద్ (సి) పంత్ (బి) ముకేశ్ 31, మోహిత్ (సి) సుమిత్ (బి) ఖలీల్ 2, నూర్ అహ్మద్ (బి) ముకేశ్ 1, జాన్సన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 17.3 ఓవర్లలో 89 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-28, 3-28, 4-30, 5-47, 6-48, 7-66, 8-78, 9-88, 10-89; **బౌలింగ్:** ఖలీల్ 4-1-18-1, ఇషాంత్ శర్మ 2-0-8-2, ముకేశ్ 2.3-0-14-3, కుల్దీప్ యాదవ్ 4-0-16-0, స్టబ్స్ 1-0-11-2, అక్షర్ 4-0-17-1.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) జాన్సన్ (బి) సందీప్ 7, ఫ్రేజర్ (సి) మనోహర్ (బి) జాన్సన్ 20, అభిషేక్ (బి) సందీప్ 15, హోప్ (సి) ఇషాంత్ (బి) రషీద్ 19, పంత్ (నాటౌట్) 16, సుమిత్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 8.5 ఓవర్లలో 92/4; వికెట్ల పతనం:** 1-25, 2-31, 3-65, 4-67; **బౌలింగ్:** సందీప్ 3-0-40-2, జాన్సన్ 2-0-22-1, రషీద్ 2-0-12-1, నూర్ అహ్మద్ 1.5-0-14-0.

ఫ్యాన్ క్రేజ్.. ఫ్రాంచైజీలకు 'క్యాష్'!

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

న్యూఢిల్లీ: ఫ్రాంచైజీ క్రికెట్ వినోదానికి కేరాఫ్..ధనాధన్ బ్యాటింగ్, మెరుపు ఫీల్డింగ్.. పిచ్ అనుకూలిస్తే వికెట్ల పండుగ చేసుకొనే పేసర్లు, స్పిన్నర్లు..మొత్తం మూడు గంటల్లో ముగిసే ఫ్రాంచైజీ క్రికెట్‌పై ఫ్యాన్స్‌కు ఎక్కడలేని క్రేజ్..అందుకే అభిమానుల ఈ పిచ్చిని ఫ్రాంచైజీలు బాగా 'క్యాష్' చేసుకుంటున్నాయి. 'డైనమిక్ రేట్స్' పేరిట ఫ్యాన్స్ జేబును గుల్ల చేస్తున్నాయి ! సొంత మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌కు బెస్ట్ సీట్ చివరి నిమిషంలో కావాలంటే..టిక్కెట్ రేటు ఎంతో తెలుసా... రూ. 52,938 ! టిక్కెట్ ధరల నిర్ణయాధికారం ఫ్రాంచైజీలకు బోర్డు వదిలేయడమే ఈ అధిక ధరలకు కారణం ! టిక్కెట్ల కోసం ఎగబడుతున్న ఫ్యాన్స్..కూడా ధరల విషయంలో ఫిర్యాదు చేయడం లేదట.

వరుస ఓటములు..అయినా తగ్గని క్రేజ్: బెంగళూరు జట్టు దారుణ వైఫల్యాలు చవిచూస్తున్నా..ఆ టీమ్ ఫ్యాన్ క్రేజ్ ఏమాత్రం తగ్గడంలేదు. ఈ క్రేజ్‌ను ఆర్సీబీ ఫ్రాంచైజీ బాగా 'సొమ్ము' చేసుకుంటోంది. బెంగళూరు జట్టు సొంతమైదానంలో ఆడే మ్యాచ్‌కు అతి తక్కువ శ్రేణి టిక్కెట్ రేటు ఎంతో తెలుసా..రూ.2300 ! ఈసారి ఐపీఎల్‌లో బెంగళూరులో ఇదే అతి తక్కువ టిక్కెట్ ధర ఇదే కావడం గమనార్హం. ఈ డైనమిక్ ధరలనుంచి తక్కువ రేటు కలిగిన టిక్కెట్లను మినహాయించారు. కానీ ఎక్కువ రేటు కలిగిన టిక్కెట్ల విషయంలో 'డైనమిక్' విధానం అనుసరిస్తుండడంతో మ్యాచ్ డే దగ్గరపడుతున్నకొద్దీ వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హోమ్ గ్రౌండ్‌లో బెంగళూరు తొలి మ్యాచ్‌కు టెర్రాస్ టిక్కెట్ రేటును రూ. 4,840 నుంచి రూ. 6,292కి పెంచేశారు. ఇక కార్పొరేట్ స్టాండ్ టిక్కెట్ ధర అయితే రూ. 42,350 నుంచి 52,938కి చేరింది.



'47 కోట్లు' బెంచ్‌కే..

బెంగళూరులో సోమవారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 25 పరుగుల తేడాతో ఓడింది. ఈ పోరుకు ఆసీస్ ద్వయం మ్యాక్స్‌వెల్, గ్రీన్, అల్జరీ జోసెఫ్, సిరాజ్ వంటి స్టార్ క్రికెటర్లను ఆర్సీబీ బెంచ్‌మీదే కూర్చోబెట్టింది. మ్యాచ్ చేజార్చుకున్న బెంగళూరుపై సీఎస్‌కే బ్యాటర్ అభినవ్ ముకుంద్ సెటైర్ వేశాడు. 17.5+11.5+11+7= రూ. 47 కోట్లు బెంచ్‌కే..అని ఎద్దేవా చేశాడు.



శ్రేయాస్‌కు 12 లక్షల జరిమానా

కోల్‌కతా: రాజస్థాన్ రాయల్స్‌తో మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ స్లో ఓవర్ రేట్ నమోదు చేసినందుకు ఆ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా పడింది. స్లో ఓవర్ రేట్ విషయంలో నైట్‌రైడర్స్‌కు ఇది తొలి తప్పిదం కావడంతో శ్రేయాస్‌కు రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు ఆఖరి బంతికి గెలుపొందిన సంగతి తెలిసిందే.

కొత్త ముఖాలకు చోటు కష్టమే!

» జైస్వాల్-గిల్, రింకూ-దూబే మధ్య పోటీ
» టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక నెలాఖరున ?

న్యూఢిల్లీ: డెడ్‌లైన్ దగ్గరపడుతుండంతో..టీ20 వరల్డ్ కప్‌నకు భారత జట్టు ఎంపికపై సెలెక్టర్లు దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి కొత్త ముఖాలకు జట్టులో చోటు కష్టమని తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో పరీక్షించిన ఒకరిద్దరు ఆటగాళ్లకు కూడా నిరాశ తప్పేలా లేదు. వరల్డ్‌కప్ జట్ల ప్రకటనకు ఐసీసీ వచ్చే నెల ఒకటో తేదీని కటాఫ్‌గా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఈ నెలాఖరు కల్లా 15 మంది సభ్యుల భారత జట్టును ఎంపిక చేయనుంది. కాగా, అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పొట్టి వరల్డ్‌కప్ జూన్ 2 నుంచి జరగనుంది. ఓపెనర్ స్థానం కోసం పోటీలో ఉన్న యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లో ఒకరికి మాత్రమే జట్టులో చోటు లభించే అవకాశాలున్నాయి. ఇక, ఫినిషర్ స్థానం కోసం రింకూ సింగ్, శివమ్ దూబే మధ్య పోటీ నెలకొంది. రిషభ్ పంత్‌కు బ్యాకప్‌గా రెండో వికెట్ కీపర్ రేసులో సంజూ శాంసన్, రాహుల్, ఇషాన్ కిషన్ ఉన్నారు. అయితే, రాహుల్, ఇషాన్ ఐపీఎల్‌లో ఓపెనర్లుగా దిగుతుండడంతో మిడిలార్డర్‌లో వీరు ఎలా ఆడతారనేది సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది. హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఫిట్‌నెస్‌పై అనుమానాలున్నా.. ప్రస్తుతానికి అతడి ఎంపికలో ఎటువంటి సందేహాలు లేవు. కోహ్లీ ఎంపిక కూడా లాంఛనం కానుంది.

టీమిండియా ప్రాబబుల్స్ (15+5 స్టాండ్‌బై)

బ్యాటర్లు (6): రోహిత్, యశస్వీ జైస్వాల్, గిల్, కోహ్లీ, సూర్యకుమార్, రింకూ సింగ్; **ఆల్ రౌండర్లు (4):** హార్దిక్ పాండ్యా, జడేజా, శివమ్ దూబే, అక్షర్ పటేల్; **స్పిన్నర్లు (3):** కుల్దీప్ యాదవ్, చాహల్, రవి బిష్ణోయ్; **వికెట్ కీపర్లు (3):** రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, సంజూ శాంసన్; **పేసర్లు (4):** బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్.

గుక్కెడు నీళ్లకోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారు

» మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని, గుక్కెడు నీళ్ల కోసం రోడ్డెక్కుతున్నారని, ఖాళీ బిందెలతో ధర్నాలు చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన... నల్లానీళ్లు రాకపోవడంతో ప్రజలు ట్యాంకర్లకోసం ఎదురు చూస్తున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి దృశాలు ఎప్పుడూ కనిపించలేదని, మిషన్ భగీరథ వల్ల మారుమూల తండాల్లోనూ నీరు సమృద్ధిగా లభించేదని, కాంగ్రెస్ పాలనలో నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని తెలిపారు. పంటలకు ఎలాగూ సాగునీళ్లివ్వని సర్కారు కనీసం ప్రజలకు గొంతు తడుపుకోవడానికి మంచి నీళ్లయినా ఇవ్వాలని, దీనిపై తక్షణం స్పందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ శాఖ బదిలీల్లో అక్రమాలు

» సీఈవోకు ఫోరం ఫర్ డెమోక్రటిక్ తెలంగాణ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్‌శాఖలో కొన్ని బదిలీల్లో అక్రమాలు జరిగాయని, కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీలు జరగలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)కి ఫోరం ఫర్ డెమోక్రటిక్ తెలంగాణ ఫిర్యాదు చేసింది. సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఈవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించింది. నామమాత్రపు బదిలీలు చేపట్టి, మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న వారిని కొనసాగిస్తున్నారని ఆరోపించింది. రాజకీయ, ఆర్థిక ప్రలోభాలకు తలొగ్గి ఎక్కువమంది అధికారులను సొంత పార్లమెంటు నియోజకవర్గాల నుంచి బదిలీ కాకుండా చేశారని తెలిపింది.

చెరువుల్లో నిర్మాణాలపై హైకోర్టు ఆగ్రహం

» న్యాయమూర్తి లేఖపై సుమోటోగా విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో చెరువులు, కుంటలను కబ్జా చేసి వాటిని ప్లాట్లుగా మార్చి నిర్మాణాలు కొనసాగిస్తుండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ఈ అక్రమ నిర్మాణాల గురించి పలు పత్రికల్లో వచ్చిన కథనాలను ఉటంకిస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ భూములను ఆక్రమణల వల్ల నీటివనరులు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆక్రమణల సంగతి తెలిసినా పట్టించుకోకపోవడం లేదని పేర్కొన్నారు. నగరాల్లో సంప్రదాయ నీటివనరుల శాతం తగ్గడం వల్ల భౌగోళిక మార్పులు, పర్యావరణంపై ఒత్తిడి పెరగడంతోపాటు ఆర్థికాభివృద్ధి సైతం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే సగానికిపైగా నీటి వనరులు మాయమయ్యాయన్నారు. ప్రభుత్వం కేవలం డ్యాంల నిర్మాణంపై మాత్రమే దృష్టిసారించడం, నీటి యాజమాన్యం కేవలం ప్రభుత్వానికి సంబంధించిన అంశంగా మారిపోవడం, సరైన పారుదల వ్యవస్థ లేకపోవడం ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం.. గురువారం విచారణ చేపట్టనుంది.

సర్వీస్ ట్యాక్స్ కట్టలేదని ఆర్‌అండ్‌బీ బ్యాంకు ఖాతాల స్తంభన

» కేంద్రం తీరుపై హైకోర్టును ఆశ్రయించిన ఈఈ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ ట్యాక్స్ కట్టలేదని పేర్కొంటూ వికారాబాద్ జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన రెండు బ్యాంకు ఖాతాలను కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ అధికారులు స్తంభింపజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా రోడ్లు భవనాల శాఖకు చెందిన ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడంతోపాటు సర్వీస్ ట్యాక్స్, జరిమానాలు కలిపి దాదాపు రూ.78 లక్షలను ఆయా బ్యాంకు ఖాతాల నుంచి కోత విధిస్తామని తెలిపారు. ఇది చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి కం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) హైకోర్టును ఆశ్రయించారు. తమ వివరణ తీసుకోకుండా ఇలా చేయడం అక్రమమని, 2018లో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన సెంట్రల్ ట్యాక్స్ నోటిఫికేషన్‌కు, ఫైనాన్స్ యాక్ట్ - 1994కు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ నేడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరగనుంది. ఈ కేసులో తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్రపై విచారణ జరిపించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చివరిసారిగా ఈ ఏడాది జనవరి 10వ తేదీన విచారణ జరిగింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తాజాగా ఈ కేసు మళ్లీ విచారణకు వచ్చింది. దీనిపై తెలంగాణ భవన్ బయట ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేసు విచారణలో జాప్యం జరుగుతోందని, త్వరితగతిన చేపట్టాలని కోరారు.

కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతున్నారు

» డీజీపీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ముఖ్యంగా సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ పార్టీ నేతలు రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శంభీపూర్‌రాజు, బాల్కసుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, గట్టు రాంచందర్‌రావు తదితరులు బుధవారం డీజీపీ కార్యాలయంలోని ఓ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే చాలు.. చట్టాన్ని కూడా లెక్కచేయకుండా కేసులు పెడుతున్నారని, కొందరు పోలీసులు ప్రభుత్వానికి వంతపాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై జులుం ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల పలుచోట్ల నమోదైన అక్రమ కేసులు, దాడులకు సంబంధించిన వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నామని తెలిపారు.

నా కుమారుడిని జైల్లో పెట్టేందుకు కుట్ర

» కారు ప్రమాదం కేసును సిటింగ్ జడ్జితో విచారించాలి

» రాహిల్ తప్పు చేసినట్లు తేలితే.. బహిరంగంగా ఉరి తీసినా ఒప్పుకుంటా

» బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

బోధన్ రూరల్, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు రాహిల్‌ను జైల్లో పెట్టేందుకు కుట్ర జరుగుతోందని నిజామాబాద్ జిల్లా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆరోపించారు. పంజాగుట్ట కారు ప్రమాదం కేసును సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన దుబాయ్ నుంచి ఓ వీడియోను విడుదల చేశారు. రాజకీయ కుట్రతోనే తన కుమారుడిని కారు ప్రమాదం కేసులో ఇరికించారని ఆరోపించారు. రాహిల్‌ను జైలులో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, తన కుమారుడికి ఏం జరిగినా పోలీసు ఉన్నతాధికారులదే బాధ్యతని పేర్కొన్నారు. తాను ప్రస్తుతం దుబాయ్‌లో చికిత్స తీసుకుంటున్నానని తెలిపారు. పంజాగుట్ట కారు ప్రమాదం ఘటనలో రాహిల్‌పై 21 కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. రాజకీయంగా తనపై కుట్రలు చేస్తున్నారని, ఇందులోకి పిల్లలను లాగొద్దని కోరారు. తన కుమారుడు తప్పు చేసినట్లు తేలితే దేనికైనా సిద్ధమని, బహిరంగంగా ఉరి తీసినా ఒప్పుకుంటానని అన్నారు. ఈ కేసుపై న్యాయ పోరాటానికి సిద్ధమని షకీల్ ప్రకటించారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే చర్యలు: హైదరాబాద్ సీపీ

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ విడుదల చేసిన వీడియోలో పోలీసులపై నిరాధారణమైన ఆరోపణలుచేశారని వాటిని ఖండిస్తున్నానని హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా కేసును దర్యాప్తు చేస్తున్న పోలీస్ అధికారులపై నిరాధారమైన, ఊహాజనిత ఆరోపణలు చేయడం కేసును తప్పు దోవ పట్టించడమేనన్నారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని నేరానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దురుద్దేశంతో దర్యాప్తును వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



కేసీఆర్.. మా జోలికి వస్తే తడాఖా చూపిస్తాం

3 నెలల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెడతాం.. 30 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తామంటున్నారు

కవిత జైలుకు వెళ్లడంతో కుటుంబానికి మెంటల్ లేచింది.. ఆమెకు రెండేళ్ల దాకా బెయిల్ రాదు

యాదాద్రి ప్లాంట్ అవినీతిపై జగదీష్‌రెడ్డి జైలుకే..: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 17: కేసీఆర్... కాంగ్రెస్ ప్రభుత్వం జోలికి వస్తే మా తడాఖా ఏంటో చూపిస్తాం... మూడు నెలల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెడతాం... హైదరాబాద్‌లోని ఆ పార్టీ భవనాన్ని పునాదులతో లేపేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. నల్లగొండలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌కి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తామంటున్నారని, కేసీఆర్ ఇదేవిధంగా తమ జోలికి వస్తే ముగ్గురు, నలుగురు బంధువులైన ఎమ్మెల్యేలు మినహా ఆ పార్టీలో ఎవరూ మిగలరని హెచ్చరించారు. నారాయణపేటలో కేసీఆర్ కాంగ్రెస్ పార్టీకి రెండు సీట్లు కూడా రావని అన్నారని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. మెదక్‌లో రూ.1000 కోట్లు ఖర్చు పెట్టినా బీఆర్‌ఎస్ గెలవదని జోస్యం చెప్పారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా స్వతంత్రంగా గెలవడంతో పాటు ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిచిన ఓ రైతు బిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని, అలాంటి నాయకుడిని లిల్లీపుట్ అంటావా అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉందని, తమ పార్టీ 13 సీట్లను గెలుచుకుంటుందన్నారు. కవితకు రెండేళ్ల వరకు బెయిల్ వచ్చే ప్రసక్తే లేదన్నారు. ఆమె జైలుకు వెళ్లడంతో తండ్రి కేసీఆర్, కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీష్‌రావుకు మెంటల్ లేచినట్లు ఉందని, అందుకే రేవంత్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. త్వరలో చర్లపల్లి జైలుకు రావులు అంతా వెళతారని, ప్రభాకర్‌రావు మొదలుకుని తారక రామారావు వరకు వెళితే తమ ముఖ్యమంత్రి రేవంత్ చెప్పినట్లుగా ఒక డబుల్ బెడ్ రూం ఇల్లు సరిపోదని, ఎన్ని ఇళ్లు కట్టాల్సి వస్తుందోనని ఎద్దేవా చేశారు. తన బండారం ఎక్కడ బయట పడుతుందోనని కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. ఒకప్పుడు తిండికి లేని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని షాబాద్‌లో 80 ఎకరాల ఫాంహౌస్ సంపాదించాడన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ అవినీతి, అక్రమాల విషయంలో జగదీష్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. దోచుకోవడానికే పవర్ ప్లాంట్ అంచనాలు రూ.29 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రుణమాఫీ అమలు చేస్తామన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ 33 నెలల్లో పూర్తి!

నెలకు 300 మీటర్లు తవ్వేందుకు కసరత్తు.. నిధులు ఇస్తే తవ్వుతామన్న నిర్మాణ సంస్థ

» రూ.50 కోట్లు విడుదల చేయాలని అధికారుల కమిటీ ప్రతిపాదన

» 19 ఏళ్లుగా సొరంగం పనులు

» ఉమ్మడి రాష్ట్రంలో 33 కి.మీ. తవ్వకం

» బీఆర్‌ఎస్ హయాంలో ప్రాధాన్యం లేని జాబితాలోకి ప్రాజెక్టు



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురవుతున్న శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పనులు ఎట్టకేలకు తిరిగి ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ టన్నెల్‌ను నెలకు 300 మీటర్ల చొప్పున తవ్వుతూ 33 నెలల్లో తవ్వకం పూర్తి చేయడానికి నిర్మాణ సంస్థ అంగీకరించింది. ఇందుకోసం ఇప్పటికిప్పుడు రూ.50 కోట్లు విడుదల చేయాలని కోరింది. ఈ నిధులను విడుదల చేస్తే.. మే నెల నుంచి పనులను పట్టాలెక్కించడానికి వీలుంటుందని అధికారులు కూడా గుర్తించారు. ఈ మేరకు నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌పై ఇటీవలే అధికారులతో కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ.. నిర్మాణ సంస్థతో చేపట్టిన సమావేశమై చర్చలు జరపగా ఏకకాలంలో రెండువైపులా టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో తవ్వకాలు చేపడతామని సంస్థ తెలిపింది. తగిన నిధులు సమకూరిస్తే.. నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల్లో టన్నెల్‌ను పూర్తిచేయగలమని పేర్కొంది. ఇందుకుగాను రూ.50 కోట్లను విడుదల చేస్తే ఒక టీబీఎంకు మరమ్మతులు చేయడంతోపాటు ఇన్‌లెట్ (శ్రీశైలం వైపు) నుంచి డీవాటరింగ్ పనులు చేసి, పనులను పట్టాలెక్కిస్తామని చెప్పింది. దాంతో ఈ ప్రాజెక్టు కోసం రూ.50 కోట్లు విడుదల చేయాలని కోరుతూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మొత్తం 43.93 కిలోమీటర్ల మేర ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులను 2005లో ప్రారంభించగా.. 2014 జూన్ నాటికి 33 కిలోమీటర్ల మేర తవ్వారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత పదేళ్లపాటు ఈ పథకాన్ని గత ప్రభుత్వం పక్కనపెట్టేసింది. గడచిన పదేళ్లలో కేవలం ఒక్క కిలోమీటర్ మాత్రమే తవ్వారు. 16 నెలల కిందట ఇన్‌లెట్ నుంచి టన్నెల్ తవ్వుతున్న మెషిన్ (టీబీఎం)పాడయింది. దీని బేరింగులు పాడైపోయాయి. అప్పటినుంచి టన్నెల్ తవ్వకం పూర్తిగా నిలిచిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను అత్యంత ప్రాధాన్య జాబితాలో చేర్చింది. ఈ టన్నెల్ పనులు పూర్తయితే 3లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు గ్రావిటీతో అందుతుంది.

19 ఏళ్లుగా సాగుతున్న సొరంగం..

శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను సొరంగం ద్వారా తరలించడానికి వీలుగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును 2005లో చేపట్టారు. కానీ, 19 ఏళ్లు పూర్తికావస్తున్నా పనులు పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టులో భాగంగా 43.93 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉండగా.. ఇప్పటి దాకా 34.37 కిలోమీటర్ల మేర తవ్వారు. ఇందులో 33 కిలోమీటర్ల మేర ఉమ్మడి రాష్ట్రంలోనే తవ్వగా... గత పదేళ్ల కాలంలో కేవలం ఒక్క కిలోమీటర్ మాత్రమే తవ్వారు. టన్నెల్ తవ్వకం కోసం ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణ సంస్థ అమెరికా నుంచి టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)లను తెప్పించింది. ఒక సొరంగం శ్రీశైలం వైపు నుంచి, మరో సొరంగం మన్నెవారిపల్లి (అచ్చంపేట) నుంచి తవ్వుకుంటూ వెళ్లాలని నిర్ణయించారు. ఇంకా మరో 9.56 కిలోమీటర్ల దాకా తవ్వితే గ్రావిటీతో నీరు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు/తాగునీటి అవసరాలకు చేరనుంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టు ప్రతిపాదన 1969లోనే వచ్చింది. దీనికి 150 టీఎంసీల నీటిని కేటాయించాలని అప్పట్లోనే బచావత్ ట్రైబ్యునల్ ముందు కోరినా.. నీటి కేటాయింపులు జరగలేదు. శ్రీశైలం కుడి, ఎడమగట్టు ప్రతిపాదనలు ఏకకాలంలో రాగా.. కుడిగట్టు పనులు 1990లోనే పూర్తయ్యాయి. ఎడమ గట్టు పథకం పనులు మాత్రం 2005 నుంచి కొనసాగుతూనే ఉన్నాయి.

బోర్డుపై ఏముందో చూడలేకపోతున్నారు!

» 7% విద్యార్థులకు కళ్లజోడు తప్పనిసరి

» గురుకులాలు, హాస్టళ్లలోని 2 లక్షల మందికి నేత్ర పరీక్షలు

» వారంలో మరో 2 లక్షల మందికి

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులు కంటి చూపు సమస్యను ఎదుర్కొంటున్నారు. తరగతి గదిలో బోర్డుపై ఏముందో కూడా సరిగ్గా గుర్తించలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు 2.10 లక్షల మందికి కంటి పరీక్షలు పూర్తి చేయగా.. 7 శాతం మందికి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆధ్వర్యంలో 'సమగ్ర కంటి పరీక్ష కార్యక్రమం' ఈ నెల 8న ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 13 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ముందస్తుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ట్రైబల్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌తోపాటు, సర్కారీ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. సుమారు 4,21,612 మంది విద్యార్థులకు టెస్టులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 2.10 లక్షల మందికి కంటి పరీక్షలు పూర్తి చేశారు. అందులో 1,33,648 మంది బాలికల్లో 10,704 (8 శాతం) మందికి కంటి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఇటు 77,320 మంది బాలురకు పరీక్షలు చేయగా.. అందులో 4,109 (5.31 శాతం) మందికి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా 2.10 లక్షల మంది విద్యార్థుల్లో.. 14,813 (7 శాతం) మంది విద్యార్థులకు ఆ సమస్య ఉన్నట్లు తేలింది. వేసవి సెలవులకు మరో వారం రోజులే సమయం ఉండటంతో ఈలోగా మరో 2 లక్షల మందికి కంటి పరీక్షలు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. స్కూళ్లు ప్రారంభమయ్యాక కంటి చూపు సమస్య ఉన్న అందరికీ కళ్లజోళ్లను అందించనున్నట్లు వెల్లడించారు.

'తులం బంగారం' పథకంపై అధ్యయనం

» తమిళనాడు వెళ్లొచ్చిన బీసీ సంక్షేమ శాఖ బృందం

» అక్కడ పథకం అమలు తీరుపై ఆరా

» నివేదిక సిద్ధం.. త్వరలోనే సర్కారుకు

» లోక్‌సభ ఎన్నికల తర్వాత నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెళ్లి చేసుకునే ఆడపిల్లలకు 'కల్యాణ' కానుక కింద నగదుతో పాటు తులం బంగారం కూడా త్వరలో అందనుంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఈ పథకం అమలయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర నివేదిక సిద్ధమైంది. పెళ్లి చేసుకునే ఆడపిల్లలకు 'కల్యాణమస్తు' పథకం కింద రూ.1,00,116లతో పాటు, తులం బంగారం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ పథకం అమలుకు సంబంధించిన అంశాలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే తులం బంగారం కానుక లాంటి పథకాన్ని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తోంది. తెలంగాణ అధికారులు అక్కడికి వెళ్లి అక్కడ అమలు చేస్తున్న పథకంపై అధ్యయనం చేసి, సమగ్ర నివేదికను రూపొందించాలని గతంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు బీసీ సంక్షేమ అధికారులు ఇటీవల తమిళనాడు రాజధాని చెన్నై వెళ్లి, పథకం అమలు తీరుపై అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలను తీసుకున్నారు. అన్ని అంశాలను పరిశీలించిన తెలంగాణ అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్నందున జూన్ 6 తరువాత నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. కాగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ 'కల్యాణలక్ష్మి' పథకానికి 'కల్యాణమస్తు' అని నామకరణం చేసింది. అయితే ఈ పథకం అమలు కోసం కొత్త కటాఫ్ తేదీని ప్రకటిస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

బంగారం సేకరణ ఎలా?

పెళ్లి చేసుకునే ఆడపిల్లలకు తమిళనాడు ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు, 8 గ్రాముల బంగారాన్ని కూడా కానుకగా అందిస్తోంది. పథకం లబ్ధిదారులను.. చదువుకున్న వారు, చదువుకోని వారు, రెండో పెళ్లి చేసుకునే వారు, అనాథ ఆడపిల్లలు, వితంతువుల కూతుర్లు.. ఇలా ఐదు కేటగిరీలుగా విభజించింది. కేటగిరీల వారిగా సాయం అందిస్తోంది. కుటుంబంలో ఒక్కరికే మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ఆడపిల్లలకు అందించే బంగారం కోసం టెండర్లను ఆహ్వానించింది. ఆ టెండర్లలో ఎవరైతే తక్కువ ధరకు కోట్ చేస్తారో వారిని ఎంపిక చేసి.. వారి దగ్గర నుంచి బంగారాన్ని తీసుకుంటారు. ఈ మొత్తాన్ని నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న శాఖ పర్యవేక్షిస్తుంటుంది. తమిళనాడులో అమలవుతున్న ఈ పథకం తీరు, లబ్ధిదారుల కేటగిరీలన్నింటిపై బీసీ సంక్షేమ శాఖ బృందం అధ్యయనం చేసింది. ఆడపిల్లలకు అందించే బంగారాన్ని ఏ రూపంలో సేకరిస్తున్నారన్నదానిపై ఆరా తీసింది. ఈ మేరకు అధికారులు నివేదికను సిద్ధం చేశారు.

మెజారిటీ సీట్లే లక్ష్యంగా బీజేపీ సీక్రెట్ ఆపరేషన్!

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో మారుతున్న సమీకరణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. బీజేపీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం సీక్రెట్ ఆపరేషన్‌లో భాగంగా నాలుగు దశల్లో ప్రత్యేక బృందాలు పనిచేస్తుండగా, ఇందులో ఒకటి (షాడో టీం) అభ్యర్థి వెన్నంటి కొనసాగుతోంది. ప్రధాని మోదీ హవా అంటూ జరుగుతున్న ప్రచారానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు.. ఏయే వర్గాలు ఈ నినాదంపై ఎక్కువ ప్రభావితమవుతున్నాయి? పార్టీ పట్ల, పోటీచేస్తున్న అభ్యర్థిపై స్థానికుల్లో ఉన్న అభిప్రాయం, కీలక ప్రాంతాలు, సామాజిక వర్గాల్లో మారుతున్న గ్రాఫ్, సొంత పార్టీ నేతలు, క్యాడర్ నుంచి లభిస్తున్న మద్దతు, పనిచేయని నేతలు, క్యాడర్ వివరాలు, పార్టీకి, అభ్యర్థికి ఎక్కడ పాజిటివ్‌గా ఉంది? ఎక్కడ పార్టీ బలహీనంగా ఉంది? అంశాలపై పార్టీ జాతీయ నాయకత్వానికి రోజువారీగా నివేదికలు వెళుతున్నాయి. ఇందుకు అనుగుణంగా ఇటు రాష్ట్ర నాయకత్వానికి, అటు సంబంధిత అభ్యర్థులకు సూచనలు వస్తున్నాయి. ఏయే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలో అప్రమత్తం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు జరుగుతున్న ప్రధాన రాజకీయ సంఘటనలను పార్లమెంటు నియోజకవర్గాల్లో పనిచేస్తున్న సర్వే బృందాలు నేరుగా ఢిల్లీకి నివేదిస్తున్నాయి. మరికొన్ని వివరాలను రాష్ట్ర పార్టీ కార్యాలయం కేంద్రంగా పనిచేస్తున్న బృందానికి అందజేస్తున్నాయి. వాటిపై సమగ్ర అధ్యయనం చేస్తున్న రాష్ట్ర పార్టీ కార్యాలయ బృందం, తిరిగి జాతీయ పార్టీకి నివేదిస్తోంది. ఇందుకోసం పార్టీ కార్యాలయంలో 40 మంది సభ్యులు ప్రత్యేకంగా పనిచేస్తున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. అభ్యర్థుల వెన్నంటి ఉంటున్న మరో బృందం ప్రచార సరళికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తోంది. ఇదే సమయంలో సదరు అభ్యర్థి ప్రచారం సందర్భంగా ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా అనుసరించాల్సిన కార్యాచరణపై జాతీయ కార్యాలయంలో మరో బృందం నిరంతరం సమన్వయం చేస్తోందని బీజేపీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. కొన్ని సందర్భాల్లో తమకు సైతం అందని సమాచారం, నేరుగా ఢిల్లీ నుంచి వస్తోందని పార్టీ అభ్యర్థి ఒకరు వెల్లడించారు. కాగా, పార్టీలో చేరికలు, పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళుతున్న నేతల ప్రభావం పైనా ప్రత్యేక బృందాలు జాతీయ నాయకత్వానికి నివేదిస్తున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చిన అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడం వల్ల స్థానికంగా సొంత పార్టీ నేతలు ఎంతమేర మద్దతు ఇస్తున్నారు? క్యాడర్ వైఖరి, స్థానికుల అభిప్రాయం ఎలా ఉంది? వంటి అంశాలపై ప్రత్యేక బృందాలు నివేదిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మహబూబ్‌నగర్, మెదక్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో పలువురు సీనియర్ నేతలు గడచిన పది రోజుల్లో హస్తం గూటికి చేరారు. వీరిలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన 9 మంది అభ్యర్థులు కూడా ఉన్నారు. మరికొందరు నేతలు కూడా కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశం ఉందని ప్రత్యేక సర్వే బృందాలు జాతీయ నాయకత్వానికి నివేదించినట్లు సమాచారం.

వారంలోగా మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక!

» రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం

» నివేదిక ఆధారంగా మరమ్మతులపై నిర్ణయం

» మేడిగడ్డ మరమ్మతులకు కాఫర్ డ్యామ్ కట్టాల్సి ఉంటుందని ఇదివరకే సూచించిన ఎన్‌డీఎస్‌ఏ

హైదరాబాద్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై వారం రోజుల్లోగా నివేదిక అందించనున్నట్లు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) తెలంగాణ ప్రభుత్వానికి సమాచారమిచ్చింది. దీంతో బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణలో కదలిక వచ్చినట్లయింది. కొద్ది రోజుల క్రితం ఎన్‌డీఎస్‌ఏ రాష్ట్రంలో పర్యటించి ఈ బ్యారేజీలతో సంబంధం ఉన్న వారందరిని ప్రశ్నించి సమాచారం రాబట్టింది. దాదాపు 8 బస్తాల నిండా పత్రాలను ఎన్‌డీఎస్‌ఏ అధికారులకు బట్వాడా చేశారు. హార్డ్, సాఫ్ట్‌కాపీల రూపంలో సమాచారం కోరినా అందించారు. దీంతో ఈ సమాచారం, పర్యటనలో రాబట్టిన వివరాలతో నివేదికను వారం రోజుల్లోపు అందించనున్నట్లు ఎన్‌డీఎస్‌ఏ సంకేతాలిచ్చింది. కాగా ఈ బ్యారేజీలను ఏవిధంగా మరమ్మతులు చేయాలనే దానిపై ఏజెన్సీలతో ప్రభుత్వం ఇటీవలే సమావేశమైంది. అయితే మేడిగడ్డకు మరమ్మతులు చేయాలంటే బ్యారేజీ ఎగువ భాగంలో కాఫర్ డ్యామ్ కట్టాల్సి ఉంటుందని ఎన్‌డీఎస్‌ఏ ఇదివరకే పేర్కొంది. కాగా కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయినందువల్ల ఏ పనులు చేయాలన్నా చెల్లింపులు తప్పనిసరి అని ఎల్ అండ్ టీ ప్రభుత్వానికి ఇదివరకే తేల్చి చెప్పింది. అయితే కాఫర్ డ్యామ్ నిర్మాణం కూడా ఎల్ అండ్ టీ స్వచ్ఛందంగా కడుతుందా? లేక ప్లేటు ఫిరాయిస్తుందా అనేది తెలియాల్సి ఉంది. ఇక అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ అప్రాన్ల కింద రంధ్రాలను పూడ్చేందుకు నిర్మాణ సంస్థలు సమ్మతి తెలిపినట్లు సమాచారం. అయితే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగానే బ్యారేజీల పునరుద్ధరణ/మరమ్మతులు ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల డ్రగ్స్ దందా

» సులభంగా డబ్బు సంపాదన కోసం మత్తు పదార్థాల విక్రయాలు

» అరెస్ట్ చేసిన మాదాపూర్ పోలీసులు

» రూ.4.20 లక్షల విలువైన 28 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులైన ఆ ఇద్దరు ఉన్నత కుటుంబాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు! డ్రగ్స్ అలవాటు ఇద్దరి మధ్య స్నేహం కుదిరేలా చేసింది. అదే అలవాటు.. తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రయాలకూ పురిగొల్పింది!! బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 'సరుకు'తో వచ్చినా తమకు కస్టమర్లు ఉన్న రాజమండ్రిలో విక్రయించేందుకు ఎన్నికల కోడ్ కారణంగా అక్కడ నిఘా ప్రతిబంధకంగా మారడంతో గ్రేటర్ పరిధిలోనే అమ్మేయాలనుకున్నారు. ఆ ప్రయత్నాల్లో ఉండగానే పోలీసులకు దొరికిపోయారు. ఆ ఇద్దరు.. ఏపీలోని రాజమండ్రికి చెందిన కాటూరి సూర్య కుమార్ (22), గుత్తుల శ్యాంబాబు (22). సూర్య తండ్రి రైల్వేలో ఇంజనీర్, ఇంజనీరింగ్ చదివేందుకు సూర్య బెంగుళూరులోని జైన్ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ బెంగుళూరుకు చెందిన స్నేహితుడు అభి ద్వారా ఎండీఎంఏ డ్రగ్స్‌కు సూర్య అలవాటు పడ్డాడు. ఆ తర్వాత తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు సూర్య డ్రగ్స్ అమ్మకాలు మొదలుపెట్టాడు. నిరుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్న సూర్యను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. మూడు నెలలు జైల్లో ఉన్నా బుద్ధి మార్చుకోని సూర్య మళ్లీ డ్రగ్స్ దందా మొదలు పెట్టాడు. సూర్యకు నైజీరియన్ డ్రగ్ స్మగ్లర్ గాడ్ ఆఫ్ సోల్మెన్‌ను అభి పరిచయం చేశాడు. ఆ నైజీరియన్ నుంచి ఎండీఎంఏ కొన్న సూర్య, తన మరో స్నేహితుడు గుత్తుల శ్యాంబాబుకు డ్రగ్స్ తీసుకోవడాన్ని అలవాటు చేశాడు. అతడి సాయంతో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు ఎండీఎంఏ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నాడు. సూర్య ఈనెల 14న బెంగళూరు వెళ్లి సోల్మెన్‌ను కలిసి 30 గ్రాముల ఎండీఎంఏ కొన్నాడు. 16న నగరానికి వచ్చాడు. స్నేహితుడు శ్యాంబాబును నగరానికి పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి 2 గ్రాముల ఎండీఎంఏను సేవించారు. మిగతా 28 గ్రాముల డ్రగ్స్‌ను విక్రయించాలని పథకం వేశారు. ఎన్నికల సందర్భంగా రాజమండ్రిలో పోలీసు నిఘా ఉంటుందని భావించి హైదరాబాద్‌లోనే విక్రయించాలని ప్రయత్నించారు. ఈ ఇద్దరి గురించి పక్కా సమాచారమందుకున్న మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు, మాదాపూర్ పోలీసులతో కలిసి వలపన్నారు. మాదాపూర్‌లోని చంద్రానాయక్ తండా, రాజారెసిడెన్సీ సమీపంలో ఎండీఎంఏ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సూర్యకుమార్, శ్యాంబాబును అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 4.20 లక్షల విలువైన 28 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు.



లోక్‌సభ ఎన్నికలకు కిసాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు నిర్వహించేందుకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను కిసాన్ కాంగ్రెస్ నియమించింది. అయితే అర్బన్ నియోజకవర్గాలైన హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరీలను మాత్రం మినహాయించింది. మిగిలిన 14 రూరల్ నియోజకవర్గాలకు 14 మందిని ఇన్‌చార్జీలుగా నియమించింది. అలాగే ఈ 14 నియోజకవర్గాలను ఆరు జోన్లుగా విభజించి.. ఒక్కో జోన్‌ను ఒక బాధ్యుడికి అప్పజెప్పింది. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అఖిలేష్ శుక్లా ఈ నియామకాలు జరిపారు.

బీజేపీ అభ్యర్థుల నామినేషన్లకు ఢిల్లీ నుంచి నేతలు

పలువురు కేంద్ర మంత్రుల రాక

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో పాటు నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో గురువారం నుంచి భారీ సభలు, ర్యాలీలతో నామినేషన్లు దాఖలు చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు చెబుతున్నారు. తొలిరోజు మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, మెదక్ స్థానాల బీజేపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు నామినేషన్లు వేస్తారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్కాజిగిరిలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్, మెదక్‌లో గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొననున్నారు. గురువారం సాయంత్రం సికింద్రాబాద్ సిక్ విలేజ్ జువెల్ గార్డెన్‌లో మాజీ సైనికులతో జరిగే సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

- 19న సికింద్రాబాద్, ఖమ్మం అభ్యర్థులు కిషన్ రెడ్డి, వినోద్‌రావు నామినేషన్లు వేయనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారు.
- 22న కొండా విశ్వేశ్వరరెడ్డి (చేవెళ్ల), సైదిరెడ్డి (నల్లగొండ) నామినేషన్లు వేయనుండగా, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ రానున్నారు. బీబీ పాటిల్ (జహీరాబాద్) నామినేషన్‌కు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, సీతారాం నాయక్ (మహబూబాబాద్) నామినేషన్‌కు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు హాజరుకానున్నారు.
- 23న భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ వేయనుండగా జాతీయ నాయకత్వం తరఫున ఎవరు వస్తారో తెలియాల్సి ఉంది. 24న గోమాసే శ్రీనివాస్ (పెద్దపల్లి), అరూరి రమేశ్ (వరంగల్) నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ హాజరుకానున్నారు. అదే రోజు నగేష్ (అదిలాబాద్) నామినేషన్‌కు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, మాధవీలత (హైదరాబాద్) నామినేషన్‌కు కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ రానున్నారని పార్టీ నాయకులు తెలిపారు.
- 25న బండి సంజయ్ (కరీంనగర్), భరత్ (నాగర్‌కర్నూల్) నామినేషన్లలో పాల్గొనేందుకు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కిషన్ రెడ్డి హాజరవుతుండగా, అరవింద్ (నిజామాబాద్) నామినేషన్ రోజున అశ్వినీ వైష్ణవ్ హాజరుకానున్నారు.

అందరికీ జీవన్మరణమే!

(మొదటి పేజీ తరువాయి)

ఆధారపడి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన నేతలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పొత్తులో భాగంగా పోటీ చేసి సీపీఐ తరఫున గెలిచిన ఒక ఎమ్మెల్యే కూడా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగానే ఉన్నారు. మరోవైపు ఏడు సీట్లలో గెలిచిన ఎంఐఎం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని ప్రకటించింది. వీరికితోడు బీఆర్ఎస్ తరఫున గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులను బట్టి చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేళ్లపాటు ఏలాంటి ఢోకా ఉండకూడదు. కానీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోతుందంటూ కొంత మంది రాజకీయ నేతలు ప్రచారం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువ మంది గెలవకపోతే.. రాజకీయంగా మార్పులు చోటుచేసుకుంటాయని, ప్రభుత్వం కూలిపోవడానికి అదే కారణమవుతుందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా బీజేపీ రూపంలో పెనుసవాల్ ఎదురవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో ప్రభుత్వ సుస్థిరతకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుందని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ పరిణామాలను అంచనా వేసిన కాంగ్రెస్ పెద్దలు.. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలుచుకునేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ముఖ్యంగా రెండంకెల స్థానాల్లో గెలుపొందడం ద్వారా ఐదేళ్లపాటు రాష్ట్రప్రభుత్వాన్ని సాఫీగా నడపవచ్చని భావిస్తున్నారు. దీంతోపాటు దక్షిణాదిన అత్యధిక సీట్లు గెలవాలనుకుంటున్న కాంగ్రెస్ జాతీయ నాయకత్వం.. తెలంగాణలో వీలైనన్ని ఎక్కువ స్థానాలను ఆశిస్తోంది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర నాయకత్వం అనేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పలు పార్లమెంట్ స్థానాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించింది.

బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే..

తెలంగాణలో బలమైన శక్తిగా ఎదగాలని భావిస్తున్న బీజేపీకి కూడా పార్లమెంటు ఎన్నికలు సవాల్‌గా మారాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలిచారు. అయితే ఆ వెంటనే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా నలుగురు ఎంపీలు గెలుపొందారు. అనంతరం మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలను గెలుచుకుంది. అయితే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో రాష్ట్రంలో ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించుకోవాలని భావిస్తోంది. అప్పుడే.. తదుపరి అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేస్తోంది. ఇదంతా జరగాలంటే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో అధిక సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది. 2019 ఎన్నికల్లోనే నాలుగు ఎంపీ సీట్లు గెలిచినందున.. ఇప్పుడు అంతకు రెట్టింపు కంటే ఎక్కువ సీట్లను కైవసం చేసుకోవాలనే ఉద్దేశాన్ని బీజేపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ హవా కొనసాగుతోందని, అది కూడా తమకు రాష్ట్రంలో సానుకూలాంశం కానుందని పేర్కొంటున్నారు. మరోవైపు ఈసారి ఉత్తరాదిన పార్టీకి సీట్లు తగ్గితే.. ఆ లోటును దక్షిణాదిలో పూడ్చుకోవాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. దాంతో తెలంగాణపై జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది.

బీఆర్ఎస్ ఉనికి కాపాడుకోవాలంటే..

మొన్నటి వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పరిస్థితి విచిత్రంగా తయారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయాక తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటోంది. సిటింగ్ ఎంపీలు కూడా పార్లమెంటు ఎన్నికల్లో తిరిగి పోటీ చేయడానికి ముందుకు రాలేదు. దాంతో చాలా సిటింగ్ స్థానాల్లో ఇతరులను రంగంలోకి దింపాల్సి వచ్చింది. మరోవైపు పార్టీ క్యాడర్ కూడా పూర్తి స్థాయి నమ్మకంలో లేదు. ఎంపీలు, ఎమ్మెల్యేల దగ్గర్నుంచి కిందిస్థాయి కార్యకర్తల దాకా చాలా చోట్ల పార్టీ మారారు. ఇంకా పార్టీలో ఉన్నవారు కూడా రంగంలోకి దిగి పోరాడే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే.. భవిష్యత్తులో పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు పెను సవాల్‌గా మారాయి. ముఖ్యంగా వచ్చే ఐదేళ్లపాటు పార్టీ ఉనికిలో ఉండాలంటే గౌరవప్రదమైన సంఖ్యలో ఎంపీ స్థానాలను గెలుచుకోవాల్సి ఉంటుంది. కనీసం గౌరవ ప్రదమైన సంఖ్యలోనైనా ఎంపీ స్థానాలను గెలుచుకోవాల్సి ఉంటుంది. అలా జరగని పక్షంలో ఓవైపు నుంచి కాంగ్రెస్, మరోవైపు నుంచి బీజేపీతో బీఆర్ఎస్‌కు ముప్పు పొంచి ఉంటుంది.



నేటి నుంచే నామినేషన్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు తెలుగు రాష్ట్రాల్లో నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తుండగా.. తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లో నాలుగో దశలో జరగనున్నాయి. ఈ దశలో దేశంలోని 96 స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. వీటికి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగుస్తుంది. కాగా, గురువారం.. క్రోధి నామ సంవత్సరం.. చైత్రమాసం.. శుక్లపక్షం.. మఖ నక్షత్రం.. దశమి.. మంచిరోజు కావడంతో తెలంగాణలో ఎక్కువ మంది తొలి రోజే నామినేషన్లు దాఖలు చేయటానికి సిద్ధమవుతున్నారు. పండితులు చెబుతున్న దాని ప్రకారం.. ఈ నెల 26 తేదీ వరకే మంచి రోజులు, ముహూర్తాలు ఉన్నాయి. అయితే మంగళ, బుధవారాల్లో అష్టమి, నవమి కూడా వెళ్లిపోయింది. మరుసటి రోజు దశమిని విజయానికి సంకేతంగా భావిస్తారు. గురువారం ఉదయం 9.40 గంటల నుంచి శుభఘడియలు ప్రారంభమవుతాయి. దీంతో అభ్యర్థులు ఇదే రోజు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, తొలిరోజు మాత్రం పెద్దగా జన సమీకరణ లేకుండా ముహూర్త సమయం చూసుకొని నామినేషన్లు దాఖలు చేసేందుకు కొందరు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఆ తర్వాత మందీమార్బలంతో అట్టహాసంగా నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మంచిరోజు కావటంతో గురువారం ఒక సెట్ నామినేషన్ వేసి.. ఆ తర్వాత మరో ఒకటి, రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాగా, నాలుగో దశలో తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలతోపాటు ఒక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలతోపాటు 175 అసెంబ్లీ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎలాంటి అవాంతరాలు లేకుండా గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్వోలు, ఏఆర్వోలు, కలెక్టర్లను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు చేపట్టాలని సూచించారు. 18వ తేదీ ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. అదనపు సీఈవో లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అన్ని కార్యాలయాల్లో అందుబాటులోకి తేవాలని చెప్పారు.



కాంగ్రెస్‌కు ప్రజాగ్రహం తప్పదు

- హామీలపై మహిళలు, రైతుల్లో కోపం
- రాష్ట్రంలో బీజేపీకి రెండంకెల ఎంపీ సీట్లు: లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజాగ్రహం తప్పదని, ఆ పార్టీకి బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, దీంతో మహిళలు, రైతులు ఆ పార్టీ పట్ల కోపంతో ఉన్నారని చెప్పారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయిందని, లోక్‌సభ ఎన్నికల తరువాత దక్షిణ భారతదేశంలోనూ కాంగ్రెస్ కనిపించదన్నారు. మోదీ, బీజేపీకి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు అంతా ఏకమై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ రెండంకెల సీట్లు సాధిస్తుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు లిక్కర్ స్కామ్‌లో కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించిన సీఎం రేవంత్.. ఇప్పుడు ఆమెకు బెయిల్ ఇప్పించేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారని, కాంగ్రెస్ నేతలు అర్థం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. ఇండియా కూటమిలో ఉన్న పార్టీలే కాంగ్రెస్‌ను గుర్తించడంలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌ది లిల్లీపుట్ మనస్తత్వం

- టీపీసీసీ నేత మల్లు రవి

హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ది లిల్లీపుట్ మనస్తత్వమని, అందుకే ఆయనకు అధికారం పోయి.. ఆ పార్టీ ఖాళీ అయిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాశమంత మనసున్నోడని, అందుకే ప్రజలు కేసీఆర్‌ను దించి, ఆయనకు అధికారాన్ని అప్పగించారని తెలిపారు. కేసీఆర్ అహంకారం, అనాలోచిత నిర్ణయాల కారణంగానే రాష్ట్రం దివాళా తీసిందని, ఆయన పార్టీ కూడా ఖాళీ అయిందని విమర్శించారు. కేసీఆర్ తన అహంకారపు మాటలతో పార్టీలో ఉన్న వాళ్లు కూడా ఊడ్చుకుపోయేలా చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.



లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదు

- ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని రాష్ట్రప్రభుత్వ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జోస్యం చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కూడా ఉండదంటూ మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడడం ఆయన అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న సర్కారు ఉండదని చెప్పడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని పేర్కొన్నారు. సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో కేసీఆర్ గడిచిన పదేళ్లలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టి పెట్టి రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 10 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు గ్యారెంటీలను వందరోజుల్లోనే అమలు చేసి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలుస్తున్నారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 19న జరిగే సీఎం సభకు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ ఎంపీయే ప్రధాని

రాహుల్ 20 ఏళ్లు పీఎంగా ఉంటారు.. ఇవి ఎన్నికలు కాదు.. మోదీపై యుద్ధం

- తెలంగాణలో 14 సీట్లు గెలుస్తున్నాం
- దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఎప్పుడో బహిష్కరించాయి
- వయనాడ్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): "పదేళ్లుగా దేశ ప్రధానమంత్రిగా వారాణసీ ఎంపీ నరేంద్ర మోదీ ఉన్నారు. ఇక వయనాడ్ నుంచి ఎంపీగా గెలవనున్న రాహుల్ గాంధీ ప్రధాని పదవి చేపట్టబోతున్నారు. రానున్న 20 సంవత్సరాల వరకు ఆయనే పీఎంగా ఉంటారు" అని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీగా పోటీ చేస్తున్న కేరళలోని వాయనాడ్‌లో బుధవారం కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ప్రజలకు భరోసా కల్పించేందుకు దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని అని చెప్పారు. ఇవి ఎన్నికలు కావు.. నరేంద్ర మోదీపై యుద్ధం అని, ఈ యుద్ధంలో గెలవాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లను గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతిలో చాంపియన్ అని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్లు పారదర్శకత కోసమే తెచ్చామని మోదీ చెబుతున్నారని, అదే నిజమైతే సుప్రీంకోర్టు ఈ వ్యవస్థను ఎందుకు రద్దు చేసిందని ప్రశ్నించారు. బాండ్ల పేరుతో బీజేపీ విచ్చలవిడి అక్రమాలకు, చట్టబద్ధమైన అవినీతికి పాల్పడుతోందన్నారు. పారదర్శకత ఉంటే ఎన్నికల బాండ్లు కొన్న వారిని, ముఖ్యంగా బీజేపీకి డబ్బులు ఇచ్చిన వారి పేర్లను బయటపెట్టాలన్నారు. ఎన్నికల బాండ్లు ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ పథకమని ఆరోపించారు. ఈవీఎంలపై ప్రజలతోపాటు విపక్షాలకూ నమ్మకం పోయిందని, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలంటే ప్రధాని మోదీ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.



వాయనాడ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

దక్షిణాది రాష్ట్రాలపై మోదీ దౌర్జన్యం

గత పదేళ్లలో ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాలపై దౌర్జన్యాలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలోని మొత్తం రాష్ట్రాలకు ఇచ్చిన నిధులెన్ని..? దక్షిణాది రాష్ట్రాలకు ఎంతిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలు భారత్‌లో అంతర్భాగం కాదా? ఇంతకాలం ఎందుకు వివక్ష చూపించారని నిలదీశారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతానికి రాని ప్రధాని కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే పర్యటనలు చేస్తూ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలకు బుల్లెట్ ట్రైన్లు ఎందుకు ఇవ్వలేదని, సబర్మతి తరహాలో రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఓటు అడిగే కనీస హక్కు బీజేపీకి, ప్రధాని మోదీకి లేదన్నారు. దక్షిణాదికి ఏమిచ్చారని ఓటు వేయాలని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులే కాదు.. రాజకీయ పదవుల విషయంలోనూ దక్షిణాది రాష్ట్రాలపై మోదీ వివక్ష చూపించారని ఆరోపించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర హోం మంత్రి, రక్షణ మంత్రి.. వంటి కీలక పదవుల్లో దక్షిణాది వారిని ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఎప్పుడో బహిష్కరించాయని ఆయన వ్యాఖ్యానించారు.

పినరయి అవినీతితోనే అభివృద్ధి ఆగింది

కేరళ ప్రజలకు తెలివికలవారని, కష్టపడే తత్వం ఉంటుందని, ఇక్కడి ప్రజల కష్టంతో దుబాయ్ అభివృద్ధి చెందుతున్నా.. కేరళలో మాత్రం అభివృద్ధి లేదని రేవంత్ రెడ్డి అన్నారు. దీనికి ప్రధాన కారణం ఇక్కడ అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) అని ఆరోపించారు. సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యుల అవినీతితో రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదని, గోల్డ్ స్మగ్లింగ్ కేసులో సీఎం పేరుండటం సిగ్గుచేటన్నారు. వాయనాడ్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఎల్డీఎఫ్ అభ్యర్థికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎందుకు మద్దతు ఇవ్వట్లేదని నిలదీశారు. బీజేపీ అభ్యర్థి సురేంద్రన్‌కు అండగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబాన్ని ఓడిస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చెప్పామని, దాన్ని నిజం చేసి చూపించామని రేవంత్ రెడ్డి చెప్పారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులతో నేడు కేసీఆర్ భేటీ



హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులతో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేడు తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు కేసీఆర్ మార్గదర్శనం చేయనున్నారు. అలాగే పార్టీ అభ్యర్థులకు బీ ఫారాలు, ఎన్నికల ఖర్చుకోసం ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చొప్పున చెక్కులను కేసీఆర్ అందజేయనున్నారు.

ఖమ్మం, పాలమూరుకు బీఆర్ఎస్ సమన్వయకర్తలు

- పేర్లు ప్రకటించిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా... మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉప్పల్ వెంకటేశ్ గుప్త, జడ్చర్లకు ఇబ్రహీం, మక్తల్ ఎండీ సలీం, దేవరకద్ర పల్లె రవికుమార్, కొడంగల్ వెంకటేశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, నారాయణపేటకు రాజా వరప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా ఖమ్మం పార్లమెంటు స్థానానికి గానూ పాలేరుకు తాత మధు, ఖమ్మంకు కురాకుల నాగభూషణం, వైరా తాళ్లూరి జీవన్, మధిర కొండబాలకోటేశ్వరరావు, కొత్తగూడెం ఉప్పలపాటి వెంకటరమణ, సత్తుపల్లి బీరెడ్డి నాగచంద్రరెడ్డి, అశ్వారావుపేట కోనేరు చిన్నిని సమన్వయకర్తలుగా నియమించినట్లు కేటీఆర్ వెల్లడించారు.

దళితులు, బీసీలపై మజ్లిస్ దృష్టి!

- బీజేపీ నుంచి గట్టిపోటీ... ప్రచార వ్యూహం మార్చేసిన ఒవైసీ

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీవర్గం ఓట్లపైనే ఆధారపడి ఇప్పటివరకు రాజకీయాలు నెరపుతున్న మజ్లిస్, ఈ లోక్‌సభ ఎన్నికల్లో దళితుల ఓట్లను ఆకర్షించేందుకు వ్యూహాత్మకంగా అడుగులువేస్తోంది. జాతీయ రాజకీయాల్లో ముస్లిం మైనారిటీవర్గం గొంతుగా గుర్తింపు పొందిన మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ సిటింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈసారి ఆ స్థానంలో బీజేపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలత నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. పైగా బీజేపీ అగ్రనేత అమిత్‌షా హైదరాబాద్ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించి పావులు కదుపుతుండటం.. ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఒవైసీని ఓడించేందుకు అవసరమైన అన్ని రాజకీయ శక్తులను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మైనారిటీయేతరవర్గంలో అత్యధికశాతం దళితులుండటంతో ఒవైసీ ప్రచార వ్యూహాన్ని మార్చారు. దళిత, బీసీ ఓటర్లను ఆకర్షించడంపై దృష్టిపెట్టారు. గత శాసనసభ ఎన్నికలవరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసిన మజ్లిస్, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీతో సన్నిహితంగా మెలుగుతోంది. మజ్లిస్‌కు అనుకూలంగా వ్యవహరించేందుకే కాంగ్రెస్, హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని ఖరారు చేయకుండా జాప్యం చేస్తోందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ-కాంగ్రెస్‌కు సమదూరంగా ఉంటూ మధ్యేవాదంగా దళితులు, బడుగు వర్గాలనాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటూ ఒవైసీ తన ఉపన్యాసాల్లో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఇక పాదయాత్రలతో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టిన ఒవైసీ దళితులు, బడుగు వర్గాలు అత్యధికంగా నివసించే మురికివాడల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటున్నారు. ప్రధానంగా చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా సెగ్మెంట్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీ సిఫారసు మేరకు దళితబంధు, డబుల్‌బెడ్ రూం తదితర పథకాల్లో ప్రయోజనం పొందిన దళితులు, బీసీ వర్గాలతో ప్రత్యేకసమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం మహారాష్ట్రలో రెండ్రోజుల పాటు పర్యటించిన ఒవైసీ, అకోలా స్థానం నుంచి పోటీచేస్తున్న బీఆర్ అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్‌కు మద్దతు ప్రకటించారు. ముస్లిం మైనారిటీలు ప్రకాశ్ అంబేడ్కర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్‌లో చేరిన టీఎస్‌టీడీసీ మాజీ చైర్మన్

బీఆర్ఎస్ పార్టీ నేత, టీఎస్‌టీడీసీ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస‌గుప్తా బుధవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి రోహిత్ చౌదరి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోహిత్ చౌదరి మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుచుకోనుందని ధీమా వ్యక్తం చేశారు. ఉప్పల శ్రీనివాస‌గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మల్‌రెడ్డి రాంరెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

బీఎస్పీలోకి మాజీ ఎంపీ జగన్నాథం

- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా బీ ఫారం అందజేత



మాయావతి సమక్షంలో బీఎస్పీలో చేరిన మాజీ ఎంపీ మంద జగన్నాథం

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు మంద జగన్నాథం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో చేరారు. రాజస్థాన్‌లోని హల్‌హర్‌లో బుధవారం బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆమె.. జగన్నాథంకు పార్టీ బీ ఫారం కూడా అందజేశారు. ఆయన వెంట పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ రాంజీగౌతమ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ తదితరులున్నారు.

అబ్బ-ఛా!



నన్ను గెలిపిస్తే... మీరు షాకవుతారు!

రాష్ట్రంలో 30 సీట్లు గెలిపిస్తే నేనే సీఎం. గాజువాక నుంచి ఎమ్మెల్యే... విశాఖ ఎంపీగా పోటీ చేస్తా. నన్ను గెలిపిస్తే మీరు షాకవుతారు. విశాఖను వాషింగ్టన్ డీసీ... ఆంధ్రాను అమెరికా చేసి చూపిస్తా. చీకటి కావాలంటే ప్రతిపక్షాలను... వెలుగు కావాలంటే నన్ను గెలిపించండి.

- కేఏ పాల్ (ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు)



ఏ నాయకుడికైనా సొంత రాష్ట్రంపై ప్రేమ ఉంటుంది... ఉండాలి. కానీ... రాష్ట్ర ప్రతిష్ఠను దేశ విదేశాల్లో ఇనుమడింపజేయాలనే ఆసక్తి, ఇష్టం లేని ఏకైక ముఖ్యమంత్రి బహుశా జగన్మోహన్ రెడ్డి ఒక్కరే! ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు అప్పులు చేసి బటన్ నొక్కడం తప్ప... రాష్ట్రానికి మేలు చేయాలనే ఆలోచన ఏ కోశానా కనిపించదు!

ఏ ముఖ్యమంత్రయినా ఢిల్లీకి వెళితే అక్కడ జాతీయ మీడియాతో మాట్లాడతారు. రాష్ట్రంలోని సానుకూల పరిస్థితులు, అవకాశాలు, అభివృద్ధి గురించి చెబుతారు. ఇది... స్టేట్ బ్రాండ్‌ను ప్రమోట్ చేయడంలో భాగం. కానీ... జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజుల్లో ఒకేఒక్కసారి మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత... చీకట్లో ఢిల్లీ పెద్దలను కలిసి, మళ్లీ ఫ్లైటు ఎక్కేయడమే! దీంతో... జాతీయ మీడియా ప్రతినిధులకు అదేపనిగా గుర్తు చేసుకుంటే తప్ప 'ఆంధ్రప్రదేశ్' అనే రాష్ట్రముందని తెలియని పరిస్థితి.



'దావోస్ ఆర్థిక సదస్సుకు ఎందుకు వెళ్ల లేదు?
హబ్బా... అక్కడ మైనస్ డిగ్రీల చలి ఉంటుంది. స్నానం కూడా చెయ్యలేం తెలుసా!

పెట్టుబడులు ఎందుకు రావడంలేదు?
ఇప్పుడే కదా కోడి గుడ్డు పెట్టింది. అది పొదగాలి... ఎదగాలి...

అమర్‌రాజా దండం పెట్టి వెళ్లిపోయింది కదా!?
మేమే దండం పెట్టి... వెళ్లిపొమ్మన్నాం!

పెట్టుబడులపైనా... నవ్యాంధ్రను దేశ విదేశాల్లో ప్రమోట్ చేయడంపైనా జగన్ సర్కారు వైఖరి తెలుసుకునేందుకు ఈ మూడు ముక్కలు చాలు! దీని ఫలితం... ప్రపంచపటంలో ఆంధ్రప్రదేశ్ ఎవరూ పట్టించుకోని, ఎవరి స్మృతిలోనూ లేని అనామక, అనాథ ఆంధ్రగా మారిపోయింది.

ANDHRA PRADESH
India's Sunrise State

ఏపీ బ్రాండ్: అప్పుడు
- అమరావతి
- సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్
- అభివృద్ధి - సంక్షేమం

ఏపీ బ్రాండ్: ఇప్పుడు
- 'జే' బ్రాండ్ మద్యం
- దాడులు, దౌర్జన్యాలు, కేసులు
- బటన్ నొక్కుడు



ఏపీకి దిక్కెవరు?

దేశ, విదేశాల్లో అనాథగా ఆంధ్రప్రదేశ్ | నవ్యాంధ్ర బ్రాండ్‌కు బ్యాడ్.. బ్యాండ్

- 'సన్‌రైజ్ స్టేట్'గా తొలి ఐదేళ్లు ప్రచారం
- అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరిచయం
- కొత్త రాష్ట్రంవైపు చూసేలా చేసిన ప్రమోషన్
- పారిశ్రామిక ప్రతినిధుల రాకతో రాష్ట్రంలో సందడి
- జగన్ రాగానే ఒక్కసారిగా మారిన పరిస్థితి
- ఒకే ఒక్కసారి దావోస్‌కు వెళ్లిన జగన్
- విశాఖ సదస్సూ ఒక్కసారితో సరి
- విదేశీ ప్రముఖులతో భేటీలూ లేవు
- 'ఏపీ' ఉందని మరిచిపోయే పరిస్థితి
- ఇదే కొనసాగితే కోలుకోలేనంత డ్యామేజ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2000 మార్చి 19 నుంచి 25 మధ్య.. అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటన ఖరారైంది.

ఆయన.. ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, ముంబైతోపాటు హైదరాబాద్‌కు కూడా వస్తున్నారని తెలిసింది.

అమెరికా అధ్యక్షులెవరైనా ఢిల్లీలో దిగుతారు. వాణిజ్య రాజధాని ముంబైకీ వెళతారు. తాజ్‌మహల్ ముందు ఫొటో దిగకుంటే వాళ్ల టూర్ పూర్తయినట్లు కాదు. మరి... హైదరాబాద్‌కు ఎందుకు వచ్చినట్లు!? అక్కడేముంది?

ఇవే ప్రశ్నలు అమెరికాతోపాటు అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తల్లో తలెత్తాయి. వారిలో చాలా మంది తొలిసారిగా 'వాటీజ్ హైదరాబాద్' అని ఇటువైపు చూశారు. అక్కడేముంది, అక్కడి ప్రభుత్వ విధానాలు ఏమిటి, మనకు ఉన్న అవకాశాలేమిటి.. ఆరాలు మొదలయ్యాయి. దీనికి... అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తోడైంది. ఫలితం... మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. ఇది... భాగ్యనగర 'ఐటీ' ముఖచిత్రాన్ని మార్చిన పరిణామం! దీనికి కారణం... అనేక ప్రయత్నాలు, అప్పటి కేంద్ర ప్రభుత్వంతో లాబీయింగ్ ద్వారా బిల్ క్లింటన్ పర్యటనలో హైదరాబాద్‌ను చేర్చడమే!

గ్లోబలైజేషన్... ఎటు చూసినా పోటీ! రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య పెట్టుబడులకు పోటీ! ఈ పోటీలో ముందుకు వెళ్లాలంటే... ఒక బ్రాండ్ కావాలి! తెలంగాణకు హైదరాబాద్ ఒక బ్రాండ్. కర్ణాటకకు బెంగళూరు ఒక బ్రాండ్. తమిళనాడుకు చెన్నై ఒక బ్రాండ్! మరి... నవ్యాంధ్రకు బ్రాండ్ ఏమిటి?

ఇదీ 'బ్రాండ్' ఏపీ...

రాజధానిలేని రాష్ట్రంగా ఏర్పడిన నవ్యాంధ్రను చంద్రబాబు 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్'గా ప్రమోట్ చేశారు. ఏటా విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. క్రమం తప్పకుండా దావోస్ ఆర్థిక సదస్సుకు హాజరై ఏపీ పెవిలియన్ ద్వారా రాష్ట్రం పేరును ప్రపంచానికి పరిచయం చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న తానే మెడలో 'ఆంధ్రప్రదేశ్' ట్యాగ్ వేసుకుని, ఫైళ్లు పట్టుకుని, ప్రజంటేషన్ ఇచ్చారు. అనేక దేశాల్లోని ప్రముఖ నగరాల్లో 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో హోర్డింగ్‌లు పెట్టారు. బస్సులపై 'బ్రాండ్'ను ప్రమోట్ చేశారు. దాని ఫలితంగానే చంద్రబాబు హయాంలో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఏపీని సందర్శించారు. ఇక్కడి విధానాలు, అవకాశాలను పరిశీలించారు. భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టారు. ఇదే వాతావరణం, ఊపూ కొనసాగాల్సిన కీలక సమయంలో... ప్రభుత్వం మారిపోయింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతే...



'సదస్సు'ల్లో తుస్సు

జనం భాషలో చెప్పాలంటే... దావోస్ ఆర్థిక సదస్సు అనేది ఒక 'అంతర్జాతీయ సంత'లాంటిది. ప్రపంచ దేశాలకు చెందిన పాలకులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు ఒకచోట గుమికూడతారు. మనం ప్రతి దేశానికీ వెళ్లాల్సిన అవసరంలేకుండా... ఒక్కచోటే ఉండి అందరికీ మన గురించి చెప్పుకోగలిగే అవకాశం అక్కడే లభిస్తుంది. అందుకే... చంద్రబాబు ప్రతి ఏటా దావోస్ సదస్సుకు అధికారులతో హాజరయ్యారు. స్టేట్ బ్రాండ్‌ను ప్రమోట్ చేశారు. జగన్ వచ్చాక ఒకే ఒక్కసారి దావోస్‌కు వెళ్లారు. అది కూడా... సతీసమేతంగా లండన్‌కు వెళ్లి, అక్కడ కాస్త సొంత పనులు చేసుకుని, అక్కడి నుంచి ఇష్టంలేకుండా కష్టమ్మీద దావోస్‌లో అడుగుపెట్టారు. అక్కడికి వెళ్లి ఏమైనా సాధించారా అంటే... అదే అదానీ, అదే గ్రీన్‌కోలతో కుదిరిన పాత చింతకాయ పచ్చడి ఒప్పందాలే! 'ఏమయ్యా దావోస్‌కు వెళ్లలేదు' అని పరిశ్రమల మంత్రిని అడిగితే... 'అక్కడ మైనస్ డిగ్రీల చలి. స్నానం కూడా చెయ్యలేం' అంటూ కష్టాలు చెప్పుకొచ్చారు. ఇక... చంద్రబాబు సీఎంగా ఉండగా ఏటా విశాఖలో పెట్టుబడిదారుల సదస్సును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. జగన్ వచ్చాక దానికీ జెల్ల కొట్టారు. ఒకే ఒక్కసారి విశాఖ సదస్సు నిర్వహించారు. అక్కడ కూడా మళ్లీ పాత చింతకాయ పచ్చడి ఒప్పందాలే!

ఇక... బ్రాండ్ ఏపీని నిలబెట్టేదెలా?
ఏపీ ఒక అనాథలా ఉండాల్సిందేనా?

ఒకప్పుడు ఏపీ అంటే..

ఆంధ్రప్రదేశ్ అంటే ప్రగతిశీల, చైతన్యవంతమైన రాష్ట్రం. మెరుగైన విధానాలు, సుపరిపాలన, అభివృద్ధి, సంస్కరణల అమలుకు పెట్టింది పేరు. ఏ రాష్ట్రానికి ఏ అంశంలో సలహా కావాలన్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధానాలు అధ్యయనం చేసేవాళ్లు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా అదే ఒరవడి కొనసాగించేందుకు చంద్రబాబు ఎంతో కష్టపడ్డారు. ఆ కష్టం మొత్తం ఇప్పుడు బూడిదపాలైపోయింది.



నాడు 'బ్రాండ్ ఏపీ'ని ప్రమోట్ చేస్తూ విదేశాల్లో బస్సులపై మన యాడ్స్

ఇంతే సంగతులు..

పర్యాటకుల స్వర్గధామం కేరళ! అయినా సరే... ఆ రాష్ట్రం ఇతర రాష్ట్రాల్లో టూరిజం ప్రమోట్ చేస్తూనే ఉంటుంది. తమ రాష్ట్రంలోని సానుకూలతలు, బలాలు చెప్పుకోవడం ఏ ముఖ్యమంత్రికైనా అవసరం. జగన్‌కు మాత్రం ఇదో అనవసరమైన కార్యక్రమం. మన రాష్ట్రానికి ఉన్న సహజ వనరుల గురించి బయటి ప్రపంచానికి వివరించే ఏ ఒక్క కార్యక్రమమూ జగన్ హయాంలో జరగలేదు. ఒకసారి దావోస్ సదస్సుకు వెళ్లినా, విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించినా అది... నామ్‌కే వాస్తే!

బ్రాండ్‌కు బ్యాండ్

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే... ఏపీ బ్రాండ్‌కు బ్యాండ్ పడింది. వచ్చీ రాగానే 'ప్రజా వేదిక'ను కూల్చివేసి తన 'మార్కు' పాలన ఎలా ఉండబోతోందో శాంపిల్ వదిలారు. అది చంద్రబాబుపై ఉన్న రాజకీయ కక్షతో చేశారని వదిలేద్దామనుకుంటే... జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను బెదరగొట్టేలా వరుస విధ్వంసక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దుతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారింది. 'రివర్స్' టెండరింగ్‌లతో 'ఈ స్టేటు వైపు వెళ్లొద్దురో' అనేలా చేశారు. ఇక... అమరావతిని అటకెక్కించడమనే ఒక్క నిర్ణయంతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు!

కియా 'బ్రాండ్'పైనా...

కియా... ఒక బ్రాండ్. చంద్రబాబు నానా అగచాట్లు పడి కియా కార్ల పరిశ్రమను అనంతపురం జిల్లాకు తీసుకొచ్చారు. రికార్డు సమయంలో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమైంది. తొలి కారు ఆవిష్కరణ సమయంలో అందరూ ఆ వాహనంపై శుభ సందేశాలు రాశారు. కానీ... స్థానిక ఎంపీ గోరంట్ల మాధవ్ మాత్రం నిరసన నినాదం రాసి తమ సర్కారు వైఖరిని చాటుకున్నారు.

సమూహంలో ఒంటరిగా...

ఏ పార్టీకి చెందిన వారైనా ఇరుగు పొరుగు రాష్ట్రాల సీఎంల మధ్య సఖ్యత, సహకారం అవసరం. కానీ... జగన్‌కు ఇవేవీ పట్టవు. 'సొంత అజెండా'లు తప్ప రాష్ట్ర అజెండా గురించి పట్టదు. ఎప్పుడైనా ఢిల్లీలో సీఎంల సదస్సుకు వెళ్లినా... ఒంటరిగా కుర్చీలో కూర్చుని, అటుఇటూ దిక్కులు చూస్తూ, అదో లోకంలో ఉన్నట్లుగా ఉంటారు. ఇక.. ఏపీని పట్టించుకునేదెవరు?

టాక్ ఆఫ్ ది స్టేట్

పులివెందులే పలకడంలా!

అవినాశ్ ప్రచారానికి దూరందూరం
పొలం పని పేరుతో కాలక్షేపం
లింగాల మండలంలోనే మారిన సీన్

'పులివెందుల' చిత్రం మారుతోంది! 'కో' అంటే కోటిమంది, 'రా' అంటే లక్ష మంది వచ్చేస్తారనుకుని బరిలోకి దిగిన జగన్ శిబిరానికి అక్కడ చిత్రమైన అనుభవం ఎదురవుతోంది. 'ప్రచారానికి రాండిబ్బా' అని పిలిస్తే... 'పొలం పని ఉందన్నా' అని స్థానిక నేతలు మెల్లగా జారుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్ గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల్లో కొంతమేర పట్టున్న నేతలకు ఒకరోజు ముందే కబురు పెట్టారు. లింగాల మండలంలోని పెదకూడల, చినకూడల, గునకనపల్లె, లోపటినూతల, తాతిరెడ్డిపల్లి, కర్ణపాపాయ పల్లె గ్రామాల నేతలతో ఆయన నేరుగా మాట్లాడారు. అయినా లాభం లేకపోయింది. అందరూ పొలం బాట పడుతున్నట్లు చెప్పారు. దీంతో వాస్తవమేంటో కనుక్కురమ్మని అవినాశ్‌రెడ్డి కొందరు అనుచరులను పంపారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ వైసీపీ నేతలు చీనీ చెట్లలో కూర్చుని పేకాట ఆడుతున్న దృశ్యాలు వారికి కనిపించాయి. మరికొందరు అరటి తోటల్లో కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ కనపడ్డారు. ఎందుకిలా అని ఆరా తీస్తే... 'రాష్ట్రంలో వాళ్లే(టీడీపీ) గెలుస్తున్నారంట! గవర్నమెంట్ లేనప్పుడు పులివెందుల్లో మనం చేసేది ఏముందిలే! అయినా ఇప్పుడు అధికారంలో ఉండీ ఏం చేస్తున్నాం గనుక!' అని ముఖానే చెప్పేశారట. వైఎస్ కుటుంబానికి పులివెందుల నియోజకవర్గం కోట అయితే... లింగాల మండలం కంచుకోట! 1996లో కడప లోక్‌సభ స్థానంలో బరిలో నిలిచిన వైఎస్‌ను లింగాల మండలమే గెలిపించింది. అటువంటి మండలంలోనే ఇప్పుడు సీన్ మారిపోవడం గమనార్హం. వివేకా హత్య, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడం, ఐదేళ్లూ తమను పట్టించుకోకపోవడం వంటి కారణాలవల్లే జగన్ క్యాంప్‌కు స్థానిక నేతలు దూరంగా జరుగుతున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

బాబు, లోకేశ్‌లపై చెరో 23 కేసులు!

» అధిక భాగం వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టినవే

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లపై చెరో 23 కేసులు నమోదై ఉన్నాయి. నామినేషన్ల దాఖలు కోసం అడిగినప్పుడు పోలీస్ శాఖ ఈ వివరాలను వారికి ఇచ్చింది. వీటిని టీడీపీ న్యాయ విభాగం ప్రస్తుతం పరిశీలిస్తోంది. చంద్రబాబుపై సీఐడీ ఎనిమిది కేసులు పెట్టింది. ఇవిగాక జిల్లాల పర్యటనకు వెళ్లిన సమయంలో ఇతరత్రా పదిహేను కేసులు నమోదు చేశారు. లోకేశ్‌పై సీఐడీ కేసు ఒకటి ఉంది. మిగిలిన కేసులు యువగళం పాదయాత్ర సమయంలో నమోదయ్యాయి. ఈ కేసుల్లో అత్యధిక భాగం వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పెట్టారు.

ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు ప్రకటించారు. 2020-23కు సంబంధించిన అగ్రిమెంట్ చేయకుండా మిల్లు యాజమాన్యం మొండివైఖరి అవలంబిస్తోందని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని, దీనిపై 16 రోజులుగా సమ్మె చేస్తుంటే అధికార పార్టీతోపాటు ఇతర పార్టీలూ స్పందించడం లేదని తెలిపారు.

- రాజమహేంద్రవరం సిటీ

కన్నారావు కన్నేస్తే..

సాయం కోరి వచ్చిన యువకుడిపై అత్యాచారయత్నం

- » తనను తృప్తిపరిస్తే పెళ్లాడతానని చిత్రహింస
- » గెస్ట్‌హౌస్‌లో నిర్బంధించి, కొట్టి 60 లక్షల నగదు, 97 తులాల బంగారం దోపిడీ
- » కేసీఆర్ సోదరుడి కుమారుడి అక్రమాలు బయటికి.. అతడితో సహా ఐదుగురిపై కేసు



బంజారాహిల్స్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ సోదరుడి కుమారుడు కల్వకుంట్ల తేజేశ్వరరావు అలియాస్ కన్నారావు దుశ్చర్యలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. ఓ భూఆక్రమణ కేసులో ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న కన్నారావుపై పోలీసులకు మంగళవారం మరో ఫిర్యాదు అందింది. సాయం కోరి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వద్ద రూ.60 లక్షల నగదు, 97 తులాల బంగారం దోచేయడమే కాక.. అతడిపై అత్యాచారయత్నానికీ కన్నారావు పాల్పడ్డారన్నది ఫిర్యాదు సారాంశం. పంజగుట్ట (హైదరాబాద్)కు చెందిన విజయ్ (పేరు మార్చాం) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఓ భూవివాదం విషయమై 2020లో కన్నారావును కలిశాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో విజయ్ ఒంటరిగా జీవిస్తున్నాడు. తన గురించి పూర్తిగా తెలుసుకున్న కన్నారావు.. భూవివాదాన్ని పరిష్కరించడమే కాకుండా దగ్గరుండి పెళ్లి కూడా చేస్తానని తనకు హామీ ఇచ్చినట్టు విజయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మాటలు నమ్మి తాను.. కన్నారావు ఇంటికి సమీపంలోని నాడిపల్లి సంతోష్ అనే వ్యక్తి గదిలో అద్దెకు దిగానని, అక్కడ తనకు కన్నారావు స్నేహితులు బిందుమాధురి అలియాస్ నందిని చౌదరి, తులసీరాంతో పరిచయం ఏర్పడిందని తెలిపాడు. తన వద్ద భారీగా డబ్బు, నగలు ఉన్నాయని తెలుసుకున్న నందిని.. ఆ విషయాన్ని కన్నారావు దృష్టికి తీసుకెళ్లిందని, వాటిని కాజేసేందుకు కన్నారావు, నందిని, సంతోష్, తులసిరాం పథకం వేశారని పేర్కొన్నాడు. ఇందుకోసం అంతాకలిసి శ్యాంప్రసాద్ అనే వ్యక్తిని రంగంలోకి దింపారని.. నందిని కోరిక మేరకు అతనికి తన గదిలో చోటిచ్చానని తెలిపాడు. తన కదలికలను శ్యాంప్రసాద్ ఎప్పటికప్పుడు మిగిలిన వారికి చేరవేసేవాడని పేర్కొన్నాడు. ఈ క్రమంలో.. వెంగళరావునగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పెంట్ హౌస్ ఇప్పిస్తానంటూ కన్నారావు రూ.20 లక్షలు తీసుకున్నాడని, అయినా ఫ్లాట్ ఇప్పించకపోవడంతో తనకి అనుమానం వచ్చిందని తెలిపాడు. దీంతో ఆ గది ఖాళీ చేసి బంజారాహిల్స్‌కు మకాం మార్చానని.. అయినా నందిని, తులసీరాం అక్కడికి కూడా వచ్చి తనతో రోజులు తరబడి ఉండేవారని, వద్దన్నా వినేవారు కాదని పేర్కొన్నాడు. 2023 డిసెంబరు 31న నందిని, తులసీరాం కలిసి తాను ఉండే ఇంటికి వచ్చారని.. ఆ తర్వాత కాసేపటికే కన్నారావు కూడా మరికొందరితో వచ్చి కత్తులు చూపి, చంపేస్తామంటూ బెదిరించి తన ఇంట్లో ఉన్న ఆభరణాలను దోచుకున్నారని విజయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం తనను కిడ్నాప్ చేసి కన్నారావు గెస్ట్‌హౌస్‌కు తరలించి నిర్బంధించారని.. అక్కడ తనను కుర్చీకి కట్టేసి కన్నారావు దారుణంగా చిత్రహింసలు పెట్టాడని.. రాత్రుళ్లు తనపై అత్యాచారయత్నానికీ పాల్పడ్డాడని, తనను సుఖపెడితే పెళ్లి చేసుకుంటానని బలవంతం చేశాడని వాపోయాడు. కాదంటే.. భుజంగరావు అనే ఏసీపీకి ఫోన్ చేసి, ఆ ఫోన్ తనకిచ్చి మాట్లాడమనేవాడని.. ఫోన్‌లో మాట్లాడ్డానికి నిరాకరిస్తే.. "భుజంగరావు ఇక్కడికి వస్తే నిన్ను జైల్లో పెడతాడు. నీ ప్రాణం తీస్తాడు" అని బెదిరించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయినా తాను లొంగకపోవడంతో.. కన్నారావు తనను బ్యాంకుకు తీసుకెళ్లి, బలవంతంగా లాకర్ తెరిపించి అందులోని 97 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడని, తన ఖాతాలో ఉన్న రూ.40 లక్షలను అతడి ఖాతాలోకి బదిలీ చేయించుకున్నాడని ఆరోపించాడు. ఈ విషయాలు ఎవరికైనా చెబితే తన వద్ద రివాల్వర్‌తో కాల్చి చంపేస్తానంటూ బెదిరించి వదిలిపెట్టాడని పేర్కొన్నాడు. కన్నారావుకు భయపడి ఈ విషయాన్ని ఇన్నాళ్లూ బయటపెట్టలేదని.. అతడు ఓ భూకబ్జా కేసులో జైలుకు వెళ్లాడని తెలియడంతో ధైర్యం తెచ్చుకుని ఫిర్యాదు చేస్తున్నానని పోలీసులకు వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. కన్నారావు, నందిని, తులసీరాం, శ్యాంప్రసాద్, సంతోష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సినీనటుడు రఘుబాబు
కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- » మృతుడు నల్లగొండ బీఆర్ఎస్ పట్టణ నేత
- » బైక్‌తో రోడ్డు దాటుతుండగా ఢీ
- » ఆ సమయంలో రఘుబాబు చేతుల్లోనే స్టీరింగ్
- » నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ప్రమాదం
- » అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు



బైక్‌ను ఢీకొన్న రఘుబాబు కారు



మృతుడు జనార్దన్ (ఫైల్)

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 17: సినీనటుడు, సీనియర్ నటుడు గిరిబాబు కుమారుడు రఘుబాబు నడుపుతున్న కారు ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీకొంది. ఈ ఘటనలో ఆ బైక్ మీదున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ జిల్లా కేంద్రం శివారు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈ ప్రమాదం సంభవించింది. మృతుడు బీఆర్ఎస్ నాయకుడు, నల్లగొండ శ్రీనగర్ కాలనీకి చెందిన సందినేని జనార్దన్ రావు (55). బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జనార్దన్ రావు రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా. అద్దంకి బైపాస్ రోడ్డులో ఓ వెంచర్ ఏర్పాటు చేసి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై వెంచర్‌కు వెళుతూ నల్లగొండ శివారులోని లెప్రసీ కాలనీ వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళుతున్న రఘుబాబు బీఎండబ్ల్యూ కారు, జనార్దన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో జనార్దన్ గాల్లోకి ఎగిరి కారు బానెట్‌పై పడి.. పక్కన డివైడర్‌పై పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. టూటౌన్ ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రఘుబాబు వెనుకే ఆయన కుమారుడు రేంజ్‌రోవర్ కారులో వస్తూ ప్రమాదస్థలి వద్ద ఆగారు. ఆ రేంజ్‌రోవర్‌లోనే రఘుబాబును పోలీసులు ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన పోలీసుల అదుపులోనే ఉన్నారు. జనార్దన్ రావు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు రఘుబాబుపై 304/ఏ సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఎన్‌సీఈటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల 'ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)'లో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఆర్ఐఈలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. వీటి వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. దేశంలోని 178 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లోని హెచ్‌ఈఐలు - ప్రోగ్రామ్‌లు - సీట్లు

తెలంగాణ: హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. మంచిర్యాలలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది.

ఆంధ్రప్రదేశ్: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. శ్రీకాకుళంలోని డా.బీ.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

- ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రోపార్, ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ భువనేశ్వర్, నిట్ త్రిపుర, నిట్ కాలికట్, నిట్ పుదుచ్చేరీల్లో బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. నిట్ తిరుచిరాపల్లిలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది.
- **సీట్లు:** ప్రతి హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్(హెచ్‌ఈఐ)లో ప్రతి ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి.
- ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 100 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హత వివరాల కోసం సంబంధిత సంస్థల వెబ్‌సైట్లను చూడవచ్చు.


ఎన్‌సీఈటీ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 181 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వీటిలో మొత్తం 160 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఈ పరీక్షలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో అభ్యర్థి ఎంచుకున్న రెండు లాంగ్వేజ్‌ల నుంచి ఒక్కోదానిలో 23 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానిలో 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో అభ్యర్థి ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన మూడు సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 28 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానిలో 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఈ ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల నుంచి 28 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. నాలుగో సెక్షన్‌లో టీచింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో టీచింగ్ ఆఫ్ సైన్స్, ఆర్ట్స్, మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, లాంగ్వేజెస్ అంశాల నుంచి 23 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 20 ప్రశ్నలకు ఆన్సర్ గుర్తించాలి.
- ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, అస్సామీస్, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు.
- **ఎన్‌సీఈటీ లాంగ్వేజ్‌లు:** తెలుగు, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, హిందీ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, అస్సామీస్, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ, ఇంగ్లీష్ ఫర్ కమ్యూనికేషన్, హిందీ ఫర్ కమ్యూనికేషన్ అరబిక్, బోడో, చైనీస్, డోగ్రీ, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలీ, పర్షియన్, రష్యన్, సంథాలీ, సింధీ, స్పానిష్, టిబెటన్, సంస్కృతం, గారో, ఖాశీ, పాళీ.
- **ఎన్‌సీఈటీ సబ్జెక్టులు:** అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్(స్కల్ప్చర్/పెయింటింగ్)/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోమ్‌సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్-ప్రాక్టీసెస్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్స్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 2 నుంచి 4 వరకు
- **అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాల ప్రకటన:** మే చివరి వారంలో
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు
- **ఎన్‌సీఈటీ 2024 తేదీ:** జూన్ 12
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, ncet.samarth.ac.in/

నిట్ జలంధర్‌లో ఎంబీఏ



జలంధర్‌లోని డా.బీ.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ - ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 15, ఓబీసీ అభ్యర్థులకు 10, ఎస్సీ అభ్యర్థులకు 6, ఎస్టీలకు 3, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4 సీట్లు నిర్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులందరికీ క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో కలిపి జనరల్ అభ్యర్థులకు కనీసం 12 మార్కులు; రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 10.5 మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **కౌన్సెలింగ్:** మే 26
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 25
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in

ఎన్‌ఎల్‌యూలో ఎంబీఏ ఇన్సూరెన్స్

జోధ్‌పూర్‌లోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ)కి చెందిన స్కూల్ ఆఫ్ ఇన్సూరెన్స్ స్టడీస్- ఎంబీఏ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, ఫైర్ ఇన్సూరెన్స్, మోటార్ ఇన్సూరెన్స్, ఇన్సూరెన్స్ రెగ్యులేషన్స్, లా ఆఫ్ కాంట్రాక్ట్ అండ్ ఇన్సూరెన్స్ లా, మేనేజీరియల్ ఎకనామిక్స్, బిజినెస్ కమ్యూనికేషన్, రిస్క్ మేనేజ్‌మెంట్, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, మెరైన్ ఇన్సూరెన్స్, ఇన్సూరెన్స్ మేథమెటిక్స్, ఇన్సూరెన్స్ మార్కెటింగ్, లయబిలిటీ అండ్ ఏవియేషన్ ఇన్సూరెన్స్, ఇంజనీరింగ్-పెట్రోకెమికల్ అండ్ ఎనర్జీ రిస్క్, గ్రూప్ ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్స్, అగ్రికల్చర్ అండ్ క్రాప్ ఇన్సూరెన్స్, రీసెర్చ్ మెథడాలజీ అండ్ స్టాటిస్టిక్స్, హెచ్‌ఆర్ఎం అండ్ ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్సూరెన్స్ అకౌంటింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులకు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక: డిగ్రీ మార్కులకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 10
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** www.nlujodhpur.ac.in

జాబ్ కార్నర్

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్‌లో హ్యాండీమన్, యుటిలిటీ ఏజెంట్స్

మొత్తం ఖాళీలు: 422

న్యూఢిల్లీలోని ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: **130 పోస్టులు**
2. హ్యాండీమ్యాన్/హ్యాండీ ఉమెన్: **292 పోస్టులు**

అర్హత: హ్యాండీమన్/హ్యాండీ ఉమెన్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్/హిందీ భాషల్లో పరిజ్ఞానం ఉండాలి. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ హెచ్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

జీతం: నెలకు యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టుకు రూ.24,960. హ్యాండీమ్యాన్/హ్యాండీ ఉమెన్ పోస్టుకు రూ.22,530

వయోపరిమితి: జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీలకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 33 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: పోస్టులను అనుసరించి ట్రేడ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

వాక్-ఇన్ తేదీలు: 2024 మే 2, 4

స్థలం: హెచ్‌ఆర్‌డీ డిపార్ట్‌మెంట్ కార్యాలయం, ఏఐ యూనిటీ కాంప్లెక్స్, పల్లవరం కంటోన్మెంట్, చెన్నై.

వెబ్‌సైట్: https://www.aiasl.in/

ఎన్‌ఎల్‌సీలో ఖాళీలు

మొత్తం ఖాళీలు: 34

కడలూరు(తమిళనాడు) జిల్లాలోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన తలబిరా ప్రాజెక్టులో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ వర్కర్(డ్రాఫ్ట్‌మన్): **1 పోస్టు**
2. ఇండస్ట్రియల్ వర్కర్(ఎలక్ట్రీషియన్): **3 పోస్టులు**
3. ఇండస్ట్రియల్ వర్కర్(ఫిట్టర్): **2 పోస్టులు**
4. ఇండస్ట్రియల్ వర్కర్(మెకానిక్-మోటర్ వెహికిల్): **2 పోస్టులు**
5. ఇండస్ట్రియల్ వర్కర్(ఫైర్‌మ్యాన్): **1 పోస్టు**
6. క్లరికల్ అసిస్టెంట్: **17 పోస్టులు**
7. జూనియర్ ఇంజనీర్(సివిల్): **5 పోస్టులు**
8. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): **2 పోస్టులు**
9. జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, ఐటీఐ, డిప్లొమా డిగ్రీ ఉత్తీర్ణత.

గరిష్ఠ వయోపరిమితి: 35 సంవత్సరాలు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

వెబ్‌సైట్: www.nlcindia.in

ఎన్ఐఎన్‌లో ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 5

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ మెడికల్ ఆఫీసర్: **1 పోస్టు**
2. సీనియర్ రీసెర్చ్ ఫెలో: **1 పోస్టు**
3. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **2 పోస్టులు**
4. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఎంఎల్‌టీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: జూనియర్ మెడికల్ ఆఫీసర్, సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు 35 ఏళ్లు; సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: suryachuka@gmail.com

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

వెబ్‌సైట్: www.nin.res.in/



సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 861

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే... 2024-25 సంవత్సరానికి నాగ్‌పూర్ డివిజన్, మోతిబాగ్ వర్క్‌షాప్(నాగ్‌పూర్)లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, పెయింటర్, వైర్‌మన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్.

అర్హత: అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 9

వెబ్‌సైట్: secr.indianrailways.gov.in/

ఇండియన్ ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్స్

మొత్తం ఖాళీలు: 30

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో 2025 జనవరిలో ప్రారంభమయ్యే 140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన అవివాహిత పురుషుల నుంచి ఇండియన్ ఆర్మీ దరఖాస్తులు కోరుతోంది.

కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్స్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 20 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: అప్లికేషన్స్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1/స్టేజ్-2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 9

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

లిటిల్స్



దేశం- జపాన్

- జపాన్ అంటే సూర్యుడు ఉదయించే భూమి. 6800 ద్వీపాల సముదాయమే జపాన్.
- ఈ దేశంలో పురుషుల ఆయుర్ప్రమాణం 78 ఏళ్లు అయితే.. మహిళల ఆయు ప్రమాణం 84 ఏళ్లు. ఇకపోతే వందేళ్లు బతికిన వాళ్లు ఇక్కడ 90 వేల మంది ఉన్నారు.
- ప్రపంచంలోనే కచ్చితమైన సమయానికి రైళ్లు నడిపించే దేశమిది. ఆలస్యమయితే మహా 18 సెకన్లు మాత్రమే ఉంటుంది. 'షింకాన్‌సేన్' అనే బుల్లెట్ రైల్ గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ఇక్కడ చతురస్రాకారంలో ఉండే పుచ్చకాయలు దొరుకుతాయి.
- పిల్లలకంటే పెట్స్ అధికంగా ఉండే దేశమిది.
- రోబోటిక్స్ ఆటోమేషన్‌లో ఈ దేశం అడ్వాన్స్‌గా ఉంటుంది. అసిమో హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేసింది ఈ దేశానికి చెందిన సంస్థ హోండా.




- ట్రావెలర్స్ నిద్రపోవటానికి 'పాడ్స్' అనే చిన్న ఇళ్లలాంటివి ఉంటాయి. వీటిని క్యాప్సూల్ హోటల్స్ అని పిలుస్తారు.
- యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్స్ ఇక్కడ 19 ఉన్నాయి. ఇవన్నీ 17 శతాబ్దానికి చెందినవే.
- పసిఫిక్ సముద్రం దగ్గర ఉండే ఈ దేశంలో భూకంపాలు, సునామీల తాకిడి ఎక్కువ. భూకంపాలు జపాన్‌లో సర్వసాధారణం. సంవత్సరంలో 1500 భూకంపాలు వస్తాయి ఇక్కడ. వీటికి తగినట్లే ఇళ్ల నిర్మాణం ఉంటుంది.
- ఇక్కడ అధికార భాష జపనీస్. కరెన్సీ పేరు 'యెన్'. రాజధాని పేరు టోక్యో. సుమో వ్రెస్లింగ్ ఇక్కడ పాపులర్ గేమ్.
- ప్రపంచంలోనే అతి తక్కువ క్రైమ్ రేట్ ఉండే దేశమిదే.
- ఇక్కడ 67 శాతం అడవులు ఉన్నాయి. మార్షల్ ఆర్ట్స్, జూడో, కరాటే.. లకు పెట్టింది పేరు.
- ప్రపంచంలోనే అతి శుభ్రంగా ఉండే దేశమిదే. వీధుల్లో చెత్త కూడా కనిపించదు. ఎందుకంటే అన్ని వయసుల వాళ్లు తమ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవటానికి వలెంటీర్లుగా పని చేస్తారు.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



12 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 284

3	7		8					4
		1					9	
		9				3	8	
				6	5		7	
6			2		7			8
	1		3	8				
	5	4				2		
	2					6		
1					2		4	5

సుడోకు - 283 సమాధానం

5	1	9	4	3	7	8	2	6
4	2	6	1	8	9	7	3	5
8	7	3	5	6	2	4	9	1
2	4	5	3	7	6	1	8	9
9	8	7	2	1	4	6	5	3
6	3	1	9	5	8	2	4	7
7	5	2	6	4	3	9	1	8
3	6	4	8	9	1	5	7	2
1	9	8	7	2	5	3	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

కొత్త కబుర్లు

బెల్లంకొండ హారర్ మిస్టరీ



శ్రీరామ నవమి సందర్భంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నిర్మించే కొత్త చిత్రాన్ని నిర్మాత సాహు గారపాటి ప్రకటించారు. 'భగవంత్ కేసరి' సంచలన విజయం తర్వాత ఆయన నిర్మించే ఈ హారర్, మిస్టరీ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. శ్రీరాముడు తన చేతిలోని విల్లుతో బాణాన్ని ఆకాశంలో ఉన్న రాక్షసుడికి ఎక్కుపెట్టడం , షాడో తోలుబొమ్మలాట, నిర్జనమైన అడవి, యాంటెన్నా టవర్, హార్నెట్... ఇవన్నీ ఆ పోస్టర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సహ రచయిత: దరహాస్ పాలకొల్లు, సంగీతం: బి.అజనీష్ లోకనాథ్, సమర్పణ: అర్చన, రచన, దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి.

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



ఇటీవల 'ఓం భీమ్ బుష్' చిత్రంతో విజయాన్ని పొందిన హీరో శ్రీవిష్ణు తన కొత్త చిత్రం వివరాలు బుధవారం ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రంలో ఆయన సరసన నటించిన రెబా జాన్ ఇందులో హీరోయిన్. హసిత్ గోలి దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికి అరవై శాతం షూటింగ్ పూర్తయిందనీ, వీలైనంత త్వరగా మిగిలిన సినిమాను పూర్తి చేస్తామని నిర్మాతలు చెప్పారు. ఓ ఆసక్తికరమైన అంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వీర్ ఆర్యన్, అయ్యప్ప శర్మ, సుదర్శన్, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, ఎడిటింగ్: శ్రీకరప్రసాద్.

వీర ధీర శూరుడు



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే నటుడు విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 62వ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. తమిళంలో ఈ సినిమాకు 'వీర ధీర శూరన్' అనే పేరు నిర్ణయించారు. టైటిల్ టీజర్ విడుదల చేశారు. తెలుగు టైటిల్ త్వరలో ప్రకటిస్తారు. ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ పక్కా మాస్ పాత్ర పోషిస్తున్నట్లు 225 సెకన్లు ఉన్న టైటిల్ టీజర్ చెప్పకనే చెప్పింది. ఇందులో కిరాణా షాప్ ఓనర్ కాళీ పాత్రను ఆయన పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు.

తంగలాన్ గ్లింప్స్


విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' స్పెషల్ గ్లింప్స్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. సినిమా కోసం విక్రమ్ ఎంత కష్టపడ్డారో ఈ గ్లింప్స్ చూపించింది. ఈ సినిమా గురించి దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ 'చరిత్రలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనల నేపథ్యంలో అడ్వెంచర్ మూవీగా 'తంగలాన్'ను అందిస్తున్నాం. విక్రమ్‌తో పాటు టీమ్ కూడా నాకు ఎంతో సహకరించింది. ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ జియో స్టూడియోస్ మా సినిమా కోసం స్టూడియో గ్రీన్‌తో చేతులు కలపడం ఆనందంగా ఉంది' అన్నారు. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా 'తంగలాన్'ను విడుదల చేస్తామని నిర్మాత జ్ఞానవేల్ రాజా చెప్పారు.

సుందరకాండ సందడి




త్వరలోనే 'ప్రతినిధి 2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు నారా రోహిత్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం నుంచి స్పెషల్ అప్‌డేట్ వచ్చింది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం చేస్తూ, సంతోష్ చిన్నపొళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్న చిత్రానికి 'సుందరకాండ' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. అలాగే సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీరామనవమి సందర్భంగా 'సుందరకాండ' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. వృతి వాఘని ఈ చిత్రంలో కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయ కృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ప్రదీప్ ఎం. వర్మ

జర్నీ టూ అయోధ్య



రామాయణం ఆధారంగా టాలీవుడ్‌లో మరో భారీ చిత్రం రూపుదిద్దుకోనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, చిత్రాలయం బేనర్‌పై భారీస్థాయిలో నిర్మించేందుకు నిర్మాత వేణు దోనెపూడి సన్నాహాలు మొదలుపెట్టారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఆయన ఈ చిత్రాన్ని ప్రకటించారు. దర్శకుడు వి.ఎన్ ఆదిత్య కథను అందిస్తున్నారు. 'జర్నీ టూ అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయోధ్యప్రాంతంలో లొకేషన్ల అన్వేషణలో చిత్రబృందం పాల్గొంటోంది. తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల కాంబినేషన్‌లో వస్తున్న 'విశ్వం' సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలసి చిత్రాలయం స్టూడియోస్ నిర్మిస్తోంది.



రిలీజ్ డేట్ చెప్పేశారు

ఇంతవరకూ తను పోషించని పాత్రలో నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నితిన్ గెటప్ నుంచి క్యారెక్టరైజేషన్ వరకూ సరికొత్తగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదం కలిగిన ఈ సినిమాను డిసెంబర్ 20న విడుదల చేస్తున్నాం. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు మా సినిమాకు కలసి వస్తాయనుకుంటున్నాం' అని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చుని ఉన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.

బ్యూటిఫుల్ ఫీల్ ఇచ్చేలా...



'పొలిమేర-2' చిత్రంతో సెన్సేషనల్ సక్సెస్‌ను అందుకున్నారు సత్యం రాజేశ్. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'టెనెంట్'. మేఘా చౌదరి, చందన పయ్యావుల, ఎస్తర్ నోరోన్హా, భరత్‌కాంత్ కీలక పాత్రలు పోషించారు. వై.యుగంధర్ దర్శకత్వం వహించారు. చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అందరిలో అంచనాలను పెంచేసింది. రేపు ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా హీరో సత్యం రాజేశ్ మీడియాతో ముచ్చటించారు.

"ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగే స్టోరీ 'టెనెంట్'. కొత్తగా పెళ్లైన ఓ జంట..ఎన్నో ఆశలతో నూతన జీవితాన్ని మొదలుపెడుతుంది. ఆనందంగా సాగిపోతున్న వారి జీవితంలోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తుల వల్ల ఆ భార్యాభర్తల మధ్య వచ్చే ప్రాబ్లమ్స్‌ను ఇందులో చూపించాం. ఇందులోని సన్నివేశాలు వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. ప్రేక్షకులకు బ్యూటిఫుల్ ఫీల్ ఇచ్చేలా ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమాలో ట్విస్ట్‌లు ఉండవు కానీ.. సస్పెన్స్ ఉంటుంది. మర్డర్ మిస్టరీ కాబట్టి చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ చూసి ప్రేక్షకులు సింపతీతో బయటకు వస్తారు. సినిమాలో నేను మాట్లాడేదే చాలా తక్కువ. కానీ ప్రేక్షకులు ఎక్కడా బోర్ ఫీల్ అవ్వరు. భారీ బడ్జెట్, యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రాలు కాకుండా నాకు సూటయ్యే మంచి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాలనే ఎంపిక చేసుకుంటున్నా. ప్రస్తుతం 'స్ట్రీట్ ఫైట్' సినిమాలో మెయిన్ లీడ్‌గా చేస్తున్నా, 'మిస్టర్ బచ్చన్'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నా" అని చెప్పారు.



యుద్ధం... సన్నద్ధం

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా స్పెషల్ అప్డేట్‌ను మేకర్స్ వదిలారు. త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'మీ ముందుకు... ధర్మంకోసం యుద్ధం త్వరలో' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

మహిళలకు ఆసరా ఆదిశక్తి



హీరోయిన్ సంయుక్త మీనన్ 'ఆదిశక్తి' అనే సేవా సంస్థను శ్రీరామనవమి సందర్భంగా ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా మహిళలకు అనేక రంగాల్లో సహకారం అందించబోతున్నారు. సమాన అవకాశాలు కల్పించి వారిని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడపాలనే లక్ష్యంతో ఆమె ఈ సంస్థను స్థాపించారు. విద్య, ఉపాధి, శిక్షణ, ఆరోగ్యం వంటి విషయాలలో మహిళలకు ఆసరాగా నిలవనుందీ సంస్థ. మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని. అన్ని రంగాల్లో తమ గొంతు వినిపించాలనేది 'ఆదిశక్తి' సంస్థ ఉద్దేశమని సంయుక్త తెలిపారు.

రెండు యుగాల కథ



వైవిధ్యమైన కథలతో హీరోగా సక్సెస్‌లు అందుకొంటున్నారు తిరువీర్. ఆయన కథానాయకుడిగా నటించే తదుపరి చిత్రం ఖరారైంది. ఘంటా సతీశ్‌బాబు దర్శకత్వంలో రాధాకృష్ణ తేలు, రామకృష్ణారెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కార్తీక మురళీధరన్ కథానాయిక. త్రేతాయుగం, కలియుగం నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కుతోంది. అయ్యప్ప పి. శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ:రామిరెడ్డి

పాటల పల్లకిలో...

'ఒసేయ్ అరుంధతి' టైటిల్ ట్రాక్



కమల్ కామరాజు, మోనికా చౌహాన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, చిత్రం శ్రీను, అరియానా గ్లోరి, సునీతా మనోహర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫ్యామిలీ కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని విక్రాంత్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. గూడూరు ప్రణయ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి టైటిల్ ట్రాక్‌ను విడుదల చేశారు. చిత్ర దర్శకుడు విక్రాంత్‌కుమార్ ఈ పాటకు లిరిక్స్ అందించగా, సునీల్ కశ్యప్ సంగీతం అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఈ సందర్భంగా నిర్మాత గూడూరు ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని" చెప్పారు. చిత్ర దర్శకుడు విక్రాంత్‌కుమార్ మాట్లాడుతూ "ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అని అన్నారు.

ఇంటి ముందు వాలిపోతా



'ఒక్క మాట చెప్పు చాలు ఇంటి ముందు వాలిపోతా' అంటూ డ్యూయట్ పాడుకుంటున్నారు అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి. రావు రమేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జిరాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మిస్తున్నారు. చిత్రబృందం బుధవారం 'మేడమ్ సార్' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. సిద్ శ్రీరామ్ ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యానికి కల్యాణ్ నాయక్ బాణీ కట్టారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇంద్రజ, అంకిత్ కొయ్య, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషించారు. సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాల్‌రెడ్డి



ఆ పాయింట్ థ్రిల్ చేస్తుంది

- అఖిలేశ్ కలారు



'స్వతంత్ర భావాలున్న అమ్మాయి, సాఫ్ట్‌వేర్ అబ్బాయి మధ్య సాగే ప్రేమాయణమే 'మార్కెట్ మహాలక్ష్మి'. ఈ సినిమాలో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అంశం ఒకటుంది. ఇప్పటివరకూ ప్రచార చిత్రాల్లో దాన్ని వెల్లడించలేదు. ఆ పాయింట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది' అని నిర్మాత అఖిలేశ్ కలారు అన్నారు. వి.ఎస్ ముఖేశ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రమిది. పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటించారు. ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా అఖిలేశ్ మీడియాతో మాట్లాడారు. 'అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. సినిమాలపై మక్కువతో నిర్మాతగా మారాను. ముఖేశ్ చాలాకాలంగా తెలుసు. ఆయన చెప్పిన కథ నచ్చి 'మార్కెట్ మహాలక్ష్మి' సినిమాను నిర్మించాను. ఇండస్ట్రీలో మంచి నిర్మాతగా పేరు తెచ్చుకునేవరకూ నా ప్రయాణం కొనసాగుతుంది' అన్నారు.

ఆకట్టుకునే 'సిల్క్ శారీ'



వాసుదేవరావు, రీనా చౌదరి, ప్రీతి గోస్వామి నటిస్తున్న చిత్రం 'సిల్క్ శారీ'. టి.నాగేందర్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. కమలేశ్ కుమార్, రీవా చౌదరి, రాహుల్ అగర్వాల్, హరీశ్ చండక్ నిర్మిస్తున్నారు. బుధవారం నిర్మాత రాజ్ కందుకూరి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్ బాగుంది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సిల్క్ శారీ' కథ గొప్పగా ఉంది" అని అన్నారు. హీరో వాసుదేవరావు మాట్లాడుతూ "ఓ ఆసక్తికరమైన సంఘటన నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయగ్రాహకుడు:సనక రాజశేఖర్, సంగీతం:వరికుప్పల యాదగిరి.

పోలీస్ వారి పాట



అఖిల్ సన్నీ, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం వైజాగ్ పరిసరాల్లో పాటల చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో నల్లగొండలో క్లైమాక్స్ పార్ట్ చిత్రీకరణ చేస్తామనీ, దాంతో షూటింగ్ పూర్తవుతుందని నిర్మాత చెప్పారు. సంగీత దర్శకుడు గజ్వేల్ వేణును నటుడిగా పరిచయం చేస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్, సంజయ్ నాయర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నళినీ కాంత్